ఆదివారం
7•1•2018
హైదరాబాద్
• వెల.6 రూ.
• సంపుటి 7 • సంచిక 211
• పేజీలు : 16 + (24/16) + 36 పేజీల ఆదివారం అనుబంధం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
Dwaraka
PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD

నిరంతర విద్యుత్ అత్యుత్తమం







- తెలంగాణ నిర్ణయం రైతులకు వరం
- సీఎం కేసీఆర్‌కు ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త స్వామినాథన్ అభినందనలు
- వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్‌పై లేఖ
- రైతాంగం తరపున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వ్యవసాయానికి 24గంటలపాటు విద్యుత్ సరఫరాచేయాలని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రశంసలనందుకుంటున్నది. ఈ క్రమంలోనే ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త, ఎంఎస్ స్వామినాథన్ రిసెర్చ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ ఎంఎస్ స్వామినాథన్ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావును అభినందిస్తూ ప్రత్యేకంగా లేఖ రాశారు. రాష్ట్ర రైతులకు 24 గంటలపాటు నిరంతరాయ విద్యుత్ సరఫరాపై చేసిన ప్రకటన తనకు ఎంతగానో సంతోషం కలిగించిందని తెలిపారు. ప్రత్యేకించి తెలంగాణలో ఎక్కువ భాగం మెట్ట ప్రాంతమైనందున ఈ నిర్ణయం రైతులకు గొప్ప వరంలాంటిదని పేర్కొన్నారు. పంటలను కాపాడే సాగునీరు వ్యవసాయ విజయానికి అత్యంత కీలకమని అన్నారు. సాగునీటి భద్రతలో అత్యంత కీలకమైన భాగంలో రైతులకు సహకరించేలా తీసుకున్న ఈ నిర్ణయంపట్ల మొత్తం రైతాంగం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆ లేఖలో స్వామినాథన్ తెలిపారు. 'మీకు, మీ కుటుంబ సభ్యులకు, మీ రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలతో, మీ కలలను సాకారం చేసుకునేలా ఈ సంవత్సరం ఉండాలని ఆకాంక్షిస్తూ.. నూతన సంవత్సర శుభాకాంక్షలు' అని స్వామినాథన్ తన లేఖలో పేర్కొన్నారు.



లాలూకు జైలు మూడున్నరేండ్లు

దాణా కుంభకోణం రెండో కేసులో ప్రత్యేక సీబీఐ కోర్టు శిక్ష

రూ.10 లక్షల జరిమానా

3

భవనాల అన్వేషణకు జడ్జీల కమిటీ

ఎంపికచేసిన తాత్కాలిక చీఫ్ జస్టిస్

వచ్చేనెలలో పరిశీలనకు వెళ్లే అవకాశం

ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్‌కు మరో రెండు కమిటీలు

ఏపీకి హైకోర్టుపై ముందడుగు



శనివారం చందానగర్‌లో నిర్వహించిన మన నగరం కార్యక్రమంలో మంత్రి కే తారకరామారావుతో మంత్రి మహేందర్‌రెడ్డి, హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తదితరులు 2

ఉద్యమంలా జలం-జీవం

ఆరు నెలలపాటు ఇంకుడు గుంతల ఏర్పాటు

300 గజాలు దాటిన ఇండ్లకు తప్పనిసరి

ఏర్పాటుచేయకుంటే అపరాధ రుసుం

3100కోట్లతో శివార్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ

గేటెడ్ కమ్యూనిటీల్లో సీవరేజ్ ప్లాంట్ తప్పనిసరి

పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కే తారక రామారావు

వేములవాడ అభివృద్ధికి వంద రోజుల ప్రణాళిక

మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే చెన్నమనేని భేటీలో నిర్ణయం • అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల సమన్వయంతో పనులు వేగంగా జరిపించాలని మంత్రి సూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి వంద రోజుల ప్రణాళికను అమలుచేయాలని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కే తారక రామారావు, ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ నిర్ణయించారు. శనివారం బేగంపేటలో మంత్రితో ఎమ్మెల్యే రమేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రూ.వేయి కోట్లతో చేపట్టిన వేములవాడ అభివృద్ధి పనులపై చర్చించారు. నియోజకవర్గంలో వివిధ నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా రెండు లక్షల ఎకరాలకు నీటిని అందించే పనులు వేగంగా పూర్తయ్యేట్లు చూడాలని సమావేశంలో నిర్ణయించారు. వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ)కి సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ.400కోట్లు కేటాయించారని, ఆ పనులు వేగవంతమయ్యేలా అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీలను సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. వేములవాడ బైపాస్‌రోడ్డు, రెండు బ్రిడ్జిలు, వేములవాడ పట్టణ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎమ్మెల్యే రమేశ్ కోరగా, నిధులకు ఎలాంటి కొరత లేదని మంత్రి కేటీఆర్ తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పన, పనులు త్వరగా జరిపించేందుకు కృషి చేయాలన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందుతుందని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ అభివృద్ధికి ఎన్ని నిధులు కేటాయించేందుకైనా సిద్ధమని మంత్రి చెప్పారు. నిరుడు మహాశివరాత్రి సందర్భంగా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 12 గంటల నిర్విరామ శివార్చన కార్యక్రమాన్ని దాదాపు లక్ష మంది భక్తులు వీక్షించారని చెన్నమనేని తెలిపారు. ఈ ఏడాది కూడా అటువంటి కార్యక్రమాన్ని నిర్వహించడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు. అన్ని రంగాల్లో రాజన్న సిరిసిల్లను నంబర్‌వన్‌గా ఉంచడానికి కృషి చేద్దామని మంత్రి అన్నారు. ఇంటింటికి తాగునీటిని అందించే కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, ముంపు గ్రామాల పునరావాస కార్యక్రమాలు తదితర అంశాలపై కూడా చర్చించారు.



వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిపై శనివారం బేగంపేటలో మంత్రి కే తారక రామారావుతో చర్చిస్తున్న ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్

సర్కార్ దవాఖానల్లో మాత్రమే కేసీఆర్ కిట్



హైదరాబాద్, నమస్తేతెలంగాణ: తల్లి, బిడ్డల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్ పథకాన్ని కేవలం ప్రభుత్వదవాఖానల్లో మాత్రమే అమలు చేస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పష్టం చేసింది. ప్రైవేటు వైద్యకళాశాలలు, దవాఖానల్లో కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నదని ప్రసారమాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ సంచాలకురాలు వాకాటి కరుణ ఒక ప్రకటన విడుదల చేశారు. కేసీఆర్ కిట్ పథకం ప్రత్యేకించి గ్రామీణ, పట్టణ పేద గర్భిణుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారని చెప్పారు. ఈ పథకం కింద ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆమె తెలిపారు.

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో స్టాఫ్‌నర్స్ ఖాళీల వివరాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: స్టాఫ్‌నర్స్ కొలువుల భర్తీలో భాగంగా సవరించిన ఖాళీల వివరాలను తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. తెలంగాణ వైద్యవిధాన పరిషత్‌లోని 835 ఖాళీలు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్‌లో 2476 ఖాళీల తుది వివరాలు బ్రేకప్‌ల వారీగా ఉంచినట్టు వివరించింది. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 8వరకు గడువు ఉన్నట్టు పేర్కొన్నది.

వెబ్‌సైట్లో పీసీబీ కొలువుల ఎంపిక జాబితా

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, అనలిస్ట్ గ్రేడ్-2, స్టెనో కం టైపిస్ట్ కొలువులకు ఎంపిక ప్రక్రియ పూర్తయినట్టు టీఎస్‌పీఎస్సీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల జాబితా ఈ నెల 8 నుంచి టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచనున్నారు.

కేంద్రసాహిత్యఅకాడమీ జనరల్ కౌన్సెల్ సభ్యుడిగా ప్రొఫెసర్ ఐలయ్య

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సెల్ సభ్యుడిగా వరంగల్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఐలయ్యను రాష్ట్ర ప్రభుత్వం నామినేట్ చేసింది. ఈ మేరకు శనివారం డిప్యూటీ సీఎం కడియం శ్రీహరిని ప్రొఫెసర్ ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి ఐలయ్య ఎంతో కృషిచేశారని శ్రీహరి అభినందించారు.

టెర్రస్ గార్డెనింగ్‌పై 10 నుంచి శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్స్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో టెర్రస్ గార్డెనింగ్‌పై రెండు రోజుల శిక్షణ నిర్వహించనున్నారు. ఈ మేరకు అగ్రి, హార్టీ కల్చర్ సొసైటీ శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తి ఉన్న వారు 8885641700 , 9000400507 నంబర్లలో సంప్రదించాలని కోరింది.

ముహూర్తం

సూర్యోదయం: 6.52 గంటలకు

సూర్యాస్తమయం: 5.53 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, షష్ఠి సాయంత్రం 4.06 వరకు, తదుపరి సప్తమి, నక్షత్రం: పుబ్బ తె. 1.21 వరకు తదుపరి ఉత్తర, అమృత ఘడియలు: సాయంత్రం 6.02 నుంచి రాత్రి 7.38 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.30 నుంచి 5.53 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.25 నుంచి 5.09 వరకు, వర్జ్యం: తె. 1.45 నుంచి 3.21 వరకు.

లోకం పోకడ



అది సరే... ఈ తరం మనల్ని గుర్తు పెట్టుకొని ఓట్లేయాలంటే ఏంచేయాలో చెప్పండి!!

ఉద్యమంలా జలం-జీవం

- ఆరు నెలలపాటు ఇంకుడు గుంతల ఏర్పాటు
- 300 గజాలు దాటిన ఇండ్లకు తప్పనిసరి
- ఏర్పాటుచేయకుంటే అపరాధ రుసుం
- వర్షపునీటి సంరక్షణకు అంతా కృషిచేయాలి
- 3100కోట్లతో శివార్లలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ
- గేటెడ్ కమ్యూనిటీల్లో సీవరేజ్ ప్లాంట్ తప్పనిసరి
- లేకుంటే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వరు
- డస్ట్‌బిన్లు ఇస్తే.. పప్పులు పోసుకుంటున్నారు
- 'చల్తాహై' అనే ధోరణి అందరిలో మారాలి
- మన నగరం భావనతోనే విశ్వనగరం సాకారం
- పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కే తారక రామారావు
- రెండో 'మన నగరం' కార్యక్రమం విజయవంతం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:

భూగర్భ జలాలు అడుగంటి నీటి సమస్య తలెత్తకుండా హైదరాబాద్ నగరంలో 'జలం-జీవం' పేరుతో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతలు ఏర్పాటుచేయనున్నట్టు ఐటీ, పురపాలక శాఖల మంత్రి కే తారక రామారావు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ఈ రోజు (శనివారం) నుంచి వచ్చే ఆరునెలలపాటు ఉద్యమంలా నిర్వహిస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారం 300 గజాలు దాటిన ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత ఏర్పాటుచేయనున్నట్లు చెప్పారు. లేనిపక్షంలో బాధ్యులైన ఇండ్ల యజమానులు, అధికారులకు అపరాధ రుసుం విధించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే వాటిని పరిష్కరించేందుకు ఉద్దేశించిన 'మన నగరం' కార్యక్రమాన్ని శనివారం చందానగర్‌లోని విశ్వనాథ్ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఇటువంటి సమావేశాల్లో మొదటి సమావేశాన్ని గత నెల కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత రెండో కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంఘాలు, ప్రజాసంఘాలు, పురప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన కేటీఆర్.. ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అక్కడికక్కడే ఆదేశాలు జారీచేశారు. ప్రజలు, కాలనీ సంఘాలు, ప్రజాప్రతినిధుల సూచనలు-సలహాలను ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహారాష్ట్రలోని లాతూర్‌లో గత వేసవిలో భూగర్భజలాలు పూర్తిగా అడుగంటడంతో కేంద్రం పోలీసు పహారాలో రైళ్లతో నీటిని సరఫరా చేసిందని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇతర నగరాలు కూడా దీన్ని చూసి జాగ్రత్తపడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇంటింటికీ నీటి సరఫరా చేస్తున్నప్పటికీ భవిష్యత్తులో ఎటువంటి నీటి సమస్య ఎదురుకాకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటుచేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కేటీఆర్ నొక్కి చెప్పారు. అందుకే ముందు జాగ్రత్తగా 'జలం-జీవం' పేరుతో సరికొత్త కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాడు.. 70 ఏండ్ల క్రితం పట్టణ జనాభా కేవలం 15% కాగా, ఇప్పుడది 30శాతానికి చేరిందని, తెలంగాణలో అత్యధికంగా 42% ఉందని మంత్రి వివరించారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో ఫ్లోటింగ్ జనాభాతోకలిపి 1.25కోట్ల జనాభా ఉందన్నారు. మన నగరానికి కూడా నీటి సమస్య వచ్చే అవకాశం లేకపోలేదన్నారు. నీటి సమస్య ఏదో ఒక ప్రాంతానిదికాదని, ప్రపంచవ్యాప్తంగా ఉందని పేర్కొంటూ అమెరికాలోని కాలిఫోర్నియాలో సైతం ఇటీవల నీటి సమస్య తలెత్తిన విషయాన్ని గుర్తుచేశారు.



శనివారం చందానగర్‌లోని విశ్వనాథ్ ఫంక్షన్ హాలులో 'మన నగరం' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కే తారక రామారావు. చిత్రంలో ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూడా ఉన్నారు.

ఇండ్లకు ఇంకుడు గుంతలు తప్పనిసరి

నిబంధనలు, చట్టాలు ఎన్ని ఉన్నా ప్రజల భాగస్వామ్యం లేకపోతే అవి నిరుపయోగమేనని మంత్రి కేటీఆర్ చెప్పారు. 300 గజాలకు మించిన స్థలంలో నిర్మించిన ఇండ్లలో ఇంకుడు గుంతలు ఏర్పాటుచేయాలనే నిబంధన 2000 సంవత్సరం నుంచి ఉందని, అయినా అమలుకు నోచుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నిబంధన వచ్చిన తరువాత వేల సంఖ్యలో భవనాలు వచ్చినా ఇంకుడు గుంతలు వందల సంఖ్యలో కూడా లేవన్నారు. జలం-జీవం పేరుతో నిబంధనల మేరకు అన్ని ఇండ్లకూ ఇంకుడు గుంతలు ఏర్పాటుచేస్తామని చెప్పారు.

ఆరునెలల్లో నిర్మించకుంటే అపరాధ రుసుం

జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు సంయుక్తంగా వచ్చే ఆరు నెలలపాటు నిర్దేశిత అన్ని ఇండ్లలో ఇంకుడు గుంతల ఏర్పాటు కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆరునెలల్లో ఏర్పాటుచేయని పక్షంలో స్థానిక ఇంటి యజమానితోపాటు అక్కడి బాధ్యుడైన అధికారికి జరిమానా విధిస్తామని స్పష్టంచేశారు. ఇప్పటికే నిర్మాణాలు పూర్తిచేసుకొని, విక్రయించి వెళ్లిపోయిన బిల్డర్లు సైతం తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించితీరాలని, లేనిపక్షంలో తదుపరి అనుమతుల సందర్భంగా వారినుంచి అపరాధరుసుం వసూలుచేయాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే నగరాన్ని 400 భాగాలుగా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ.. 'జలం-జీవం'పేరుతో చేపట్టే ఈ ఇంకుడు గుంతల ఉద్యమాన్ని ప్రజల భాగస్వామ్యంతో అంతటా అమలుచేయాలని కోరారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు జీహెచ్‌ఎంసీ, వాటర్‌బోర్డు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. బెంగళూరులో ఓ వ్యక్తి ప్రభుత్వ నీటి సరఫరా విభాగంనుంచి నీటి కనెక్షన్ లేకుండానే వర్షపునీటిని పొదుపుచేసుకుంటూ వాటితో జీవనం సాగిస్తున్నట్టు మంత్రి చెప్పారు. ఆ స్థాయిలో కాకున్నా కనీసం వర్షపు నీటిని సంరక్షించేందుకు తమవంతుగా కృషిచేయాలని సూచించారు.

3100కోట్లతో శివార్లలో డ్రైనేజీ వ్యవస్థ

గతంలో ప్రతి వేసవిలో వాటర్‌బోర్డు కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నాలు జరిగేవని, ఇప్పుడా పరిస్థితులు పూర్తిగా మార్చి మంచినీటి సరఫరా విషయంలో గొప్ప విజయం నమోదుచేసుకున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ కోతలు, జనరేటర్ల వాడకానికి పూర్తిగా స్వస్తి పలికామన్నారు. గ్రేటర్‌లో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లో రూ.2000 కోట్ల హడ్కో రుణంతో ఇంటింటికీ మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ వచ్చే సంవత్సరకాలంలో రూ.3100కోట్లతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటుచేస్తామని మంత్రి ప్రకటించారు.

'చల్తాహై' అనే ధోరణి మారాలి

ప్రజల అలవాట్లలో మార్పు రావాల్సి ఉందని మంత్రి కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తడి, పొడి చెత్తను విడివి

గేటెడ్ కమ్యూనిటీలకు సీవరేజ్ ప్లాంటు తప్పనిసరి

ఒకే గేటెడ్ కమ్యూనిటీలో, లేక ఒకే అపార్ట్‌మెంటులో 100 యూనిట్లకు మించి ఉంటే అందులో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుచేయాలనే నిబంధన ఉందని, అదిలేకుండా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీచేసే వీలులేదని మంత్రి చెప్పారు. ఇది కూడా సరిగా అమలుకు నోచుకోవడంలేదన్నారు. డ్రైనేజీ నీటిని ట్రీట్‌మెంట్ చేయకుండా చెరువుల్లో కలుపడంవల్ల గుర్రపుడెక్క సమస్య ఉత్పన్నమవుతున్నదన్నారు. ఏది చేసినా 'చల్తాహై' అనే ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేశారు. 'ఇది నా పని కాదు.. నేనెందుకు చేయాలి? చెత్త ఎత్తేవారు వేరే ఉన్నప్పుడు నాకేమవసరం?' అనే పద్ధతి మార్చుకొని బాధ్యతగల పౌరులుగా వ్యవహరించాలని సూచించారు. గతంలో కుటుంబంతో తాను నిర్వహించిన సింగపూర్ పర్యటన సందర్భంగా చాక్లెట్ తిని కవర్లు ఎక్కడపడితే అక్కడ వేయరాదని, వేస్తే మొదటిసారి జరిమానా, రెండోసారి జైలు శిక్ష విధిస్తారని తన కూతురికి చెప్పానని, దీంతో తన కూతురు ఇప్పటికీ చెత్తను నిర్దేశిత ప్రదేశంలోనే వేస్తున్నదని తెలిపారు. అలవాట్లను మార్చుకోవడంవల్ల మంచి ఫలితాలుంటాయన్నారు. విశ్వనగరం మన కల అని పేర్కొంటూ.. రోడ్లు, డ్రైనేజీ, దోమలు, వీధికుక్కలు, నాలాలు, మౌలిక వసతులు తదితర అనేక సమస్యలను అధిగమించాల్సిన అవసరముందని కేటీఆర్ చెప్పారు. ఇవన్నీ 'మన నగరం' అనే భావన లేకుండా సాధ్యంకావన్నారు. నగరవ్యాప్తంగా వేల సంఖ్యలో సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి సేఫ్‌సిటీగా మార్చామని చెప్పారు. ప్రగతినగర్ కాలనీలో చెట్లు అద్భుతంగా ఉన్నాయని పేర్కొంటూ స్థానిక ప్రజల కృషిఫలితంగానే అక్కడ పచ్చదనం సాధ్యమైందని ప్రశంసించారు.

డిగా వేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇంటింటికీ రెండు చొప్పున సుమారు 45లక్షల చెత్తబుట్టలను పంపిణీచేస్తే చాలామంది వాటిని బియ్యం, పప్పు పోసుకునేందుకు ఉపయోగిస్తున్నారని చెప్పారు.

ప్రజల సహకారంతోనే 'జీరో వేస్ట్'

మన చెత్తను మనం వేరు చేయకపోతే వచ్చే దుష్పరిణామాలకు ఎవరిని నిందిద్దాం? అని కేటీఆర్ ప్రశ్నించారు. నాలాల వెంబడి ఉండేవారు చాలావరకు వ్యర్థాలను నాలాల్లోనే గుమ్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు మారకపోతే ఎన్ని కోట్లు ఖర్చు చేసినా ప్రయోజనం ఉండదన్నారు. చెత్తను విడదీయడంవల్ల అనేక ప్రయోజనాలున్నాయని, తడి చెత్తతో కంపోస్ట్, పొడి చెత్తతో విద్యుత్ ఉత్పత్తికి వీలుంటుందని చెప్పారు. ప్రజలు, కాలనీ సంఘాలు ముందుకొస్తే జీరో వేస్ట్ సాధ్యమవుతుందని చెప్పారు. కాలనీ పార్కుల నిర్వహణ స్థానికులకు అప్పగిస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యను లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, రోడ్లను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. దశలవారీగా ఎస్‌ఆర్‌డీపీని పూర్తిచేస్తామని చెప్పారు. అన్ని సమస్యలూ డబ్బుతో పరిష్కారం అయ్యేవికావని, దీనికి ప్రజల సహకారం ఎంతో అవసరమని మంత్రి కేటీఆర్ స్పష్టంచేశారు. సమావేశం సందర్భంగా అందరికీ మాట్లాడే అవకాశం రాదనే ఉద్దేశంతో జనహిత పేరుతో కౌంటర్లు ఏర్పాటుచేశామని తెలిపారు. ఎవరైనా తమ సమస్యలు, చెప్పాల్సిన విషయాలను లిఖితపూర్వకంగా అక్కడ అందజేయాలని సూచించారు. వారికి రసీదు ఇస్తారని, వారి విజ్ఞప్తిపై తప్పనిసరిగా చర్యలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సుభిక్ష సుందర రాష్ట్రం


కేసీఆర్ విజన్‌తో తెలంగాణ ముందడుగు ▪ చారిత్రక కట్టడాలకు నెలవు తెలంగాణ

టూరిజంతో తెలంగాణ భవితవ్యం మారనున్నది ▪ రాష్ట్రం పట్ల ప్రధాని మోదీకి ప్రత్యేక అభిమానం

తెలంగాణకు కేంద్రం అండగా ఉంటుంది ▪ కేంద్ర అటవీ, పర్యావరణశాఖల మంత్రి మహేశ్ శర్మ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సుభిక్షమైన, సుందరమైన రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర అటవీ, పర్యావరణ, సాంస్కృతికశాఖల మంత్రి మహేశ్‌శర్మ పేర్కొన్నారు. శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి క్యాలండర్, స్టిక్కర్‌ను, పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ (ఈపీటీఆర్‌ఐ) వార్షిక నివేదికను రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్నతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మహేశ్‌శర్మ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ గొప్ప పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని కితాబిచ్చారు. కేసీఆర్ ఆలోచన విధానాన్ని కొనియాడారు. విజన్ ఉన్న నాయకుడని, ఆయన తీసుకుంటున్న వినూత్న నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. చారిత్రక ఘట్టాలకు తెలంగాణ నిలువుటద్దమని, అందుకే తెలంగాణ రాష్ట్రం పట్ల ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక అభిమానమని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అండగా ఉంటుందని, సంపూర్ణ సహకారాన్ని అందిస్తుందని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. హరితహారం కార్యక్రమం తెలంగాణ మెడలో మణిహారమని కొనియాడారు. నాలుగేండ్లలో 230 కోట్ల మొక్కలను నాటడం అంటే మామూలు విషయం కాదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హెలికాప్టర్ ద్వారా తెలంగాణలో పచ్చదనం గమనించానన్నారు. టూరిజానికి మంచి భవిష్యత్తు ఉందని, టూరిజం ద్వారా తెలంగాణ భవిష్యత్తు మారనుందన్నారు. మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న పథకాలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అనేక రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నదన్నారు. అదిలాబాద్ జిల్లాలో లైవ్‌స్టాక్ హెరిటేజ్ ఫాం నెలకొల్పాలని జోగు రామన్న కేంద్రమంత్రిని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణలో హరితహారంతోపాటు అనేక ఇతర పథకాల గురించి మంత్రి జోగురామన్న వివరించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, పీసీబీ మెంబర్ సెక్రటరీ సత్యనారాయణరెడ్డి, ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్‌జనరల్ కల్యాణ్‌చక్రవర్తి, పీసీసీఎఫ్ ప్రశాంత్‌కుమార్‌ఝా తదితరులు పాల్గొన్నారు.



శనివారం రామోజీ ఫిల్మ్ సిటీలో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న కేంద్రఅటవీ, పర్యావరణ, సాంస్కృతికశాఖల మంత్రి మహేశ్‌శర్మ, రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న తదితరులు

పర్యావరణంపై ఈపీటీఆర్‌ఐ నివేదిక

స్టేట్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ రిపోర్ట్-2015లో తెలంగాణ రాష్ట్రంలోని పూర్వజిల్లాలు నిజామాబాద్, హైదరాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం జిల్లాలలో అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యం, నీటి వనరులు, సాగునీటిరంగం, వ్యవసాయరంగం, దాని అనుబంధ రంగాలు, విద్యుత్, ఖనిజవనరులు, పర్యావరణ కాలుష్యం, వేస్ట్ మేనేజ్‌మెంట్, పరిశ్రమలు ఇలా మొత్తం 17 రంగాల అభివృద్ధి, పర్యావరణంపై ప్రభావం అనే అంశాలను గణాంక వివరాలతో పొందుపరిచినట్టు ఈపీటీఆర్‌ఐ డైరెక్టర్ జనరల్ కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. అభివృద్ధిపరంగా చోటుచేసుకుంటున్న మార్పులు పర్యావరణంపై ఎంతమేరకు ప్రభావం చూపుతున్నాయి? కాలుష్యాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకుంటూ సుస్థిరమైన అభివృద్ధిని ఎలా సాధించాలనే విషయాలను సమగ్రంగా తెలియజేసినట్టు వివరించారు. 2009 నుంచి 2015 సంవత్సరం మధ్యలో అన్నిరంగాలపై జరిగిన పర్యావరణ అధ్యయనాన్ని ఈ నివేదికలో వెల్లడించామన్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

జంతుగణనకు ముందుకు వచ్చిన వాలంటీర్లకు శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వానికి సహకారం అందించడానికి దాదాపు 600మందికి పైగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. వారిలో విద్యార్థులతోపాటు, వివిధ వృత్తులవారు ఉన్నారు. తమ పనులను కొన్ని రోజులపాటు పక్కన పెట్టి జంతుగణనలో పాల్గొంటామని చెప్పారు. ఈ నెల 22నుంచి రాష్ట్రంలోని అడవుల్లో జంతుగణన, పులుల లెక్కింపు ప్రక్రియలో పాల్గొనడానికి వచ్చిన వాలంటీర్లకు అటవీశాఖ అధికారులు హైదరాబాద్ అరణ్యభవన్‌లో శనివారం శిక్షణ ఇచ్చారు. శాస్త్రీయంగా జంతుగణనను ఏ విధంగా చేయాలనే విషయమై అటవీశాఖ వన్యప్రాణి విభాగం పీసీసీఎఫ్ మనోరంజన్ భాంజా, ఐటీ, పబ్లిసిటీ పీసీసీఎఫ్ రఘువీర్, ఓఎస్డీ శంకరన్ తదితరులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అడవుల్లో జంతుగణన పని ప్రతీ రోజు ఉదయం 6 గంటల నుంచిసాయంత్రం వరకు కొనసాగుతుందని తెలిపారు. మొదటి మూడు రోజులపాటు మాంసాహార జంతువులను, తర్వాతి మూడు రోజులపాటు శాఖాహార జంతువులను లెక్కించాలని చెప్పారు. జంతుగణన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను శంకరన్ తెలిపారు.

పోస్టర్, డైరీ విడుదల

జంతుగణనలో అధికారులతోపాటు ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బంది కూడా పాల్గొని విజయవంతం చేయాలని అటవీ, పర్యావరణశాఖ మంత్రి జోగురామన్న ఉద్యోగ సంఘాల నాయకులకు సూచించారు. అడవులు, వన్యప్రాణుల పరిరక్షణకు అందరూ సహకారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో అడవులు, జంతువుల పరిరక్షణపై రూపొందించిన పోస్టర్‌ను, ఉద్యోగ సంఘం డైరీని ఆయన సచివాలయంలో శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దాణా కుంభకోణం కేసులో తీర్పు వెలువరించిన అనంతరం కోర్టు నుంచి బయటకు వస్తున్న స్పెషల్ సీబీఐ న్యాయమూర్తి శివపాల్‌సింగ్

లాలూకు మూడున్నరేండ్ల జైలు

దాణా కుంభకోణం రెండో కేసులో శిక్షలు ప్రకటించిన సీబీఐ కోర్టు • అవినీతికి పాల్పడినందుకు మూడున్నరేండ్లు..

కుట్ర, మోసానికి మరో మూడున్నరేండ్లు.. ఏకకాలంలో శిక్షల అమలు • రూ.10 లక్షల జరిమానా • లాలూపై మరో మూడు కేసులు

మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా సహా ఆరుగురు నిందితులను ఇదివరకే నిర్దోషులుగా విడిచిపెట్టిన కోర్టు..

రాంచీ, జనవరి 6: దాణా కుంభకోణానికి సంబంధించిన రెండో కేసులో ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌కు మూడున్నరేండ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా పడింది. రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివపాల్‌సింగ్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ మేరకు శిక్షలు ప్రకటించారు. దాణా స్కాం కేసులో లాలూకు జైలు శిక్ష పడటం ఇది రెండోసారి. 1990 నుంచి 1994 మధ్యకాలంలో లాలూ బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలం లో దేవ్‌ఘర్ కోశాగారం నుంచి రూ.89.27 లక్షలను విత్‌డ్రా చేసి అక్రమంగా వినియోగించినట్టు రుజువైంది. ఈ కేసులో లాలూకు అవినీతి నిరోధక చట్టంతోపాటు, భారతశిక్షాస్మృతి (ఐపీసీ)లోని వివిధ సెక్షన్ల కింద జడ్జి శిక్షలు విధించారు. అవినీతికి పాల్పడినందుకు మూడున్నరేండ్లు, నేరపూరిత కుట్ర, మోసానికి పాల్పడినందుకు మరో మూడున్నరేండ్లపాటు లాలూకు జైలు శిక్ష పడిందని, ఈ రెండు శిక్షలను ఆయన ఏకకాలంలో అంటే మొత్తంగా మూడున్నరేండ్లు అనుభవించాల్సి ఉంటుందని, సీబీఐ తరపు న్యాయవాది రాకేశ్‌ప్రసాద్ చెప్పారు. ఈ కుంభకోణానికి సంబంధించిన ఒక్కో కేసులో రూ.5 లక్షల చొప్పున రెండుకేసుల్లో కలిపి మొత్తం రూ.10 లక్షలను లాలూకు జడ్జి జరిమానా విధించారని తెలిపారు. జరిమానా కట్టకుంటే అదనంగా మరో ఆరు నెలలు జైలులో ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దాణా కుంభకోణం రెండో కేసులో లాలూతో సహా మరో 15 మంది దోషులని డిసెంబర్ 23న జడ్జి నిర్ధారించిన సంగతి విదితమే. మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రా సహా ఆరుగురు నిందితులను నిర్దోషులుగా విడిచిపెట్టారు. అప్పటినుంచి లాలూ బిర్సా ముండా జైల్లో ఉన్నారు. ఈ కేసులో దోషులుగా ప్రకటించిన మరో 10 మందికి విధించాల్సిన శిక్షలపై కోర్టు వాదనలు విన్నది. ఐదుగురికి శిక్షల ఖరారుపై వాదనలు ముగిశాయి. వారిలో ఆర్జేడీ నేత జగదీశ్‌శర్మకు ఈ కేసులోని మిగతా దోషులందరి కంటె ఎక్కువగా ఏడేండ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా పడింది. కాగా సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టులో సవాలు చేస్తామని లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ తెలిపారు. ఈ కుంభకోణంలో ప్రత్యక్షంగా తన పాత్ర లేదని, తాను 69 ఏండ్ల వృద్ధుడిని, అనారోగ్యంతో ఉన్నానని, తనకు తక్కువ శిక్ష విధించాలని లాలూ శుక్రవారం కోర్టుకు విజ్ఞప్తి చేశారు.



శనివారం పాట్నాలో మీడియా సమావేశం అనంతరం బయటకొస్తున్న బీహార్ మాజీ సీఎం రబ్రీదేవి, ఆర్జేడీ సీనియర్ నేత తేజస్వియాదవ్

ఐదు కేసుల్లో దోషి

దాణా కుంభకోణానికి సంబంధించిన ఐదు కేసుల్లో లాలూ ప్రసాద్ దోషిగా ఉన్నారు. ఇదివరకే ఒక కేసులో ఆయనకు ఐదేండ్ల శిక్ష పడింది. రెండున్నర నెలలపాటు జైల్లో ఉన్న తర్వాత ఆయనకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది. రెండో కేసులో ఇప్పుడు లాలూకు జైలు శిక్ష పడింది. 1996లో దాణా కుంభకోణంపై పాట్నా హైకోర్టు దర్యాప్తునకు ఆదేశించింది. కోశాగారం నుంచి రూ.89.27 లక్షల అక్రమ విత్‌డ్రా చేసినందుకు 1997 అక్టోబర్ 27న 38 మందిపై కేసు దాఖలైంది. నిందితుల్లో 11 మంది చనిపోగా, ముగ్గురు అప్రూవర్లుగా మారారు. ఇద్దరు నిందితులు నేరాన్ని ఒప్పుకోగా వారికి 2006లోనే కోర్టు శిక్షలు విధించింది. 1990లో చైబసా కోశాగారం నుంచి రూ.37.7 కోట్ల విత్‌డ్రాకు సంబంధించిన మరో కేసు లో లాలూప్రసాద్, మరో మాజీ సీఎం జగన్నాథ్ మిశ్రాతోపాటు పలువురిని 2013 సెప్టెంబర్ 30న కోర్టు దోషులుగా తేల్చింది. దంకా కోశాగారం నుంచి రూ.3.97 కోట్లు, చైబసా కోశాగారం నుంచి రూ. 36కోట్లు, డొరాండా కోశాగారం నుంచి రూ.184 కోట్లు అక్రమంగా తీసుకున్న కేసులో లాలూప్రసాద్ శిక్షలు ప్రకటించాల్సి ఉన్నది.



జగిత్యాల జిల్లా కోటిలింగాల వద్ద బోట్‌లో ప్రయాణిస్తున్న మంత్రి ఈటల రాజేందర్, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ తదితరులు

పర్యాటక కేంద్రంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా

దశలవారీగా కోటిలింగాల అభివృద్ధి

ఆర్థికమంత్రి ఈటల, చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, నమస్తే తెలంగాణ: ఉమ్మడి కరీంనగర్ జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాలలో చీఫ్‌విప్ కొప్పుల ఈశ్వర్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో కలిసి పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన బోటింగ్‌ను మంత్రి ఈటల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాలయాలకు, భక్తికి నిలయం కరీంనగర్ జిల్లా అన్నారు. పర్యాటక అభివృద్ధికి వేల కోట్లయినా ఖర్చు చేస్తామని పేర్కొన్నారు. కోటిలింగాల ప్రాంతంలో గెస్ట్ హౌస్, రెస్టారెంట్ ఇంకా మరికొన్ని బోట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నీటికే నడత నేర్పిన ప్రభుత్వం కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి పేర్కొన్నారు. చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ శాతావాహనుల మొదటి రాజధాని కోటిలింగాల అని, శాతవాహనులు 400 ఏండ్లు పాలించినట్టు చరిత్ర చెప్తుందని అన్నారు. అంతటి గొప్ప క్షేత్ర ఘన కీర్తిని భవిష్యత్ తరాలకు అందించేందుకే పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు పాల్గొన్నారు.

మిడ్‌మానేరు పనుల్లో వేగం పెంచాలి

ఫిబ్రవరి 15లోగా పనులన్నీ పూర్తికావాలి

- పునరావాసం, పునర్నిర్మాణానికి 65 కోట్లు ఇస్తాం
- ఆర్‌అండ్‌ఆర్ పనుల్లో జాప్యాన్ని సహించం
- నిర్వాసితులకు పరిహారాలు పెండింగ్‌లో పెట్టొద్దు
- బోగస్ అఫిడవిట్లు ఇచ్చిన వారిపై కఠినచర్యలు
- మిడ్‌మానేరు ప్రాజెక్టుపై సమీక్షలో మంత్రి హరీశ్



శనివారం జలసౌధలో మిడ్‌మానేరు ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తదితరులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

మిడ్‌మానేరు ప్రాజెక్టు గేట్ల బిగింపుతోసహా సివిల్, మెకానికల్, సాంకేతిక పనులన్నింటినీ ఫిబ్రవరి 15లోపు పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ఊపందుకున్న దరిమిలా మిడ్‌మానేరు కీలకమని చెప్పారు. శనివారం జలసౌధలో మిడ్‌మానేరు పనుల పురోగతి, భూనిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాస కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. మిడ్‌మానేరు భూనిర్వాసితుల నష్టపరిహారం కేసులో తప్పుడు అఫిడవిట్లు సమర్పించినవారిపై కఠినచర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తప్పుడు అఫిడవిట్లు జారీచేసిన మండల అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించారు. నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల్లో అవకతవకలు జరుగకుండా చూడాలని, ప్రతి గ్రామంలోనూ క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని చెప్పారు. ముంపునకు గురయ్యే నిర్మాణాల అంచనాలు రూపొందించడంలో అవకతవకలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిడ్‌మానేరు స్పిల్‌వే పనుల పురోగతిని మంత్రి హరీశ్‌రావు తెలుసుకున్నారు. రివిట్‌మెంట్ పనులు వేగంగా జరుగుతున్నట్టు ఏజెన్సీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఇందులో 24 గేట్ల ఫ్యాబ్రికేషన్ పూర్తయ్యిందని, మరో గేటు పని వారంరోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. మిడ్‌మానేరులో భాగంగా నిర్వాసితులైనవారికి నిర్మాణాల పరిహారం కింద రూ.40 కోట్లు, పునర్నిర్మాణం, పునరావాసం కింద మరో రూ.25 కోట్ల మంజూరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి సూచించారు. ఇప్పటివరకు ఆర్‌అండ్‌ఆర్ కింద రూ. 1,200 కోట్లు చెల్లించినట్టు చెప్పారు. మిడ్‌మానేరు కింద 7,419 ఇండ్లు ముంపునకు గురవుతుండగా ఇప్పటికే మూడు వేలకుపైగా ఇండ్లు నిర్మించామని, మరో 1,500 ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయని రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ మంత్రి హరీశ్‌రావుకి వివరించారు. మిగిలినవి కూడా త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. 7,419 ఇండ్లు కోల్పోయినవారిలో 7,159 ఇండ్లకుగాను పరిహారం చెల్లించారని, మిగతా 260 ఇండ్ల పరిహారాన్ని వారంలో చెల్లించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. మిడ్‌మానేరుకు సంబంధించి మొత్తం ఆర్‌అండ్‌ఆర్ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పనుల్లో జాప్యంచేసినా, అలక్ష్యం వహించినా సహించేదిలేదని హెచ్చరించారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న గ్రామాల్లో పరిస్థితిని మంత్రి సమీక్షించారు. కొన్నిచోట్ల ప్రజలు ఇంకా ఖాళీ చేయలేదని అధికారులు తెలిపారు. ముంపునకు గురవుతున్న చింతల్‌ఠాణా, కోదురుపాక, శాబాసుపల్లి, కొడిముంజ, చీర్లవంచ, అనుపురం, ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, వరదవెల్లి గ్రామాల నిర్వాసితులకు పరిహార చెల్లింపులను మంత్రి సమీక్షించారు. పెండింగులో ఉన్న చెల్లింపులను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ కృష్ణభాస్కర్, జాయింట్ కలెక్టర్ యాస్మిన్‌బాషాను మంత్రి ఆదేశించారు. 13 ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లోనూ కనీస సౌకర్యాలు యుద్ధప్రాతిపదికన కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులు పూర్తిచేయాలని సూచించారు. నిర్వాసితుల ఇండ్లకు ఇందిరా ఆవాస్ యోజన పథకం కింద నిధులు మంజూరుచేయాలని హౌసింగ్ ఎండీ చిత్రారామచంద్రన్‌ను మంత్రి ఆదేశించారు. 2006లో ప్రారంభించిన ఈ ప్రాజెక్టు పనులను పదేండ్లలో 50 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 50 శాతం పనులు కేవలం 12 నెలల్లో పూర్తిచేసి రికార్డు నెలకొల్పిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్, జేసీ యాస్మిన్‌బాషా, ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఈ అనిల్, ఓఎస్డీ దేశ్‌పాండే పాల్గొన్నారు.

చనాక-కొర్ట పనులపై మంత్రి అసంతృప్తి

జూన్‌లోపు పూర్తిచేయాలని ఆదేశం

చనాక-కొర్ట ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతుండటంపై అధికారులు, ఏజెన్సీలపై మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై శనివారం జలసౌధలో సమీక్ష నిర్వహించిన మంత్రి.. 15 రోజుల్లో పనుల్లో పురోగతి లేకపోతే సంబంధిత ఏజెన్సీలపై ఒప్పందంలోని క్లాజు ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బరాజ్, పంపుహౌస్, గ్రావిటీకెనాల్, సబ్‌స్టేషన్లు, టవర్లు, గేట్ల నిర్మాణం, బిగింపు తదితర పనులను సమీక్షించారు. మార్చి నెలాఖరులోపు బరాజ్ పియర్స్‌ను బ్రిడ్జిలెవల్ వరకు లేపాలని, ఈలోగా గేట్ల తయారీ పూర్తిచేయాలని చెప్పారు. ఈ నెల 15లోపు సర్జ్‌పూల్ డిజైన్లు, డెలివరీ సిస్టం, ప్రెషర్ పైపులైను వ్యాలీ క్రాసింగు డిజైన్లు పూర్తిచేయాలని సీడీవో సీఈని ఆదేశించారు. మిగిలిన పైపులైను నిర్మాణాన్ని మార్చి చివరిలోగా పూర్తిచేయాలని చెప్పారు. విద్యుత్ లైన్ల ఏర్పాటుకు 11 చోట్ల భూయజమానులతో ఇబ్బందులున్నాయని ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆదిలాబాద్ జిల్లా మంత్రి జోగు రామన్నతో హరీశ్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. రెండుమూడ్రోజుల్లో ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ట్రాన్స్‌కో డైరెక్టర్ సూర్యప్రకాశ్‌రావు, ఈఎన్సీ మురళీధర్‌రావు, ఎస్‌ఈ ఆజాద్‌హుస్సేన్, ఈఈ, డీఈలు, ఏజెన్సీల ప్రతినిధులు సమీక్షలో పాల్గొన్నారు.

రాష్ట్రంలో వ్యవసాయ భూమి 1,42,12,826 ఎకరాలు

ప్రక్షాళనతో పక్కాగా తేలిన లెక్క • రైతుల పెట్టుబడికి మార్గం సుగమం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో వ్యవసాయ సాగుభూమి లెక్క తేలింది. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో 1,42,12,826.17 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని తేలింది. హైదరాబాద్ జిల్లా మినహా 30 జిల్లాల్లోని 568 మండలాల్లో వ్యవసాయ భూమి 60% ఉన్నాయి. వ్యవసాయేతర భూమి 5% మాత్రమే ఉండగా.. ప్రభుత్వ భూములు 35% ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొదటి దశలో 2.56 కోట్ల ఎకరాల భూమి రికార్డుల ప్రక్షాళన చేయగా వాటిలో 2.38 కోట్ల ఎకరాల భూమి క్లియర్‌గా ఉందని తేల్చారు. రాష్ట్రంలో 93% భూములు స్పష్టంగా ఉన్నాయని ప్రభుత్వం తెలిపింది. 17.90 లక్షల ఎకరాల భూ రికార్డులు మాత్రమే క్లియర్‌గా లేవు. రాష్ట్రంలోని 568 మండలాల్లోని 10,830 గ్రామాల్లో భూ రికార్డులను 1507 బృందాలు ప్రక్షాళన చేశాయి. 71,75,096 రైతుల భూములు స్పష్టంగా ఉన్నాయని తేల్చాయి. ఇందులో రైతులకు చెందిన వ్యవసాయ యోగ్యమైన భూములు 1,42,13,000 ఎకరాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. రైతులకు చెందిన వ్యవసాయేతర భూములు 11,96,000 ఎకరాలు ఉన్నాయన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోడ్లు, వక్ఫ్ భూములు, దేవదాయ భూములు తదితర ప్రభుత్వ భూములు అన్నీ కలిపి 84 లక్షల ఎకరాలు ఉన్నాయని అధికారులు ధ్రువీకరించారు.

జిల్లాల వారీగా ఇవీ వివరాలు.. (ఎకరాలలో)

జిల్లా పేరు	పరిశీలించినభూమి	క్లియర్ ఉన్నది	వ్యవసాయ భూమి
1. అదిలాబాద్	9,01,079.33	8,62,537.17	3,56,633.09
2. భద్రాద్రి కొత్తగూడెం	17,03,181.06	14,70,566.38	2,19,694.18
3. జగిత్యాల	6,88,816.37	6,86,228.67	4,19,689.36
4. జనగామ	5,66,303.38	5,12,352.39	4,38,034.17
5. జయశంకర్ భూపాలపల్లి	13,19,738.00	12,03,705.00	5,17,238.00
6. జోగళాంబ గద్వాల	5,93,431.19	5,63,438.20	4,23,705.08
7. కామారెడ్డి	8,72,297.07	8,36,556.71	4,48,019.34
8. కరీంనగర్	5,10,460.29	4,71,191.33	3,56,356.15
9. ఖమ్మం	10,71,108.14	9,57,050.72	6,15,066.06
10. కుమ్రంభీం ఆసిఫాబాద్	8,44,210.98	6,48,269.47	2,84,298.45
11. మహబూబాబాద్	6,66,216.24	5,81,659.50	3,74,519.19
12. మహబూబ్‌నగర్	12,72,836.15	12,30,447.38	9,55,762.02
13. మంచిర్యాల	9,92,353.29	9,26,021.20	3,36,053.33
14. మెదక్	6,85,289.23	6,38,034.33	2,80,605.32
15. మేడ్చల్ మల్కాజిగిరి	2,64,848.28	2,52,719.38	78,627.27
16. నాగర్‌కర్నూల్	11,38,059.13	10,87,883.94	7,21,146.32
17. నల్లగొండ	16,56,583.20	15,60,503.01	11,11,821.02
18. నిర్మల్	8,65,625.14	8,43,008.38	4,57,243.36
19. నిజామాబాద్	9,42,290.04	8,76,153.63	6,02,706.02
20. పెద్దపల్లి	4,36,676.23	4,11,026.64	2,37,963.24
21.రాజన్నసిరిసిల్ల	4,54,895.32	4,41,758.83	2,42,776.26
22. రంగారెడ్డి	12,78,913.10	12,09,962.39	7,78,212.16
23. సంగారెడ్డి	10,90,812.34	10,57,989.34	7,37,292.26
24. సిద్దిపేట	8,83,264.21	8,23,178.96	5,60,453.26
25. సూర్యాపేట	8,86,080.08	8,41,863.34	6,25,790.16
26. వికారాబాద్	8,72,076.37	8,12,344.40	5,82,677.20
27. వనపర్తి	5,34,725.19	4,94,890.46	3,40,947.13
28. వరంగల్ అర్బన్	3,13,092.34	3,01,414.04	2,19,413.05
29. వరంగల్ రూరల్	5,08,304.24	4,64,053.87	3,31,874.21
30. యాదాద్రి భువనగిరి	7,84,524.06	7,41,838.38	5,58,209.31
మొత్తం	**2,55,98,091.19**	**2,38,08,650.04**	**1,42,12,826.17**

జలసౌధ టు కాళేశ్వరం

ఆన్‌లైన్ లైవ్‌లో ప్రాజెక్టు పనులు పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనుల్లో వేగం పెంచడానికి నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా కూడా కృషిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టుకు చెందిన మూడు బరాజ్‌లు, మూడు పంపుహౌజ్‌లు, గ్రావిటీ కాల్వలు, గేట్ల ఫ్యాబ్రికేషన్ పనులను స్వయంగా మూడు రోజులపాటు పరిశీలించిన ఆయన శనివారం హైదరాబాద్‌లోని జలసౌధ నుంచి ఆన్‌లైన్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా పనులను సమీక్షించారు. లైవ్ స్క్రీన్‌లో ఉద్యోగులు, ఏజెన్సీల ప్రతినిధులతో మాట్లాడారు. మంత్రి ఈ విధంగా తమతో మాట్లాడటం చూసి అన్నారం బరాజ్ వద్ద పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఏజెన్సీ ఇంజినీర్, నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో మంత్రి నేరుగా మాట్లాడి పనులు జరుగుతున్న తీరు తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు చేశారు. రిజిస్టర్లను ఆన్‌లైన్‌లోనే తనిఖీ చేశారు.

బీహెచ్‌ఈఎల్ ప్రతినిధులతో భేటీ

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీ-6, 8కి అవసరమైన పంపులు, మోటర్లు, యంత్ర పరికరాలను సకాలంలో సరఫరా చేస్తామని బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి హామీ ఇచ్చింది. శనివారం మంత్రి హరీశ్‌రావు ఆ బృందం సభ్యులతో సమావేశమయ్యారు. బీహెచ్‌ఈఎల్ సలహాదారు నరేంద్రకుమార్, ఇతర ప్రతినిధులు పీఎల్ గజ్‌బాయి, ఎస్కే గుప్తా, యోగేంద్రపాల్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎస్కేజోషి, ఈఎన్సీ మురళీధర్‌రావు సమావేశంలో పాల్గొన్నారు.

భవనాల అన్వేషణకు జడ్జీల కమిటీ

- ఎంపికచేసిన తాత్కాలిక చీఫ్ జస్టిస్
- వచ్చేనెలలో పరిశీలనకు వెళ్లే అవకాశం
- ఉద్యోగుల విభజన, రికార్డుల డిజిటలైజేషన్‌కు మరో రెండు కమిటీల ఏర్పాటు
- ఏపీకి హైకోర్టు విషయంలో ముందడుగు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు దిశగా మరో ప్రక్రియను ఉమ్మడి హైకోర్టు చేపట్టింది. హైకోర్టు ఏర్పాటుకోసం తాత్కాలిక భవనాలను పరిశీలించాలంటూ ఏపీ సర్కార్ చేసిన విజ్ఞప్తికి స్పందించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ బుధవారం ఫుల్‌కోర్టు సమావేశాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో భవనాల పరిశీలనకు కమిటీ వేయాలని నిర్ణయించినట్టు వార్తలు వచ్చాయి. ఈ మేరకు శనివారం సీనియర్ న్యాయమూర్తులతో భవనాల అన్వేషణకు ఒక కమిటీని తాత్కాలిక చీఫ్ జస్టిస్ రమేశ్ రంగనాథన్ నియమించారు. దీనితోపాటు హైకోర్టు ఉద్యోగుల విభజనకోసం ఒక కమిటీ, రికార్డుల డిజిటలైజేషన్ కోసం మరో కమిటీని కూడా ఎంపికచేశారు. ఏపీ హైకోర్టు భవనాల పరిశీలన కమిటీలో జస్టిస్ వీ రామసుబ్రమణియన్, జస్టిస్ సీహెచ్ ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం సత్యనారాయణమూర్తి, జస్టిస్ తా ళ్లూరి సునీల్‌చౌదరి ఉన్నారు. ఇందులో జస్టిస్ వీ రామసుబ్రమణియన్ తప్ప మిగిలిన న్యాయమూర్తులను ఏపీ రాష్ట్ర హైకోర్టుకు ఇప్పటికే కేటాయించిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల విభజన కమిటీలో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ సురేశ్‌కుమార్ కెయిత్, జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ షమీం అక్తర్, జస్టిస్ ఏ శంకరనారాయణ ఉన్నారు. రికార్డుల డిజిటలైజేషన్ కమిటీలో జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి, జస్టిస్ పీవీ సంజయ్‌కుమార్, జస్టిస్ పొనుగోటి నవీన్‌రావు, జస్టిస్ ఎస్వీ భట్, జస్టిస్ యూ దుర్గాప్రసాద్ ఉన్నారు. ఏపీ హైకోర్టు కో సం ఆ రాష్ట్ర సర్కార్ ఎంపిక చేసిన భవనాలను పరిశీలించేందుకు న్యాయమూర్తుల కమిటీ ఫిబ్రవరిలో వెళ్లే అవకాశాలున్నట్టు తెలుస్తున్నది.

నాగార్జున వర్సిటీలో ఏపీ హైకోర్టు!

- గుంటూరులోనూ భవనాలు
- త్వరలో భవనాల పరిశీలనకు అమరావతికి జడ్జీల కమిటీ

అమరావతి, నమస్తే తెలంగాణ:

హైకోర్టు విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమరావతి సరిసర ప్రాంతాల్లో భవనాలను అన్వేషిస్తున్నది. దీనిపై ఏపీ సీఎం చంద్రబాబు ప్రభుత్వ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు. గుంటూరు సమీపంలోని నాగార్జున యూనివర్సిటీ భవనాలు, లేదా కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రమ సమీపంలో భవనాలను, విజయవాడ సమీపంలోని కంచికచర్లలోని భారీభవనాన్ని గానీ తాత్కాలిక హైకోర్టు కోసం ఏపీ ప్రభుత్వం కమిటీకి ప్రతిపాదించనున్నట్టు తెలిసింది. తాము గుర్తించిన భవనాలను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేయాల్సిందిగా డిసెంబర్ 27న ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు లేఖరాశారు. ఈ మేరకు భవనాలను పరిశీలించేందుకు శనివారం ఉమ్మడి హైకోర్టు కమిటీని ఏర్పాటు చేసింది. ఆచార్య నాగార్జున వర్సిటీలోని భవనాల్లో హైకోర్టు ఏర్పాటుకు సీఎం సముఖంగా ఉన్నట్టు సమాచారం. గుంటూరు-విజయవాడ ప్రధాన రహదారిపై వర్సిటీ ఉండటంతో పాటు విశాలమైన భవనాలు ఉండటంతో అక్కడ తాత్కాలిక న్యాయస్థానం ఏర్పాటు చేసేందుకు సీఎం మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. వర్సిటీకి ఎదురుగా ఉన్న లింగమనేని ఎస్టేట్స్‌లో సుమారు వంద ఫ్లాట్స్ ఏపీ సర్కార్ ఆధీనంలో ఉన్నాయి. అందులోని 50 వరకు డూప్లెక్స్ భవనాలను గతంలో ఉన్నతాధికారుల కోసం ఏపీ ప్రభుత్వం లీజ్‌కు తీసుకున్నది. ప్రస్తుతం అందులో అధికారులెవరూ నివాసం ఉండకపోవడంతో వాటిని హైకోర్టు న్యాయమూర్తులు, అధికారులు, సిబ్బంది నివాసం కోసం వినియోగించుకునే అవకాశం ఉన్నది. మంగళగిరి, తాడేపల్లి జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న కొన్ని భారీ భవనాలను కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసింది. గుంటూరులోని జిల్లా కోర్టు భవనాలను పరిశీలించే అవకాశం ఉన్నా.. ఇక్కడ భవనాల లభ్యత తక్కువగా ఉండటం, నగరం నడిబొడ్డున జిల్లా కోర్టు ఉండడంతో పార్కింగ్ సమస్య తలెత్తే అవకాశం ఉన్నది.

చుట్టుగుంట సెంటర్‌లో కార్యాలయాల పరిశీలన

గుంటూరులోని చుట్టగుంట సెంటర్‌లో ప్రస్తుతం ఉన్న ఏపీ వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్‌శాఖ కమిషన్ కార్యాలయాలు ఉన్న భవనాలను తాత్కాలిక హైకోర్టు కోసం పరిశీలించే అవకాశం ఉన్నది. ఇక్కడ నాలుగుఅంతస్తుల విశాల భవనం, అతిథి గృహం, అదనపు భవనాలు ఉన్నాయి. ఈ భవనాల పరిసరాల్లోని అక్రమ కట్టడాలను ఇటీవల గుంటూరు నగర పాలక సంస్థ అధికారులు తొలిగించింది. భవనాల కమిటీ, మౌలిక సదుపాయాల కమిటీ సభ్యులు ఈనెల రెండో వారంలో అమరావతిలో పర్యటించి అనువైన భవనాలను పరిశీలించే అవకాశం ఉన్నది. కమిటీ సూచనల మేరకు హైకోర్టు ఏర్పాటుకు కావాల్సిన ఏర్పాట్లను పూర్తిచేసి ఏపీ సర్కార్ ఉమ్మడి హైకోర్టుకు, కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నది. ఈ సమాచారాన్ని ఉమ్మడి హైకోర్టు.. భారతప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లనున్నది. కేంద్ర న్యాయమంత్రిత్వశాఖ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచనలతో ఏపీ హైకోర్టు ఏర్పాటుకు రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాల్సిఉంటుంది. దీంతో ఏపీలో తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు ప్రక్రియ ముగుస్తుంది.

గొంతులు కాదు, బుద్ధి పెరుగాలె

కట్టా మీఠా



కట్టా శేఖర్ రెడ్డి

ప్రజల విశ్వాసాన్ని పొందడం ఒక్క రోజుతో జరిగే పనికాదు. కష్టాల్లో నష్టాల్లో సంక్షోభాల్లో తమతో ఎవరున్నారన్నదే జనం చూస్తారు. అధికారంలో ఉన్నా తమ బాగోగులను ఎవరు చూస్తున్నారన్నదే ముఖ్యం. జనపక్షపాతం ఎవరి విధానాల్లో, చేతల్లో కనిపిస్తుందన్నదే ప్రధానం. తెలంగాణ ప్రజలు రెండు దశలూ చూశారు. రాష్ట్ర సాధనోద్యమ దశలో అన్ని సందర్భాల్లో నిలబడి కొట్లాడింది టీఆర్‌ఎస్సేనని ఇవ్వాళ రాష్ట్రంలో ఎవరికీ చెప్పాల్సిన పనిలేదు. ఉద్యమం విద్రోహాలను, సంక్షోభాలను, ఎత్తుపల్లాలను ఎదుర్కొంటున్నప్పుడు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలు ఏం చేస్తూ ఉన్నాయో కూడా జనం మరిచిపోలేదు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చేస్తున్నదేమిటో, ప్రతిపక్షాలు మాట్లాడుతున్నదేమిటో జనం గమనిస్తున్నారు. కేసీఆర్ కాకుండా మరొకరు ముఖ్యమంత్రి అయి ఉంటే రాష్ట్రం పరిస్థితి ఎలా ఉండేదన్న ఆందోళన వ్యక్తంచేసిన తెలంగాణవాదులూ ఉన్నారు. తెలంగాణ బాధలు తెలిసినవారు, తెలంగాణ కోసం త్యాగాలు చేసినవారు, తెలంగాణకు వీలైనంత మంచి చేయాలని తపించినవారు నాయకుడిగా లేకపోతే తెలంగాణ ఇవ్వాళ ఉన్న పరిస్థితిలో ఉండేది కాదు. విభజన సమయంలో జిద్దుగా నిలబడి మన హక్కులను, మన నీటి, నిధుల వాటాలను సాధించుకోవడం ఒక ఎత్తయితే రాష్ట్ర ప్రగతికి దీర్ఘకాలపు బాటలు వేసి ఒక గుణాత్మకమైన మార్పునకు పునాదులు వేయడం మరో ఎత్తు. తెలంగాణ గురించి ఒక సమగ్ర దృక్పథం ఉన్న కేసీఆర్ వల్ల ఇది సాధ్యమైంది. తెలంగాణ ఇవ్వాళ వివిధ రంగాల్లో రికార్డుల పరంపర సాధిస్తున్నదంటే అందుకు తెలంగాణ నాయకత్వ అంకితభావమే కారణం. కేసీఆర్‌ను సవాలు చేయాలంటే మరో కేసీఆరే రావాలి. అంత జ్ఞానం, అంత పంతం, అంత ప్రజాపక్షపాతం, సమస్యల మూలాల్లోకి వెళ్లి చూసే సునిశిత దృష్టి కలిగిన మరో నాయకుడిని ప్రతిపక్షం చూపించగలదా? ఇప్పటికీ వారికి సమస్యలను గుర్తించడం, వాటిని ఒక పద్ధతి ప్రకారం ప్రజెంట్ చేయడమే రాలేదు. వారు ఉద్యమకాలంలో కానీ, ఈ మూడున్నరేండ్ల స్వరాష్ట్ర పాలనలో కానీ కొత్తగా పాఠాలేవీ నేర్చుకోలేదు. ఇప్పటికీ తెలంగాణకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న దానికంటే ఒక ఉన్నతమైన మార్గమేదో తమ వద్ద ఉన్నదని చెప్పే దమ్ము ఒక్క నాయకుడికీ లేకపోయింది. ప్రతిపక్షం ఎంతసేపూ తిట్లూ, ఆరోపణలు, పాతచింతకాయ పచ్చడిలాంటి విమర్శలు తప్ప ఒక రాజకీయ దార్శనిక దృష్టిని ప్రజలకు పరిచయం చేయలేకపోయింది.

ఇరువైనాలుగు గంటల కరెంటు తమ గొప్పే అని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు చెబితే ప్రజలు నవ్విపోరా? కేంద్రం తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకోగానే అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సచివాలయంలో వారానికో పాత్రికేయుల సమావేశం పెట్టి అవాకులు చవాకులు పేలుతుంటే తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు ఏం చేస్తూ ఉన్నారు? రాష్ట్రం విడిపోతే తెలంగాణ అంధకారబంధురం అవుతుందని నాటి ముఖ్యమంత్రి తన అజ్ఞానాన్నంతా ప్రదర్శిస్తుంటే ఇప్పుడిచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఏదో అప్పుడే షబ్బీర్ అలీ ఎందుకివ్వలేదు? ఒక్కపైసా ఇవ్వనుపొమ్మని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి వాగితే ఒక్క తెలంగాణ మంత్రి అయినా ఇదేమిటని ఎందుకు ప్రశ్నించలేదు? ఎందుకు ప్రశ్నించలేదంటే వీరెవరికీ తెలంగాణ సోయిగానీ, తెలంగాణ ఆత్మగౌరవస్ఫూర్తిగానీ లేదు. తెలంగాణ వస్తే వస్తుంది, మనం మాత్రం పదవులు వదలొద్దు, ప్రయోజనాలు మరువొద్దు అనుకుని ఇండ్లకు ఫైళ్లు తెప్పించుకొని సంతకాలు చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇతర ఆంధ్ర నాయకులు తెలంగాణకు వ్యతిరేకంగా ప్రకటనలు చేసినప్పుడల్లా పిల్లలు పిట్టల్లా రాలిపోతూ ఉంటే ఒక్క కాంగ్రెస్ నాయకుడైనా రాజీనామా వారి ముఖాన పడేసి, తెగించి పోరాడలేదు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఆత్మకు దగ్గర కావడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అసలు తెలంగాణ సమస్యే వారికి అర్థంకాలేదు. అప్పుడే కాదు ఇప్పుడు కూడా తెలంగాణ సమస్య వారికి అర్థం కాలేదు. ప్రాజెక్టులకు వ్యతిరేకంగా కేసులు వేయడం, ఉద్యోగాల క్రమబద్ధీకరణపై అడ్డంకులు కల్పించడం, రాజకీయ వాయివరుసలు మరిచి పరమ నీచమైన స్థాయికి దిగి విమర్శలు కురిపించడం కాంగ్రెస్ నాయకుల దివాలాకోరుతనాన్ని మరింత బట్టబయలు చేస్తున్నదే తప్ప వారిపై ప్రజల విశ్వాసాన్ని పెంచదు. తెలంగాణ సమస్య నీళ్లు, ఉద్యోగాలు, నిధులే. తెలంగాణ బీళ్లన్నీ నీళ్లతో తడువాలంటే ప్రాజెక్టులను పరుగులు పెట్టించాలి. గరిష్ఠంగా నదీజలాలను తెలంగాణ భూములకు మళ్లించాలి. తెలంగాణ ఉద్యమంలో జనం బాధలగాథల నుంచి నేర్చుకున్న పాఠం ప్రథమ ప్రాధాన్యంగా తాగు, సాగు నీరందించడం. అందుకే కేసీఆర్ నీటిపారుదల ప్రాజెక్టులను ఒక యజ్ఞంలా ముందుకు నడిపిస్తున్నారు. తెలంగాణ ప్రజలు నీటికోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాల నాయకులు ప్రజల ఆకాంక్షలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. త్వరగా ప్రాజెక్టులు పూర్తిచేసి, నీళ్లివ్వాలని డిమాండు చేయాల్సింది పోయి, వందలాది కేసులు ముందేసుకుని అదేదో పెద్ద ఉద్ధరణ కార్యక్రమంగా వీధుల్లోకి వస్తున్నారు. తాగు, సాగు నీరు కోసం ఎదురుచూసే కోట్లాదిమంది కాంగ్రెస్ నాయకులను చూసి ఏమనుకోవాలి?

అలాగే కరెంటు సమస్యపై కాంగ్రెస్‌ది ఎదురీతే. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా కరెంటు ఉత్పత్తి చేయనిమాట నిజమే కావచ్చు. కానీ అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే కరెంటు కోతల నుంచి తెలంగాణ రైతాంగాన్ని, పరిశ్రమలను విముక్తి చేసింది. అదే పట్టుదలతో అనేక విద్యుత్ ప్రాజెక్టులను ముందుకు నడిపించి, విద్యుదుత్పాదనను పెంచి ఇవ్వాళ 24 గంటల విద్యుత్ ఇస్తున్నది. ఈ విద్యుత్ అంతా తమ ఘనకార్యమేనని కాంగ్రెస్ నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. కాంగ్రెస్‌కు అంత తెలివే వుంటే తెలంగాణ రాకముందే కరెంటు కోతల నుంచి విముక్తి ఇచ్చి ఉండవచ్చు కదా. కొత్త ఉత్పత్తి చేయకుండా కేసీఆర్ ఇవ్వగలిగినప్పుడు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయింది? తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం అప్పుడు ఎవరి సేవలో తరిస్తూ కూర్చున్నది? కాంగ్రెస్ నాయకత్వానికి, కేసీఆర్‌కు ఉన్న తేడా అదే. కేసీఆర్‌కు సంకల్పం ఉంది. తెలంగాణ రైతు ఆత్మ ఉంది. అందుకే కరెంటు కోతలు లేకుండా చూడటం అత్యంత ప్రాధాన్యమైన అంశంగా భావించి, అదనపు భారం భరించడానికి సిద్ధపడి, విద్యుత్ కొనుగోలుచేసి రైతులను, పరిశ్రమలను కష్టాల నుంచి గట్టెక్కించారు. ఆ అంశంపైనా ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు కాలంచెల్లిన వాదనలు, డేటాలు ప్రదర్శనకు పెట్టడం అర్థ రహితం.

ఇసుక క్వారీల గురించి కాంగ్రెస్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. తెలంగాణ ప్రభుత్వం ఇసుక క్వారీలను క్రమబద్ధీకరించి ఏటా 300 నుంచి 400 కోట్ల రూపాయల ఆదాయాన్ని సాధించింది. కాంగ్రెస్ ఇసుక వ్యాపారం నుంచి ప్రభుత్వానికి ఎంత సంపాదించిందో, నాయకుల సొంతానికి ఎంత సంపాదించిందో 2004–2014 సంవత్సరాల లెక్కలు మాట్లాడుతాయి. ఉన్నదీ లేనిదీ కలిపి మాట్లాడితే గవర్నర్ కోపం చేయకేం చేస్తారు? కేసీఆర్‌ను ఢీకొనాలంటే పదిహేడేండ్లపాటు ఆయన పడిన పాట్లు, ఆయన చేసిన సాధన కాంగ్రెస్ నాయకత్వం చేయాలి. ఆ దిశగా ఇసుమంతైనా అడుగులు పడిన జాడలు కనిపించవు. ఈ మూడున్నరేండ్లలో వారి అవగాహనస్థాయిలో ఏ మాత్రం మార్పు వచ్చిన సూచన కనిపించదు. మనం బాగుపడకపోతే అవతలివాడి పేరును చెడగొట్టాలన్నది చాలాపాతకాలపు రాజకీయ సిద్ధాంతం. ఉన్నవీ లేనివీ కల్పించి, బురద కుమ్మరించి, బద్నాం చేసి, జనంలో పలుచన చేసి.. అంటే ఎంత అధమస్థాయి రాజకీయమైనా చేసి పైకి రావాలనుకోవడం ఈ కాలానికి సరిపడదు. ప్రజలకు ఇప్పుడు అన్నీ కనిపిస్తున్నాయి. వినిపిస్తున్నాయి. గొంతులు పెద్దవి చేసి, మైకులు పెద్దవి పెట్టుకున్నంతమాత్రాన మంచి చెడు కాబోదు, చెడు మంచి కాబోదు.

ఇటీవల ఒక సీనియర్ టీడీపీ నాయకుడు వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ తమతో పొత్తు పెట్టుకుంటేనే మళ్లీ గెలుస్తారని వాదించారు. 'కేసీఆర్‌కు మీ అవసరం ఏముంది? నాడే ఒంటరిగా గెలిచారు. ఇప్పుడు మీ పార్టీయే అంతిమయాత్రలో ఉంది. ఇక మీతో పొత్తు సంగతి ఎక్కడిది?' అని పక్కనే ఉన్న మిత్రుడు ప్రశ్నించాడు. 'మాకు 5 నుంచి పది శాతం ఓట్లున్నాయి. మాతో కలవకుంటే అవన్నీ కాంగ్రెస్‌కు పడతాయి' అన్నారాయన. 'మీరు ఇంకా భ్రమల్లో ఉన్నారు. కేసీఆర్‌కు ఇప్పుడు ఎవరి అవసరమూ లేదు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటేయడానికి ఒక్క కారణం చెప్పండి?' అని నిలదీశాడు మిత్రుడు. 'ఏమి చేయలేదని ప్రజలు కేసీఆర్‌ను వదులుకుంటారు?' అని మళ్లీ మిత్రుడు రెట్టించాడు. ఆ నాయకుడు నీళ్లు నమిలాడు. కాసేపటికి తేరుకుని ప్రజలకు ఏమాత్రం సంబంధం లేని వ్యక్తిగత విమర్శలు ప్రస్తావించారు. 'కరెంటు వచ్చిందా లేదా, రుణమాఫీ అయిందా లేదా, వ్యవసాయానికి విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుతున్నాయా లేదా? ప్రాజెక్టుల నుంచి గరిష్ఠంగా నీటిని వాడుకుంటున్నామా లేదా? సంక్షేమ పింఛన్లు అందుతున్నాయా లేదా? డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం జరుగుతున్నదా లేదా? ఉద్యోగులు అడిగిన డిమాండ్లు నెరవేర్చారా లేదా? అంగన్‌వాడీ కార్యకర్తలు, మున్సిపాలిటీ స్వచ్ఛ కార్మికులు, హోంగార్డులు, వీఆర్వోలు, వీఆర్ఏలు.. ఇలా అట్టడుగున పనిచేస్తున్న సిబ్బంది జీతాలు గణనీయంగా పెరిగాయా లేదా? ఉద్యోగాల భర్తీ వేగంగా జరుగుతున్నది.. ఇలా ఎన్నయినా చెబుతా? మీరు ఒక్క కారణం చెప్పండి వ్యతిరేకంగా ఓటేయడానికి?' అని ఆ మిత్రుడు ప్రశ్నించాడు. ఇక ఇది తేలేది కాదని ఆ నాయకుడు నిష్క్రమించారు. ఎన్నికలు ఇంకా ఏడాది దూరంలో ఉన్నాయి. ప్రజల్లో వ్యతిరేకతను సృష్టించి గెలువాలన్న తాపత్రయాన్ని ఆ నాయకుడి మనఃస్థితి తెలుపుతుంది. చాలామంది ప్రతిపక్ష నాయకుల పరిస్థితి ఇలాగే ఉంది. విశాల జన బాహుళ్యం మాత్రం స్వరాష్ట్రంలో ప్రారంభమైన పురోగామియాత్ర ఆగిపోగూడదని, కేసీఆర్ నాయకత్వం నిరాటంకంగా కొనసాగాలని కోరుకుంటున్నది. ఇది ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేని వాస్తవస్థితి.

> ఇసుక క్వారీల గురించి కాంగ్రెస్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. తెలంగాణ ప్రభుత్వం ఇసుక క్వారీలను క్రమబద్ధీకరించి ఏటా 300 నుంచి 400 కోట్ల రూపాయల ఆదాయాన్ని సాధించింది. కాంగ్రెస్ ఇసుక వ్యాపారం నుంచి ప్రభుత్వానికి ఎంత సంపాదించిందో, నాయకుల సొంతానికి ఎంత సంపాదించిందో 2004-2014 సంవత్సరాల లెక్కలు మాట్లాడుతాయి. ఉన్నదీ లేనిదీ కలిపి మాట్లాడితే గవర్నర్ కోపం చేయకేం చేస్తారు? కేసీఆర్‌ను ఢీకొనాలంటే పదిహేడేండ్ల పాటు ఆయన పడిన పాట్లు, ఆయన చేసిన సాధన కాంగ్రెస్ నాయకత్వం చేయాలి. ఆ దిశగా ఇసుమంతైనా అడుగులు పడిన జాడలు కనిపించవు. ఈ మూడున్నరేండ్లలో వారి అవగాహనస్థాయిలో ఏ మాత్రం మార్పు వచ్చిన సూచన కనిపించదు. మనం బాగుపడకపోతే అవతలివాడి పేరును చెడగొట్టాలన్నది చాలాపాతకాలపు రాజకీయ సిద్ధాంతం.

kattashekar@gmail.com

ప్రేక్షకులకు 'ప్యారడైజ్'

జ్ఞాపకాలు



బుద్ధా మురళి

'దానవీర శూరకర్ణ'లోని 'చిత్రం భళారే విచిత్రం' ఈ పాట నిజంగా చిత్రమే.. సుయోధన సార్వభౌముడికి డ్యూయెట్ పెట్టాలనే ఆలోచనే ఓ చిత్రం. సి.నారాయణరెడ్డి ఆ పాటను అద్భుతంగా రాస్తే ప్రభ ఆ పాటలో అంతకుముందు ఏ సినిమాలోనూ కనిపించనంత అందంగా కనిపిస్తుంది. చిత్రమైన పాట ఉన్న ఈ సినిమా ప్యారడైజ్‌లో బాగా నడిచింది. ఆ సినిమా హాల్ చరిత్ర ఇంతకన్నా చిత్రమైనది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలి ఏసీ టాకీసుగా (1954) ప్యారడైజ్ టాకీసు పేరుతో రికార్డ్ నమోదు అయి ఉంది. ఈ టాకీసులో అనేక విచిత్రాలు, జ్ఞాపకాలు.. అద్భుతాలు ఉన్నాయి.

మీరు ఏ సినిమా హాలుకు వెళ్లినా ఇంటర్వెల్‌లో తలుపులు అన్నీ మూసేస్తారు. ఇష్టం ఉన్నా లేకున్నా టాకీసులోని క్యాంటిన్‌లోనే చిరుతిండి కొనుక్కోవాలి. తలుపులు తీస్తే అంతకన్నా తక్కువ ధరతో, మంచి రుచికరమైన పదార్థాలు బయట కొనుక్కుంటారు. అలాంటి ఛాన్స్ ఇవ్వకుండా క్యాంటిన్లో నాసిరకం చిరుతిళ్లు ఎక్కువ ధరకు కొనాలి. సినిమా హాలులోని క్యాంటిన్‌పై నిర్వాహకులకు అంత నమ్మకం. అందుకే గేట్లకు తాళాలు వేస్తారు. తలుపులు ముస్తారు.

కానీ చిత్రం భళారే విచిత్రం అనిపించేట్టుగా ప్యారడైజ్‌లోని క్యాంటిన్ అంతర్జాతీయ బ్రాండ్ కావడం. ఆ బ్రాండ్ విలువ కోట్ల రూపాయలు కావడం. ప్యారడైజ్ టాకీసు మూతపడింది కానీ అందులోని క్యాంటిన్ మాత్రం అదే పేరుతో అంతర్జాతీయ బ్రాండ్‌గా మారింది. ప్యారడైజ్ అంటే ఈతరం వారికి తెలిసింది హైదరాబాద్ బిర్యానీ బ్రాండ్ నేం. కానీ ఒకప్పుడు ఎన్నో మంచి మంచి తెలుగు సినిమాలు ఆడిన టాకీసు ప్యారడైజ్.

సికింద్రాబాద్‌లో హిందీ, ఇంగ్లీష్ సినిమాలు ఆడే టాకీసులు ఎక్కువగా ఉన్నా ప్యారడైజ్‌లో మాత్రం ఎక్కువగా తెలుగు సినిమాలే ఆడేవి. దానవీర శూర కర్ణ, దేశోద్ధారకులు వంటి పలు హిట్ సినిమాలు ఎక్కువ రోజులు ఆడాయి.

ప్యారడైజ్ హోటల్ తమ ప్రగతిని వివరిస్తూ ఓ బోర్డు ఏర్పాటుచేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలో ప్యారడైజ్ అనే పేరుతో పిలిచిన ఒక టాకీసులో చిన్న క్యాంటిన్‌గా 1953లో ఆవిర్భవించినట్టు రాసుకున్నారు. క్రమంగా టాకీసు ప్రభావం తగ్గుతుండగా, అదే సమయంలో క్యాంటిన్ చిన్న హోటల్‌గా మారింది. అటు నుంచి ఎవరూ అందుకోలేని స్థాయికి వెళ్తే టాకీసు మాత్రం మూతపడింది. టాకీసు మూతపడి అందులోని క్యాంటిన్ అంతర్జాతీయ బ్రాండ్‌గా మారడం సినిమాను మించిన విచిత్రం. ప్యారడైజ్‌లో ఎక్కువగా తెలుగు సినిమాలు ప్రదర్శించినా అప్పడప్పుడు హిందీ, ఇంగ్లీష్ సినిమాలు ప్రదర్శించేవారు.

1977 జనవరి 14న ప్యారడైజ్‌లో విడుదలైన 'దాన వీర శూర కర్ణ' సినిమా ఓ సంచలనం. ఎక్కువ రోజులు నడిచిన సినిమానే కాదు. ఎక్కువ నిడివిగల సినిమా కూడా. ప్యారడైజ్‌లో ఈ సినిమా విడుదల అని ఆ రోజుల్లో పత్రికల్లో వచ్చిన ప్రచార ప్రకటన చాలా ఆకర్షణీయంగా ఉండేది. దుర్యోధనుడిగా ఎన్టీఆర్ పెద్ద గదను పట్టుకొన్న పోస్టర్ ఆకట్టుకొనే విధంగా ఉండేది. ద్రౌపదిగా శారద వస్త్రాపహరణం కృష్ణుడి గా ఎన్టీఆర్ అరచేతి నుంచి చీరలు రావడం, మాయాజూదంలో ఓడిపోయి పాండవులు దీనంగా కూర్చున్న దృశ్యంతో తొలుత పత్రికల్లో ప్రచార ప్రకటన వచ్చినా గదతో దుర్యోధనుడి పోస్టర్ ఎక్కువగా పాపులర్ అయింది. ఆ కాలంలో ప్యారడైజ్ టాకీసు జన ప్రవాహంతో నిండిపోయింది. దేశోద్ధారకులు సినిమా కూడా ఈ టాకీసులో బాగా ఆడింది. 'దాన వీర శూర కర్ణ'కు ముందు అక్కినేని నాగేశ్వర్‌రావు, వాణిశ్రీ నటించిన ఆలుమగలు సినిమా బాగానే నడిచింది.

ఇప్పుడంటే అసలు విడుదలకు నోచుకోని సినిమాలు, ఒకరోజుకే ఎత్తేసే సినిమాలకు సైతం టీవీలో బోలెడు ప్రచారం లభిస్తున్నది. ఆ రోజుల్లో పత్రికల్లో ప్రకటనలు, పోస్టర్‌లే ప్రచారం. పత్రికల ప్రకటనలో అన్ని టాకీసులు ఎయిర్ కండిషన్డ్ అని రాస్తే ప్యారడైజ్ ఎయిర్‌కూల్ అని రాసుకొనేది.

సికింద్రాబాద్‌లో పాష్ ఏరియా జవహర్‌నగర్ ఈ టాకీసుకు పక్కనే.. రాజధాని నగరంలో తొలి అపార్ట్‌మెంట్ నిర్మాణం ఈ ప్రాంతంలోనే జరిగింది. సింధ్ కాలనీ.. వారు పూజించే ప్రత్యేక ఆలయం ఈ ప్రాంత ప్రత్యేకతలు. కొత్త సినిమా ఏది విడుదలయినా మొదటి మూడురోజులు నాలుగు ఆటలు అదే సినిమా ప్రదర్శించేవారు. నాలుగవ రోజు నుంచి ఉదయం ఆట పాత సినిమాను మార్నింగ్ షో గా తక్కువ రేటు టికెట్లతో ప్రదర్శించేవారు.

సికింద్రాబాద్ చరిత్రలో ఒక భాగంగా నిలిచిన ప్యారడైజ్ 1987లో మూతపడింది. అదే స్థలంలో, అదే పేరుతో వెలిసిన ప్యారడైజ్ హోటల్ తన చరిత్రను అక్కడ రాసిపెట్టింది. ఒక సినిమా హాలులో క్యాంటిన్ అంతర్జాతీయ బ్రాండ్‌గా మారడం అభినందనీయమే కానీ.. అదే సమయంలో తన జన్మకు కారణమైన ప్యారడైజ్ రికార్డును నమోదుచేసి ఉంటే బాగుండేది. ప్యారడైజ్ సినిమా టాకీసుగా ఉన్నప్పటి ఫొటో కానీ సినిమా షీల్‌లు ఆ టాకీసుకు సంబంధించిన ఎలాంటి చరిత్ర, చిత్రాలు అక్కడ లేవు. ఇక్కడ ఒకప్పుడు ప్యారడైజ్ పేరుతో ఒక సినిమా టాకీసు ఉండేదని చెప్పినా నమ్మేట్టుగా లేదు.

ప్యారడైజ్‌లో బిర్యానీ ఎంత ఫేమస్ అంటే.. రాహుల్ గాంధీ చెప్పాపెట్టకుండా వచ్చి ఇక్కడ బిర్యానీ తిని వెళ్లేంతగా. బిర్యానీ ప్రియులకు ఇది నిజంగా ప్యారడైజే (స్వర్గం) కానీ ఇందులో ఎన్నో సినిమాలు చూసిన నాటితరం వారికీ మాత్రం ఇక్కడికి రాగానే టాకీసు కనిపించకపోవడం గుండెల్లో గుచ్చుకున్నట్టుగా ఏదో వెలితిగా ఉంటుంది.


> సికింద్రాబాద్ చరిత్రలో ఒక భాగంగా నిలిచిన ప్యారడైజ్ 1987లో మూతపడింది. అదే స్థలంలో, అదే పేరుతో వెలిసిన ప్యారడైజ్ హోటల్ తన చరిత్రను అక్కడ రాసిపెట్టింది. ఒక సినిమా హాలులో క్యాంటిన్ అంతర్జాతీయ బ్రాండ్‌గా మారడం అభినందనీయమే కానీ.. అదే సమయంలో తన జన్మకు కారణమైన ప్యారడైజ్ రికార్డును నమోదుచేసి ఉంటే బాగుండేది. ప్యారడైజ్ సినిమా టాకీసుగా ఉన్నప్పటి ఫొటో కానీ సినిమా షీల్‌లు ఆ టాకీసుకు సంబంధించిన ఎలాంటి చరిత్ర, చిత్రాలు అక్కడ లేవు. ఇక్కడ ఒకప్పుడు ప్యారడైజ్ పేరుతో ఒక సినిమా టాకీసు ఉండేదని చెప్పినా నమ్మేట్టుగా లేదు.

(వ్యాసకర్త: రాష్ట్ర సమాచార కమిషనర్)




ప్రశ్నించడమే మహా పాపం అనే మానసిక రుగ్మత మన దేశంలో తరచు ఎదురవుతున్నది. తాజాగా 'ఆధార్' కూడా ఈ కారణంగానే విమర్శల నుంచి తప్పించుకుంటున్నది. అంతా బాగానే ఉంది. ఏమీ ప్రశ్నించకూడదు. ప్రశ్నిస్తే దేశ ద్రోహి కింద లెక్క! నాకు ఆధార్ కావల్సిందే. కానీ నా ప్రైవసీని కూడా కాపాడుకోవాలె.

రాజ్‌దీప్ సర్దేశాయ్



చిలికా సరస్సు ఒడిషా అస్తిత్వానికి ప్రతీక. ఒడిషా ప్రజల జానపద సంస్కృతికి, కవిత్వానికి, కథనానికి, సంప్రదాయాలకు, పోరాటాలకు ప్రతీక. చిలికా ఒక సరస్సు మాత్రమే కాదు, ఒడియాల జీవన రీతి, స్ఫూర్తి. భారతీయ వైవిధ్యంలో అంతర్భాగం.

ధర్మేంద్రప్రధాన్



మధ్య తరగతికి చెంప దెబ్బ, గోడ దెబ్బ అన్నట్టుగా ఉన్నది. వారు పన్నులు చెల్లిస్తున్నారు. ప్రభుత్వ సేవలు సరిగ్గా ఉండకపోవడం వల్ల ప్రైవేటు వైద్యాన్ని కూడా భారీగా భరించవలసి వస్తున్నది. ప్రభుత్వ సేవలు ఇప్పుడు మెరుగు పడుతున్నాయి. మధ్య తరగతిని ఈ వైద్య సేవలు అందుకోకుండా ఎందుకు దూరం పెట్టాలె?.

అరవింద్ కేజ్రీవాల్

ప్రగతిపై ప్రవాసీల సంబురం

తెలంగాణం



రాపోలు సీతారామరాజు

దశాబ్దాల తరబడి తెలంగాణ సంస్కృతీ వైభవాలు, సంప్రదాయ సౌరభాలు నిరాదరణకు, విస్మృతికి గురయ్యాయి. స్వతహాగా సాహితీవేత్త అయిన తెలంగాణ సీఎం కేసీఆర్ తెలుగు భాషను వాహికగా చేసుకొని తెలంగాణలో పరిఢవిల్లిన తెలుగు సుగంధాలు ప్రపంచాన్ని పరిమళభరితం చేయాలని పూనుకున్నారు. ఇందులో భాగంగా భాగ్యనగరం వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ మహాసభలకు దేశదేశాల్లోంచి అశేష తెలుగు అభిమానులు పాల్గొన్నారు. అందులో భాగంగా ఈ వ్యాసరచయిత కూడా దక్షిణాఫ్రికా నుంచి వచ్చి ప్రపంచ తెలుగు మహాసభల్లో పాల్గొన్నారు.

తెలంగాణ జాతిలో భాషా చేతనను, సాంస్కృతిక పునర్వికాసాన్ని తీసుకురావాలనే ప్రభుత్వ పనితీరు హర్షించదగినది. ఈ దిశగా ప్రాథమికస్థాయి నుంచి ఇంటర్మీడియెట్ వరకు తెలుగు భాషను విధిగా బోధించాలనే నిర్ణయం, హైదరాబాద్ వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడం లాంటివి నాందీ ప్రస్తావనలు. ఈ విషయాలు ప్రవాస భారతీయులకు మిక్కిలి సంతోషాన్ని కలిగించాయి.

విదేశీ ప్రతినిధులను ముఖ్యమంత్రి కేసీఆర్ తమ నివాసానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతం రాష్ట్రంగా ఆవిర్భవించిన అనంతరం అభివృద్ధిపథాన ఎలా దూసుకుపోతున్నదో వివరించారు. ప్రభుత్వ పనితీరును కళ్లకు కట్టారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధిని, సంక్షేమ పథకాలను, కూలంకషంగా వివరించారు. ప్రవాసులను తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించాలని కోరారు. అప్పటికప్పుడు ప్రాజెక్టులను సందర్శించాలని కోరుతూ, మమ్మల్ని తీసుకుపోవాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ముఖ్యమంత్రి హోదాలో సీఎం కేసీఆర్ వ్యవహరించిన తీరు మమ్మల్ని ఆనందంతోపాటు, ఆశ్చర్యానికి గురిచేసింది.

సొంత రాష్ట్రం కోసం దశాబ్దాల పాటు ఉద్యమాలు ఉవ్వెతున్న సాగుతున్న రోజులవి. ఆ ఉద్యమాలకు ప్రవాస భారతీయుల సంఘీభావం, మద్దతు సామాజిక, ప్రసార మాధ్యమాల ద్వారా పోరు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. పురిటిగడ్డపై స్వయంగా లేకున్నా తెలంగాణ పోరులో మా మనసులు భాగస్వామ్యమయ్యాయి. కళాకారుల గీతాలు, కవుల కవనాలు, ప్రముఖ నాయకుల ఉపన్యాసాలు మా చెవుల్లో మార్మోగుతూనే ఉండేవి. దశాబ్దాల నాటి స్వరాష్ట్ర కల సాకారమయ్యాక సంబురాలు అంబరాన్నంటాయి. రాష్ట్ర ఆవిర్భావానంతరం రెండు, మూడు పర్యాయాలు తెలంగాణ భూమిపై కాలుమోపినా ప్రపంచ తెలుగు మహాసభల నేపథ్యంలో తెలంగాణ గడ్డకు రావడం ఈసారి ప్రత్యేక అనుభవాన్ని మిగిల్చింది. వలసాంధ్ర పాలనలో అణిచివేయబడ్డ తెలంగాణ ప్రాంతం స్వరాష్ట్ర అనంతరం బంగారు తెలంగాణగా రూపుదిద్దుకోవడంలో పోషిస్తున్న పాత్ర, సంక్షేమ పథకాల అమలు, పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రవాసీయులకు కూలంకషంగా వివరించారు. మాకు లభించిన కొద్ది సమయంలోనే తెలంగాణ సాధిస్తున్న అభివృద్ధిని తెలుసుకోగలిగాం.

తాగు, సాగు నీరు: గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను పునరుద్ధరించే క్రమంలో భాగంగా ప్రవేశపెట్టిన 'మిషన్ కాకతీయ' పథకం అద్భుతమైన విజయం సాధించింది. 'మిషన్ కాకతీయ' ద్వారా చెరువుల పునరుద్ధరణ పనులు ఇప్పటికీ సాగుతున్నాయి. ఈ కార్యక్రమంతో గ్రామీణ చెరువులు నీళ్లతో కళకళలాడుతున్నాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని సబ్బండవర్ణాలకు ఉపాధి లభిస్తున్నది. ఏండ్ల తరబడి బీళ్లుగా మారిన భూములు పచ్చగా కళకళలాడుతున్నాయి. కొన్ని లక్షల ఎకరాల ఆయకట్టు సాగులోకి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మరో బృహత్తర పథకం 'మిషన్ భగీరథ'. ఇంటింటికి నల్లానీరు అందివ్వాలనే దృఢ సంకల్పంతో సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి పథకం ఇది. ఈ పథకానికి ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయి. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలైతే ఏకంగా 'మిషన్ భగీరథ' పథకాన్ని ఆదర్శంగా తీసుకోనున్నాయి.

విద్య, వైద్య సదుపాయాలు: కేంద్ర ప్రభుత్వానికే సాధ్యం కాని మోడల్ స్కూళ్లను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తున్నది. 500 గురుకుల పాఠశాలల ద్వారా బడుగు బలహీనవర్గాల పిల్లలకు విద్యను అందిస్తున్నది. ఇక వైద్యరంగం విషయానికి వస్తే ప్రభుత్వా దవాఖానలను నవీకరిస్తూ పేద రోగులను ఆదుకుంటున్నది. కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్థులకు రాష్ట్రవ్యాప్తంగా 50 డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకవచ్చింది. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మరో బృహత్తర పథకం 'కేసీఆర్ కిట్'. ఈ పథకం నవజాత శిశువులకు ప్రేమ కానుక. తత్ఫలితంగా ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ దవాఖాన సిబ్బంది రోగుల పట్ల ప్రవర్తిస్తున్న తీరు రోగులకు భరోసా కల్పిస్తున్నది. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానలో చికిత్సే మేలు అనిపిస్తున్నది.

స్త్రీ, శిశు, వికలాంగుల సంక్షేమం: ఆడపిల్లలంటే భారమని భావించే ఈ రోజుల్లో ప్రతీ ఆడబిడ్డ పెళ్లి బాధ్యతను తన భుజాన వేసుకున్నారు సీఎం కేసీఆర్. అందులో భాగమే ప్రతి ఆడబిడ్డ పెండ్లికి 'కళ్యాణలక్ష్మీ' పథకం ద్వారా రూ.75 వేలను అందిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వం. దీంతో ప్రతి తల్లిదండ్రిలో ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది. బాలికల కుటుంబాలు రుణాల బారిన పడకుండా 18 ఏండ్ల వరకు విద్య అందేలా చర్యలు తీసుకున్నది. దివ్యాంగులకు చేయూతనందిస్తూ మూడు శాతం రిజర్వేషన్ కేటాయించింది.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమం: రాష్ట్రాభివృద్ధిలో వ్యవసాయరంగం ముఖ్య భూమిక పోషిస్తున్నది. అలాంటి వ్యవసాయరంగం ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైంది. ఒక ముఖ్యమంత్రి అయితే ఒక అడుగు ముందుకేసి 'వ్యవసాయం' దండుగ అని ప్రచారం చేశారు. అలాంటి వ్యవసాయ రంగానికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ఇందులో భాగమే రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ చేసింది. వచ్చే ఏడాది నుంచి పెట్టుబడి ఖర్చుల కోసం ఎకరానికి రూ.8 వేల సబ్సిడీ అందివ్వనున్నది. రైతు సమితిలను ఏర్పాటు చేసింది. గొర్రెలు, చేపలు పంపిణీ చేస్తూ కులవృత్తులకు చేయూతనందిస్తున్నది.

24 గంటల కరెంటు: సీఎం కేసీఆర్ 2014 ఎన్నికల మ్యానిఫెస్టోలో వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంటును అందిస్తానని మాటిస్తే విపక్షాలు గాయికెత్తుకున్నాయి. ఆచరణకు నోచుకోని హామీలను కేసీఆర్ ప్రకటిస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. ఇక ఉమ్మడి పాలనలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి తెలంగాణ వస్తే అంధకారమవుతుందంటూ తన అక్కసును వెళ్లగక్కాడు. వీటన్నింటిని పటాపంచలు చేస్తూ సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు అందించి తానేంటో నిరూపించుకున్నారు.

ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ పురోగామి దిశగా పయనిస్తున్నదనే విషయం సీఎం కేసీఆర్ మాటల్లో తేటతెల్లమైంది. బంగారు తెలంగాణ దిశగా దూసుకుపోతున్న కన్నతల్లి తెలంగాణను తలుచుకున్నప్పుడల్లా ప్రవాసుల మదిలో చిగురాశలు మొలకెత్తుతాయి. తెలంగాణ క్షేమం కోసం ప్రవాసుల పాత్రను ఆశించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు. ఆయన కోరిక మేరకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రవాసులు తెలంగాణ వెన్నంటే నిలువాలి. తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా అగ్రస్థానంలో నిలువాలని ఆశిస్తూ..

> ఇలాంటి ఎన్నో సంక్షేమ పథకాలతో తెలంగాణ పురోగామి దిశగా పయనిస్తున్నదనే విషయం సీఎం కేసీఆర్ మాటల్లో తేటతెల్లమైంది. బం గారు తెలంగాణ దిశగా దూసుకుపోతున్న కన్నతల్లి తెలంగాణను తలుచుకున్నప్పుడల్లా ప్రవాసుల మదిలో చిగురాశలు మొలకెత్తుతాయి. తెలంగాణ క్షేమం కోసం ప్రవాసుల పాత్రను ఆశించిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అభినందనలు.

(వ్యాసకర్త: దక్షిణాఫ్రికా నుంచి ప్రవాస తెలంగాణీయుడు)

(ఈ నెల 9న ప్రవాసీ భారతీయుల దినోత్సవం సందర్భంగా)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

రూ.1.14లక్షల కోట్లతో మెక్సికో గోడ

నిర్మాణానికి పదేండ్లు.. అమెరికా కాంగ్రెస్‌కు ట్రంప్ ప్రతిపాదన

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష డెమోక్రాట్లు


వాషింగ్టన్, జనవరి 6: తమ దేశానికి, మెక్సికోకు మధ్య సరిహద్దు వెంబడి పదేండ్లలో గోడ నిర్మాణాన్ని పూర్తిచేస్తామని, అందుకు 1800 కోట్ల డాలర్లు (రూ.లక్షా 14వేల కోట్లు) అవసరమవని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 2016లో అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో అమెరికా-మెక్సికో మధ్య గోడను నిర్మిస్తానని ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. అతిపెద్ద, అందమైన గోడను నిర్మిస్తానని చెబుతూ వచ్చిన ట్రంప్.. అందుకు పదేండ్ల సమయం పడుతుందని తాజాగా ప్రకటించారు. గోడ నిర్మాణానికి తగినంత నిధుల్ని కేటాయించాలని ఆయన అమెరికా కాంగ్రెస్ (చట్టసభ)ను కోరారు. 2027నాటికి 1552 కిలోమీటర్ల మేర (అంటే మొత్తం 3218 కిలోమీటర్ల సరిహద్దుల్లో సగం) గోడ నిర్మాణం పూర్తవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు పలు ప్రతిపాదనలను ఆయన కాంగ్రెస్ ముందు ఉంచారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం 3300 కోట్ల డాలర్లు కాగా, అందులో గోడ నిర్మాణానికి 1800కోట్ల డాలర్లు ఖర్చుచేయనున్నారు. సాంకేతిక అవసరాలకు 570కోట్ల డాలర్లు, రోడ్ల నిర్మాణానికి 100 కోట్లు, 5000మందితో గస్తీ బలగాలు, 2500మంది భద్రతాసిబ్బంది, ఇతర సిబ్బంది నియామకానికి 850 కోట్ల డాలర్లు ఖర్చవుతుందని ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ట్రంప్ నిర్ణయాన్ని చెత్త ఆలోచనగా ప్రతిపక్ష డెమోక్రాట్లు పేర్కొంటున్నారు. 'అవసరంలేని ఓ గోడ నిర్మాణం కోసం రూ. 1.14లక్షల కోట్లు ఖర్చుచేయడం సహేతుకంగా లేదు' అని కాంగ్రెస్‌లో డెమోక్రటిక్ పక్ష నేత జోయ్ క్రౌలీ చెప్పారు.



నిర్మించబోయే మెక్సికో గోడ నమూనాలు

రామమందిరం ఉద్యమాన్ని వీహెచ్‌పీ, ఆరెస్సెస్ బలహీనపర్చాయి

హిందూ ముస్లింలు కొట్లాడుకోవడమే వారికి కావాలి: స్వరూపానంద సరస్వతి



లక్నో, జనవరి 6: రామమందిరం ఉద్యమాన్ని విశ్వహిందూపరిషత్ (వీహెచ్‌పీ), రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) బలహీనపర్చాయని ద్వారకా పీఠ శంకరాచార్య స్వరూపానంద సరస్వతి ఆరోపించారు. మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీని తాను కలిసిన తర్వాతే అప్పటివరకు మూసి ఉన్న వివాదాస్పద భూమిని మళ్లీ తెరిచారని చెప్పారు. శనివారం అలహాబాద్‌లో స్వరూపానంద మీడియాతో మాట్లాడుతూ 'రాజీవ్‌గాంధీని నేను కలిసిన తర్వాతే ఆ భూమిని మళ్లీ తెరిచారు. కానీ ఆరెస్సెస్, వీహెచ్‌పీ కార్యకర్తలు.. ముస్లింల మనోభావాలు దెబ్బతీసేలా విజయోత్సవాలు జరుపుకొన్నారు. వారు రామమందిరం ఉద్యమాన్ని బలహీనపర్చారు. హిందువులు, ముస్లింలు కొట్లాడుకోవడమే వారికి కావాలి. హిందువులు ముస్లింలను అసహ్యించుకునేలా చేయడం కోసం... ఒవైసీ లాంటివారు విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేలా వారే రెచ్చగొడుతున్నారు' అని పేర్కొన్నారు. 'వివాదాస్పద స్థలం రాముడు పుట్టిన ప్రాంతం అనేందుకు ఆధారాలున్నాయి. స్కందపురాణంలోనూ ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఈ స్థలంలో మసీదు లేదు. హైకోర్టు నిర్ణయం ప్రకారం.. ఈ స్థలాన్ని మూడు భాగాలుగా విభజించారు. కానీ రామమందిరం కోసం మొత్తం స్థలం ఇవ్వాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. ఆలయం పక్కన మసీదు నిర్మిస్తే భవిష్యత్‌లో ఎప్పుడూ సమస్యలొస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

2020 అమెరికా అధ్యక్ష బరిలో నిక్కీహేలీ!

'ఫైర్ అండ్ ఫ్యూరీ' పుస్తకంలో ఊల్ఫ్ వెల్లడి



న్యూఢిల్లీ, జనవరి 6: ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారిగా విధులు నిర్వహిస్తున్న నిక్కీ హేలీ 2020లో ఆ దేశ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడాలని ఆసక్తిగా ఉన్నారని మైఖేల్ ఊల్ఫ్ రాసిన 'ఫైర్ అండ్ ఫ్యూరీ: ఇన్‌సైడ్ ది ట్రంప్' అనే పుస్తకంలో పేర్కొన్నారు. ఆమెను తన రాజకీయ వారసురాలని ట్రంప్ కూడా పరిగణిస్తున్నట్లు పుస్తకంలో తెలిపారు. ట్రంప్ కంటే నిక్కీ హేలీ మెరుగైన అధ్యక్షురాలిగా ఉంటారని దేశాధ్యక్షుడి సన్నిహితుల మధ్య చర్చ జరిగిందని కూడా గుర్తు చేశారు. సౌత్ కరోలినా గవర్నర్‌గా పని చేసిన తొలి మహిళ నిక్కీ హేలీ భారతసంతతి వారు. అయితే ఆమె 2016 ఎన్నికల్లో ఫ్లోరిడా సెనెటర్ మార్కో రూబియో అభ్యర్థిత్వానికి తొలుత మద్దతు పలికారు. కానీ రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ అభ్యర్థిత్వం ఖరారు కాగానే ఆయనకు గట్టి మద్దతు దారుగా మారిపోయారు. ట్రంప్ కుమార్తె ఇవాంకతో స్నేహ పూర్వకంగా ఉండే నిక్కీ హేలీ.. ఆ కుటుంబంతో అనుబంధం పెంచుకున్నారు. నిక్కీ హేలీని తొలుత విదేశాంగశాఖ మంత్రిగా నియమించాలని ట్రంప్ భావించారు.. చివరకు ఐరాసలో అమెరికా రాయబారిగా నియమించారని ఊల్ఫ్ వివరించారు. డొనాల్డ్ ట్రంప్ తన మాజీ సలహాదారు స్టీవ్ బానన్ వ్యతిరేకత వల్లే నిక్కీ హేలీని విదేశాంగశాఖ మంత్రిగా నియమించలేదని తెలిపారు.



సోపోర్‌లో ఉగ్రవాదులు ఐఈడీ బాంబు పేల్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఓ జవాన్

పెట్రోలింగ్ వాహనంపై ఉగ్రదాడి

నలుగురు పోలీసుల మృతి

కశ్మీర్‌లో ఘటన ■ తమ పనేనన్న జైషే మహ్మద్

దాడిని ఖండించిన సీఎం మెహబూబా ముఫ్తీ

శ్రీనగర్, జనవరి 6: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు. పోలీసుల పెట్రోలింగ్ వాహనం లక్ష్యంగా శక్తిమంతమైన ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్) బాంబును పేల్చారు. దీంతో నలుగురు పోలీసులు మృతిచెందారు. పేలుడు ధాటికి మూడు దుకాణాలు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటన శనివారం ఉదయం బారాముల్లా జిల్లా సోపోర్‌లో చోటుచేసుకుంది. జైష్-ఏ-మహమ్మద్(జేఈఎం) సంస్థ బంద్‌కు పిలుపునివ్వడంతో ఈ ప్రాంతంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అయితే వీరి వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు ఐఈడీ బాంబును రిమోట్ కంట్రోల్‌తో పేల్చారు. దీంతో ఓ ఏఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు మరణించారు. మృతులను ఏఎస్సై ఇర్షాద్ అహ్మద్, కానిస్టేబుళ్లు గులాం నబీ, పర్వేజ్ అహ్మద్, మహ్మద్ అమిన్‌గా గుర్తించారు. వీరంతా ఇండియన్ రిజర్వ్ పోలీస్ మూడో బెటాలియన్‌కు చెందినవారు. జమ్ముకశ్మీర్‌లో 2015 తర్వాత జరిగిన మొదటి ఐఈడీ బాంబు దాడి ఇదే. ఈ దాడిని జమ్ముకశ్మీర్ సీఎం మహబూబా ముఫ్తీ, మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా ఖండించారు. 'విధులు నిర్వర్తిస్తున్న పోలీసులపై దాడి జరుగడం దురదృష్టకరం. మృతిచెందిన పోలీసుల కుటుంబాలకు సంతాపం తెలియజేస్తున్నాను' అని మెహబూబా ట్వీట్ చేశారు. ఈ దాడికి తామే బాధ్యులమని జేఈఎం ప్రకటించింది. డిసెంబర్ 31న పుల్వామాలో ఉగ్రవాదులు ఆత్మాహుతి దాడిచేయడంతో ఐదుగురు సీఆర్పీఎఫ్ సిబ్బంది మృతిచెందిన విషయం తెలిసిందే.



మృతిచెందిన పోలీసులు.. ఇర్షాద్ అహ్మద్, గులాంనబీ, పర్వేజ్ అహ్మద్, మహ్మద్ అమిన్

కశ్మీర్‌లో లోయలో పడిన బస్సు

ఆరుగురి మృతి.. 17 మందికి గాయాలు

ఉధంపూర్: జమ్ముకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో ఓ మినీ బస్సు ప్రమాదానికి గురయ్యింది. రాంనగర్ నుంచి ఉధంపూర్ వస్తున్న బస్సు శనివారం మధ్యాహ్నం 1.30 గంటలకు కరోవా వద్ద వంద అడుగులు ఉన్న లోయలో అదుపుతప్పి పడిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 17 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. సహాయ బృందాలు నాలుగు మృతదేహాలను బయటకు తీసినట్టు పోలీసులు తెలిపారు. మరో ఇద్దరు దవాఖానలో చికిత్స పొందుతూ మరణించారని చెప్పారు. ప్రమాదంలో గాయపడ్డ 17 మందిని సమీపంలోని దవాఖానకు తరలించినట్టు వెల్లడించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు అధికారులు చెప్పారు.

మంచు పెళ్లలు విరిగి పడిన ఘటనలో 11 మంది దుర్మరణం



శ్రీనగర్: కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ప్రయాణికుల వాహనాలపై భారీ మంచు పెళ్లలు కూలిపడిన ప్రమాదంలో 11 మంది మృతిచెందారు. మృతుల్లో సరిహద్దు రోడ్డు నిర్వహణ(బీఆర్వో) అధికారి ఉన్నారు. ముగ్గురిని కాపాడారు. కుప్వారా-తంగధర్ రహదారిపై ఖూనినల్లా సమీపంలో ప్రయాణికుల వాహనాలపై శుక్రవారం సాయంత్రం భారీ మంచుపెళ్లలు కూలిన సంగతి తెలిసిందే. శుక్రవారం రాత్రి పోలీసులు, ఆర్మీ, సహాయ సిబ్బంది మంచుపెళ్లలను తొలిగించి బీఆర్వో అధికారిని వెలికితీశారు. ఆయనను దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. శనివారం 10 మృతదేహాలను వెలికితీశామని కుప్వారా డిప్యూటీ కమిషనర్ ఖలిద్ జహంగీర్ తెలిపారు. మరోవైపు ఈప్రమాదంలో మృతిచెందిన వారికి రూ.4లక్షల చొప్పున నష్టపరిహారాన్ని అధికారులు ప్రకటించారు.

ప్రాణం పోయినా బీజేపీకి లొంగను

లాలూ ప్రసాద్ ట్వీట్ ■ ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడకూడదనే కుట్రలో భాగమే ఇదంతా

తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తాం ■ లాలూ కుమారుడు తేజస్వీ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 6:

తన ప్రాణం పోయినా బీజేపీకి లొంగనని, చావడానికైనా సిద్ధమేనని ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో సామాజిక న్యాయం, సామరస్యం, సమానత్వం కొరవడిందని విమర్శించారు. దాణా కుంభకోణం కేసులో తనకు మూడున్నరేండ్ల జైలుశిక్ష పడిన నేపథ్యంలో ఆయన ఈ మేరకు ట్విట్టర్లో స్పందించారు. మరోవైపు లాలూ కుమారుడు తేజస్వీ యాదవ్ పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ తన తండ్రి విషయంలో బీజేపీ, ఆరెస్సెస్, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ కలిసి కుట్ర పన్నారని ఆరోపించారు. 'ఒకవేళ మా నాన్న బీజేపీకి మద్దతు తెలిపితే పరిస్థితి మరోలా ఉండేది. లాలూ అంతటి నిజాయితీ పరుడు మరొకరు ఉండరని, రాజా హరిశ్చంద్రతో పోల్చేవారు. 2019 సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ప్రతిపక్షాలు కూటమిగా ఏర్పడకుండా ఉండటానికే ఈ కుట్ర పన్నారు. కుట్ర వివరాలను సంక్రాంతి తర్వాత ప్రజలకు వివరిస్తాం. ముందుగా సీబీఐ న్యాయమూర్తి తీర్పును పూర్తిగా అధ్యయనం చేస్తాం. తర్వాత ఈ తీర్పును హైకోర్టులో సవాల్ చేస్తాం. బెయిల్ కోసం దరఖాస్తు చేస్తాం' అని తేజస్వీ పేర్కొన్నారు.



బందోబస్తు మధ్య లాలూను జైలుకు తరలిస్తున్న పోలీసులు

దోషులను ఓపెన్ జైల్లో ఉంచడమే ఉత్తమం

లాలూకు శిక్ష ప్రకటించాక జడ్జి శివపాల్ సింగ్ వాఖ్య



దాణా కుంభకోణం రెండో కేసులో లాలూప్రసాద్‌ను గత నెల 23న దోషిగా ప్రకటించిన తరువాత ఆయనను బిర్సాముండా సెంట్రల్ జైల్లో ఉంచారు. శిక్షల ప్రకటన శనివారం జరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు లాలూ.. తీర్పునిచ్చిన సీబీఐ కోర్టు జడ్జి శివపాల్‌సింగ్ మధ్య కొన్ని సరదా సంభాషణలు జరిగాయి. తనను దోషిగా నిర్ణయించారన్న కోపంతో కావచ్చు లాలూ కాస్తా నిరసన స్వరంతోనే జడ్జితో మాట్లాడారు. జైల్లో తనకు ఎదురవుతున్న సమస్యల గురించి ప్రస్తావించారు. స్వతహాగా హాస్యప్రియంగా మాట్లాడే లాలూకు జడ్జి శివపాల్‌సింగ్ కూడా అదే తీరున టక్కున జవాబులిచ్చారు. అటువంటి సంభాషణలు కొన్ని...

లాలూ: జడ్జి సాబ్ జైలులో చాలా చలిగా ఉంది.

జడ్జి: చలిగా ఉంటే హార్మోనియం, తబలా వాయించండి.. వేడెక్కుతారు.

లాలూ: ఈ జైలులో ఒక ట్రాన్స్‌జెండర్ (లింగమార్పిడి వ్యక్తి) ఉన్నాడు. అతడు తనను పెండ్లి చేసుకోమని ఇతర ఖైదీలను అడుగుతున్నాడు.

జడ్జి: తమరు అక్కడే ఉన్నారు కదా.. అంతా పరిష్కారమవుతుంది లెండి.

(ఈ కేసులో తనకు ఎన్నేండ్ల జైలు శిక్ష పడుతుందోనని ఆందోళనతో ఉన్న లాలూ.. జడ్జిని ఒక కోరిక కోరారు. ఆ సంభాషణ ఇలా ఉంది.)

లాలూ: దయచేసి కూల్‌మైండ్‌తో (ప్రశాంతంగా) శిక్షలు ప్రకటించండి.

జడ్జి: మీ శ్రేయోభిలాషుల నుంచి ఫోన్ల ద్వారా నాకు ఇటువంటి వినతులు వచ్చాయి. అయినా ఆందోళన చెందకండి.. నేను చట్టాన్నే అనుసరిస్తాను.


శనివారం శిక్షలు ప్రకటించాక జడ్జి సింగ్ వెలిబుచ్చిన అభిప్రాయం:

'ఈ కేసులో దోషులను ఓపెన్ జైలులో ఉంచడమే ఉత్తమం. ఎందుకంటే వారికి పశువుల పెంపకంలో అనుభవం ఉంది..'

దాణాతో సీఎం పదవికి లాలూ దూరం

1996 నుంచి 2017 వరకు సుదీర్ఘంగా సాగిన దర్యాప్తు

రాంచీ: ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్‌ను బీహార్ సీఎం పదవికి దూరం చేసిన దాణా కుంభకోణం 1996లో వెలుగులోకి వచ్చింది. పశువులకు దాణా, ఔషధాల సరఫరా పేరుతో అధికారులు తప్పుడు లెక్కలతో ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు స్వాహా చేసినందునే దీనికి పశుదాణా కుంభకోణం అనే పేరు వచ్చింది. ఈ కుంభకోణంలో సుమారు రూ.950 కోట్లు చేతులు మారాయని ఆరోపణలు రాగా 61 కేసులు నమోదయ్యాయి. రెండు దశాబ్దాలకు పైగా సాగిన ఈ కేసుపై 1996లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని విచారించిన సుప్రీంకోర్టు.. దీన్ని సీబీఐకి అప్పగించాలని పాట్నా హైకోర్టును ఆదేశించింది. ఈ కుంభకోణంతో సంబంధం ఉన్నదని గుర్తించిన సీబీఐ అప్పటి సీఎం అయిన లాలూను ప్రశ్నించేందుకు బీహార్ గవర్నర్ ఏఆర్ కిద్వాయి అనుమతి తీసుకుంది. అప్పటివరకు జనతాదళ్ అధ్యక్షుడిగా ఉన్న లాలూప్రసాద్ యాదవ్‌ను సీఎంగా తొలిగించాలన్న డిమాండ్ పార్టీలో అంతకంతకు పెరిగింది. 1997 జూలై ఐదో తేదీన జనతాదళ్‌ను చీల్చి రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ)ని ఏర్పాటు చేసిన లాలూ.. 1997 జూలై 25న సీఎం పదవికి రాజీనామా చేశారు. అదే నెల 28న లాలూ సతీమణి రబ్రీదేవి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 1997 జూలైలో లాలూను సీబీఐ అరెస్ట్ చేసింది. 135 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత డిసెంబర్ 12న ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. దాణా కుంభకోణంలోనే మరో కుట్ర కేసుకు సంబంధించి 1998 అక్టోబర్ 28న లాలూను సీబీఐ అరెస్ట్ చేసింది. ఈసారి లాలూను బేయూర్ జైలుకు తరలించింది. 2000లో బీహార్ నుంచి జార్ఖండ్ విడిపోవడంతో 2001లో 39 కేసులు ఆ రాష్ట్రానికి బదిలీ అయ్యాయి. ఈ సందర్భంగా కేసు పత్రాలను 20 లారీల్లో రాంచీకి తరలించారు. అంతకుముందు అక్రమాస్తుల కేసులో 2000 ఏప్రిల్ ఐదో తేదీన అరెస్టయిన లాలూ 11రోజులు జైలులో ఉన్నారు. ఇదే కేసులో సీఎం రబ్రీదేవి సీబీఐ కోర్టులో లొంగిపోయినా.. వెంటనే బెయిల్ మంజూరైంది. అదే ఏడాది నవంబర్ 28న మరో కేసులో అరెస్ట్ అయిన లాలూ ఒకరోజు మాత్రం జైలు జీవితం గడిపారు. 2013 మేలో దాణా కుంభకోణంలోని 53 కేసులకు 44 కేసుల విచారణ పూర్తయింది. గతేడాది మే 8న లాలూకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆయనపై ఉన్న వేర్వేరు కేసులను విడివిడిగా విచారించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాగే తొమ్మిది నెలల్లో కేసుల విచారణ పూర్తి చేయాలని కూడా దిగువ న్యాయస్థానాన్ని ఆదేశించింది. గతేడాది డిసెంబర్ 23న లాలూ ప్రసాద్ యాదవ్ తదితరులను దోషులుగా రాంచీ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నిర్ధారించింది.



1997లో జైలుకు వెళ్తున్న లాలూ

లాలూ కుమార్తె, అల్లుడిపై రెండో చార్జిషీట్ దాఖలు



అక్రమాస్తుల కేసులో ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ కుమార్తె మీసాభారతి, ఆమె భర్త శైలేశ్‌కుమార్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం ఢిల్లీ కోర్టులో రెండో చార్జిషీట్ దాఖలుచేసింది. రెండు చార్జిషీట్లపై వచ్చేనెల 5వ తేదీన విచారణ జరుపుతామని న్యాయస్థానం తెలిపింది. అక్రమాస్తుల కేసుతో సంబంధం ఉందంటూ మీసాభారతి, శైలేశ్‌కుమార్‌పై ఈడీ పదే పదే చార్జిషీట్లు దాఖలు చేస్తే విచారణ చేపట్టడం ఎలాగని ప్రత్యేక జడ్జి ఎన్‌కే మల్హోత్ర ప్రశ్నించారు. 'విచారణ ప్రారంభించాలా? లేదా ఇలాగే ఫిర్యాదులు అందుకోవాలా? ఇంకెన్ని అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేస్తారు? మీదొక ప్రాథమిక విచారణ సంస్థ మాత్రమే. మీరు ఇలా ప్రవర్తించడం సరికాదు' అని మల్హోత్ర చెప్పారు. డిసెంబర్ 23వ తేదీనే తొలి చార్జిషీట్‌ను ఈడీ దాఖలు చేయగా, విచారణను వచ్చేనెల 5కు కోర్టు వాయిదా వేసింది. ఈడీ ప్రత్యేక న్యాయవాది అతుల్ త్రిపాఠి విజ్ఞప్తి మేరకు.. రెండు చార్జిషీట్లను కలిపి ఫిబ్రవరి 5వ తేదీనే విచారిస్తామని న్యాయస్థానం పేర్కొన్నది.

జీడీపీ.. గ్రాస్ డివిజన్ పాలిటిక్స్!

- **కొత్త అర్థం చెప్పిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్**
- **వృద్ధిరేటు తగ్గుదల అంచనాల నేపథ్యంలో కేంద్రంపై విమర్శలు**



న్యూఢిల్లీ: జీడీపీకి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌కు) కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ మరో అర్థం చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధిరేటు తక్కువగా ఉంటుందని కేంద్ర గణాంక కార్యాలయం (సీఎస్‌వో) వేసిన అంచనాలపై స్పందించిన రాహుల్ కేంద్రంపై శనివారం విమర్శలు గుప్పించారు. అరుణ్‌జైట్లీ, మోదీ కలిసి దేశానికి విభజన రాజకీయాలను అందించారన్న అర్థం వచ్చేలా జీడీపీని 'గ్రాస్ డివిజన్ పాలిటిక్స్'గా అభివర్ణించారు. పెట్టుబడులు 13 ఏండ్ల కనిష్ఠానికి, బ్యాంకుల పరపతి 63 ఏండ్ల కనిష్ఠానికి, ఉపాధి కల్పన 8 ఏండ్ల కనిష్ఠానికి చేరాయని ఆరోపించారు. వ్యవసాయరంగ స్థూల విలువ జోడింపు (జీవీఏ) 1.7శాతానికి దిగజారిందని, ద్రవ్యలోటు 8 ఏండ్ల గరిష్ఠానికి చేరిందని, పెండింగ్ ప్రాజెక్టులు సైతం పెరిగాయని ఆరోపిస్తూ ట్వీట్ చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 6.5శాతానికి తగ్గే అవకాశముందని కేంద్ర గణాంక కార్యాలయం అంచనాలను ప్రకటించింది. వ్యవసాయం, వస్తు తయారీ రంగం పేలవ ప్రదర్శనే కారణాలన్నది. ఈసారి వృద్ధిరేటు 0.6శాతం తగ్గి నాలుగేండ్ల కనిష్ఠానికి చేరుకుంటుందని సీఎస్‌వో అంచనావేసింది.

భయపడినంతా అయ్యింది: చిదంబరం

మోదీ అసంబద్ధ ఆర్థిక విధానాలతో భారత ఆర్థిక వ్యవస్థ ఎలాంటి ప్రమాదాన్ని ఎదుర్కొంటుందోనని ఇన్నాళ్లూ భయపడ్డామని, ఇప్పుడు అలాంటి పరిస్థితే ఎదురవుతున్నదని కేంద్ర మాజీ ఆర్థికమంత్రి చిదంబరం చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు తక్కువగా ఉండనుందన్న కేంద్ర గణాంకశాఖ అంచనాను ప్రస్తావిస్తూ.. నోట్లరద్దుతో అసంఘటితరంగం తీవ్రంగా దెబ్బతిన్నదని చెప్పారు. 'ఎగుమతులు నిలిచిపోయాయి. తయారీరంగం కుదేలైంది. వ్యవసాయరంగం తీవ్రంగా దెబ్బతిన్నది. గ్రామీణరంగంపై ఎలాంటి ఆశ లేకుండాపోయింది. ఇక ఉపాధికల్పన బీజేపీ ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యంగా నిలిచింది' అని చిదంబరం విమర్శించారు. భారత్ దూసుకెళ్తున్నదంటూ మోదీ ప్రభుత్వం ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా, ఆర్థిక విధానాల డొల్లతనం బయటపడుతూనే ఉందని అన్నారు. 63 ఏండ్లలో ఎన్నడూ లేని విధంగా బ్యాంకుల పరపతి కనిష్ఠానికి పతనం కావడం ఆర్థిక వ్యవస్థకు మంచిది కాదని చిదంబరం చెప్పారు.

రాహుల్‌పై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు

లోక్‌సభకు పంపిన రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు

రాజ్యసభలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా నమోదైన సభాహక్కుల ఉల్లంఘన నోటీసును సభ చైర్మన్ వెంకయ్యనాయుడు శనివారం లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు పంపారు. గుజరాత్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఎవ్వరినీ కించపర్చలేదని, మాజీ ప్రధాని మన్మోహన్‌ను అవమానించలేదని రాజ్యసభలో కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ రాహుల్ ఓ ట్వీట్ చేశారు. 'జైట్ లై (జైట్లీ అబద్ధాల కోరు అనే అర్థం వచ్చేలా).. మన ప్రధాని చెప్పిన పనులు అస్సలు చేయరని మీరు ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు. అబద్ధాల బీజేపీ' అని ట్వీట్ చేశారు. దీంతో బీజేపీ రాజ్యసభ సభ్యుడు భూ పిందర్ యాదవ్.. రాహుల్‌కు వ్యతిరేకంగా సభాహక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. రాహుల్ ట్వీట్ సభాహక్కుల ఉల్లంఘనైతే ఇలాంటి వ్యాఖ్యలను కేంద్రమంత్రులు పలుసార్లు చేశారని, వారంతా హక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లేనా అని కాంగ్రెస్ ప్రశ్నించింది.

త్వరలో అంతరిక్షంలోకి 'జీశాట్-11'



న్యూఢిల్లీ,: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మానస పుత్రిక డిజిటల్ ఇండియా కార్యక్రమానికి ఊతం ఇచ్చేలా ఇస్రో నూతన ఉపగ్రహాన్ని తయారుచేసింది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్ కమ్యూనికేషన్ సేవలను అం దించేందుకు ఈ ఉపగ్రహాన్ని రూపొందించింది. జీశాట్-11గా పిలిచే ఈ భారీ ఉపగ్రహాన్ని త్వరలో దక్షిణ అమెరికాలోని ఫ్రెంచ్ గయానాలో ఉన్న కౌరు ఉపగ్రహ పరిశోధన కేంద్రం నుంచి ప్రయోగిస్తారు. ఈ కేంద్రం ద్వారా ఫ్రెంచ్ అరెనా-5 రాకెట్‌ను ప్రయోగించేటప్పుడు దీని వెంటే జీశాట్-11ను ప్రయోగిస్తారు. రూ. 500కోట్లతో తయారుచేసిన జీశాట్-11 బరువు దాదాపు ఆరు టన్నులు. ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలను అందించే జీశాట్-11 భారత టెలికం రంగానికి నూతన బలాన్ని చేకూర్చనుంది. ఈ ఉపగ్రహానికి ఏర్పాటు చేసిన సౌరశక్తి ఫలకం దాదాపు నాలుగు మీటర్లకన్నా పెద్దగా ఉంది. ఇస్రో చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 'ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల కోసం జీశాట్-11ను ప్రయోగించడం ఇదే మొదటిసారి. జీశాట్-11 భారత్‌కు నూతన శక్తిని అందించనున్నది. ప్రధానంగా డిజిటల్ ఇండియా కార్యక్రమానికి ఎంతో ఉపయోగపడుతుంది' అని తెలిపారు.

ఆసియాన్‌తో ఆర్థికబంధం బలోపేతం

విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ వెల్లడి

జకార్తా: ఆగ్నేయాసియా దేశాలతో లోతైన ఆర్థిక సంబంధాలు ఏర్పాటు కావాలని కోరుకుంటున్నట్లు భారత్ విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ చెప్పారు. శనివారం ఆమె ఇండోనేషియా రాజధాని జకార్తాలో ఆసియాన్ ఆధ్వర్యంలోని రౌండ్ టేబుల్ సమావేశాన్ని ప్రారంభిస్తూ సముద్ర తీర భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, సాంస్కృతిక వారసత్వం తదితర అంశాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని పిలుపునిచ్చారు. సముద్ర తీర దేశాలైన భారత్, ఆసియాన్ సభ్య దేశాలకు జల మార్గ వాణిజ్యంలో అద్భుతమైన, సుసంపన్నమైన చరిత్ర ఉన్నదని గుర్తు చేశారు. హిందూ, పసిఫిక్ మహా సముద్రాల మధ్య ప్రపంచ వాణిజ్యం నిర్వహించేందుకు వీలుగా భారత్ – పసిఫిక్ ప్రాంతాల మధ్య అనుసంధాన ప్రక్రియ వేగవంతమవుతున్నదన్నారు.

ముంబై సినీ స్టూడియోలో అగ్నిప్రమాదం

ముంబై: ముంబైలోని సినీ విస్టా స్టూడియోలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు తెలిపారు. అయితే ప్రమాద నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదని చెప్పారు. అగ్నిమాపక దళాలు రంగంలోకి దిగి మంటలను అదుపుచేస్తున్నాయని వివరించారు.

మోజోస్ బిస్ట్రో పబ్ యజమాని అరెస్ట్: ముంబైలోని మోజోస్ బిస్ట్రో పబ్ యజమానుల్లో ఒకరైన యుగ్ పథక్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కమలా మిల్స్ సముదాయ భవనంలో ఉన్న వన్ ఎబోవ్ పబ్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి 14 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదం జరిగిన సమయంలో వన్ ఎబోవ్ పబ్ పక్కన ఉన్న మోజోస్ బిస్ట్రో పబ్‌లోనూ మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలోనే యుగ్ పథక్‌ను అరెస్టు చేశారు.

బెంబేలెత్తిస్తున్న బాంబ్ సైక్లోన్!

- **అమెరికా, కెనడాలను వణికిస్తున్న మంచుతుఫాన్**
- **20కి చేరిన మృతుల సంఖ్య.. ప్రమాదకరంగా శీతలగాలులు**
- **మిన్నెసోటాలో మైనస్ 41 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు**



జీవోఈఎస్-16 ఉపగ్రహం పంపిన మంచుతుఫాన్ ఫొటో



మన్‌హట్టన్‌లో మంచుతో కూడిన ఈదురుగాలులు

వాషింగ్టన్: అమెరికాలో బీభత్సం సృష్టిస్తున్న మంచు తుఫాన్ (బాంబ్ సైక్లోన్) క్రమంగా కెనడాకూ విస్తరించింది. ఉష్ణోగ్రతలు బాగా పడిపోవడంతో రహదారులన్నీ గడ్డకట్టుకుపోయాయి. దీనికితోడు ప్రమాదకరంగా మంచుతో కూడిన గాలులు వీస్తుండడంతో జీనజీవనం పూర్తిగా స్తంభించింది. దీంతో ఇప్పటివరకు అమెరికాలో 18మంది, కెనడాలో ఇద్దరు మృతిచెందారు. రోడ్లపై పేరుకుపోయిన మంచుతో కార్లు బోల్తాపడి నలుగురు ప్రాణాలు కోల్పోగా, మిగతా వారు అనారోగ్యంతో మరణించారు. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. శుక్రవారం మిన్నెసోటాలో మైనస్ 41, న్యూ ఇంగ్లండ్‌లోని కరిబో, ఉత్తర మియానె ప్రాంతాల్లో మైనస్ 40, దక్షిణ డకోటాలో మైనస్ 36 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగతలు నమోదయ్యాయి. న్యూహాంప్షైర్‌లోని మౌంట్ వాషింగ్టన్ సమిట్ పర్వతంపై ఉష్ణోగ్రతలు మైనస్ 70 డిగ్రీల సెల్సియస్ స్థాయికి పతనమయ్యాయని అధికారులు తెలిపారు. న్యూయార్క్‌లోని టైమ్స్‌స్క్వేర్‌లోనూ మైనస్ 13 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. గత రెండు రోజుల్లో అమెరికాలో ఏడువేలకు పైగా విమానసర్వీసులను రద్దు చేశారు. కెనడా తీరం వెంబడి బోటు సేవల్ని నిలిపివేశారు. ఫ్లోరిడా నుంచి మియానె వరకు తూర్పుతీరం వెంబడి విద్యుత్ సేవలు నిలిచిపోయాయి. సుమారు లక్షమంది రెండురోజులుగా అంధకారంలోనే ఉన్నారు. కాగా, గడ్డకట్టిన నయాగరా జలపాతాన్ని చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు.

కెనడానూ కుదిపేస్తూ..: మంచుతుఫాన్ కెనడాలోని పలు ప్రాంతాలను తాకింది. హాలిఫాక్స్ నుంచి అట్టావా వరకు గంటకు 105 కి.మీ.వేగంతో మంచుగాలులు వీస్తున్నాయని వాతావరణశాఖ ప్రకటించింది. టొరంటోలో మైనస్ 21 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని, వచ్చే రెండురోజుల్లో అది మైనస్ 31 డిగ్రీలకు పడిపోవచ్చని హెచ్చరించింది. బాంబ్ సైక్లోన్ బాధిత ప్రాంతాలవాసులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని టొరంటో మేయర్ జాన్ టోరీ కోరారు. హ్యూరన్ సరస్సు తీరాన ఉన్న బ్లూవాటర్ పట్టణంలో వృద్ధజంట చనిపోయింది. మంచుతుఫాన్ కారణంగా పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నోవాస్కోటియాలో 11,400మంది అంధకారంలోనే ఉన్నారు.

ప్రభుత్వ బడులకు ప్రైవేటు విద్యార్థులు

■ 15 నుంచి 20 శాతం పెరిగిన విద్యార్థుల నమోదు
■ పైతరగతులకు వెళ్తున్న విద్యార్థుల్లో మనమే టాప్
■ సత్ఫలితాలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విద్యాభివృద్ధికి మూడేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, గురుకుల విద్యాలయాల్లో సకల సౌకర్యాలు సమకూర్చడం వల్ల ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థల వైపు ఆకర్షితులవుతున్నారు. ఫలితంగా 2017-18 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య 15 నుంచి 20 శాతం వరకు పెరిగిందని విద్యాశాఖ అధికారిక లెక్కలు స్పష్టంచేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన 2014-15 నుంచి 2017-18 విద్యసంవత్సరం వరకు అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సన్న బియ్యంతో అన్నం పెడుతున్నారు. పైగా మెస్‌చార్జీలను భారీగా పెంచడం, పోషక విలువలతో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థంగా అమలుచేయడంలో దేశంలోనే తెలంగాణ ప్రథమ వరుసలో ఉన్నది. పాఠశాలల్లో పోస్టులు ఖాళీగా ఉంచకుండా రెగ్యులర్ ఉపాధ్యాయులతోపాటు విద్యావలంటీర్లను కూడా నియమించారు. దీంతో తరగతులు నిత్యం జరుగుతున్నాయి. ప్రారంభంలో ఇంటింటికి బడిబాట నిర్వహించి బడిబయట పిల్లలను బడిలో చేర్పించారు. అడ్మిషన్లకు ఆధార్‌నంబర్ అనుసంధానం చేయడంతో ప్రైవేటు స్కూళ్లలో నకిలీ అడ్మిషన్ల విధానానికి తెరపడింది.

తగ్గిన డ్రాపౌట్స్

రాష్ట్ర ప్రభుత్వ చర్యల కారణంగా కింది నుంచి పైతరగతులకు వెళ్లే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. మధ్యలో చదువు మానేసే వారి సంఖ్య బాగా తగ్గింది. 2016-17 విద్యాశాఖ గణాంకాల ప్రకారం 92.46 శాతం మంది విద్యార్థులు పైతరగతులకు వెళ్తున్నారు. ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు. ఇందులో బాలురు 92.75 శాతం, బాలికలు 92.15 శాతం చొప్పున ఉన్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో దిగ్విజయంగా కొనసాగుతున్న కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, తెలంగాణ గురుకులాల అభివృద్ధిపై పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మూడు రకాల విద్యాసొసైటీల్లో ఉమ్మడి భోజన పట్టిక అమలవుతున్నది.చలికాలం నేపథ్యంలో హాస్టల్ విద్యార్థులకు ఉచిత రగ్గుల పంపిణీ పూర్తయింది. అన్ని హాస్టళ్లకు 90 శాతం వరకు పక్కా భవనాలున్నాయి. బాలికల రక్షణ కోసం కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో సీసీ కెమెరాలు, నైట్ వాచ్‌మెన్, స్వీపర్ వంటి ఉద్యోగాలను భర్తీచేశారు. టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది హాజరు కోసం బయోమెట్రిక్ అమలు పరిచారు. మంచినీటి కోసం ఆర్వోప్లాంట్లను ఏర్పాటుచేశారు. ఇలాంటి చర్యల నేపథ్యంలోనే ప్రభుత్వ విద్య పట్ల ప్రైవేట్ విద్యార్థులు ఆకర్షితులవుతున్నారని ఆ శాఖ డైరెక్టర్ జీ కిషన్ చెప్పారు. పైగా ఉచితంగా నాణ్యమైన విద్య అందుతుందనే భావన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రుల్లో కూడా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో 100 శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో అనేక చర్యలను కొనసాగిస్తున్నామని చెప్పారు.



నేడు తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ సభ జరుగనున్నది. నిజామాబాద్ ఎంపీ కవిత ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మంత్రులు ఈటల రాజేందర్, జోగురామన్న, ఎంపీలు వినోద్‌కుమార్, కొండావిశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఫుడ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మామిండ్ల రాజేందర్, గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్, టీజీవో అధ్యక్షురాలు మమత, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, రెవెన్యూ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్ తదితరులు హాజరుకానున్నారు.



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సింగ్‌కు ఆలయ సిబ్బంది సాదర స్వాగతం పలికారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

దుర్గగుడి ఈవోపై వేటు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విజయవాడ కనకదుర్గ ఆలయ ఈవో సూర్యకుమారిని విధుల నుంచి ఏపీ సర్కారు తప్పించింది. శనివారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలయ వివాదంపై సమీక్షించారు. గత నెల 26న అర్ధరాత్రి ఆలయంలోకి అనుమతి లేని పూజారులు ప్రవేశించి తాంత్రిక పూజలు చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. నిజనిర్ధారణ కమిటీ ప్రాథమిక నివేదిక ప్రభుత్వానికి అందజేసింది. తక్షణ చర్యల్లో భాగంగా ఈవో సూర్యకుమారిపై వేటు వేయాలని నిర్ణయించినట్టు సమాచారం.



రాష్ట్ర మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శిగా దానకిశోర్ శనివారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. దానకిశోర్‌ను రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సయ్యద్ అక్బర్ హుస్సేన్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వీరి మధ్య మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ పథకాలు, పనితీరుపై చర్చ జరిగింది. ఫైనాన్స్ కార్పొరేషన్‌కు పూర్తిస్థాయి ఎండీని నియమించాలని అక్బర్‌హుస్సేన్ దానకిశోర్‌కు విజ్ఞప్తి చేశారు. -హైదరాబాద్, నమస్తే తెలంగాణ

బావపై మోజుతో.. భర్త హత్య

■ మద్యంలో సైనేడ్ కలిపి ఘాతుకం
■ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం
■ పోలీసుల విచారణలో బయటపడ్డ బాగోతం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మొన్న నాగర్‌కర్నూల్‌లో స్వాతి.. నిన్న హైదరాబాద్‌లో జ్యోతి.. అక్రమ సంబంధాల మోజులో కట్టుకున్న భర్తలను హతమార్చగా.. తాజాగా ఏపీలోని గుంటూరు జిల్లాలో కూడా ఇలాంటి వ్యవహారం మరొకటి వెలుగుచూసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం పొనుగుపాడుకు చెందిన నల్లబోతు నరేంద్ర (27)కు అదే గ్రామానికి చెందిన మేనమామ కూతురు శ్రీవిద్యతో మూడున్నరేండ్ల కిందట వివాహమైంది. శ్రీవిద్య నరసరావుపేటలోని ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండగా, నరేంద్ర సెక్యూరిటీ సిబ్బందిగా పనిచేస్తున్నారు. తనను ఇంటికి తీసుకెళ్లేందుకు నర్సరావుపేట రావాలని డిసెంబర్ 19న శ్రీవిద్య భర్తకు ఫోన్‌చేసింది. ఆమెను తీసుకొచ్చేందుకు వెళ్లిన నరేంద్ర మరుసటిరోజే నాదెండ్ల మండలం సాతులూరు పొలిమేరల్లో అనుమానస్పదస్థితిలో చనిపోయారు. పోలీసుల విచారణలో భార్యకు, తోడల్లుడికి మృతుడు ఎక్కువ కాల్స్ చేసినట్టు గుర్తించి కూపీ లాగారు. పెండ్లికి ముందే శ్రీవిద్యకు ప్రకాశం జిల్లా కురిచేడు మండలం ఆవులమందకు చెందిన ఆమె బావ వీరయ్యతో వివాహేతర సంబంధాలున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. తమకు అడ్డువస్తున్నాడని నరేంద్రను హతమార్చేందుకు వీరు పథకం వేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో రూ.పది లక్షలు రావాల్సి ఉన్నదని, వసూలుకు సాయం చేస్తే జనవరి 1న బుల్లెట్ కొనిస్తానని నరేంద్రకు వీరయ్య ఆశ చూపాడు. గత నెల 19న భార్యను తీసుకొచ్చేందుకు నరసరావుపేటకు బయలుదేరిన నరేంద్రను వీరయ్య స్నేహితులతో కలిసి కారులో ఎక్కించుకొన్నారు. నరేంద్రకు సైనేడు కలిపిన మద్యం అందించగా చనిపోయాడు. మృతదేహాన్ని సాతులూరు పొలిమేరలో కాల్వకట్టపై పడేశారు. పక్కన సగం ఖాళీ చేసిన మద్యం సీసాలో పురుగుమందు కలిపి ఆత్మహత్యగా చిత్రీకరించారు. నిందితుడు వీరయ్యతోపాటు సహకరించిన బాలరాజు, చౌడయ్యను అరెస్టు చేశారు.

ఎస్టీపీపీని నంబర్‌వన్‌గా నిలుపాలి

- సింగరేణి సీఎండీ శ్రీధర్ పిలుపు
- 10 మెగావాట్ల సోలార్‌ప్లాంటు ఏర్పాటుకు ఆదేశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి మంచిర్యాల జిల్లాలోని జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని (ఎస్టీపీపీ) దేశంలోనే నంబర్1 స్థానంలో నిలుపాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ పిలుపునిచ్చారు. శనివారం సింగరేణిభవన్‌లో థర్మల్ విద్యుత్ కేంద్ర అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఎస్టీపీపీ డిసెంబర్‌లో జాతీయస్థాయిలో 4వ స్థానాన్ని సాధించడంపై అభినందనలు తెలిపారు. ప్లాంటు ప్రారంభం నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా చేశామని.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తును అందిస్తున్న నేపథ్యంలో పూర్తిసామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి జరిగేలా కృషి చేయాలని సూచించారు. ఎస్టీపీపీలో 10 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంటును ఏర్పాటు చేయాలని సీఎండీ శ్రీధర్ ఆదేశించారు. సమావేశంలో డైరెక్టర్ ఎస్ శంకర్, చీఫ్ కో-ఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ఈడీ సంజయ్‌కుమార్ సూర్, చీఫ్ ఓఅండ్ఎం జేఎన్ సింగ్, జీఎంలు రాజేశ్, నర్సింహమూర్తి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

జీడీకే-1లో లీకైన విషవాయువులు

గోదావరిఖని/ఫెర్టిలైజర్‌సిటీ: సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే-1 ఇంక్లైన్‌లో శనివారం సాయంత్రం విషవాయువులు వెలువడ్డాయి. రెండో షిఫ్టులో 185 మంది కార్మికులు విధుల్లోకి దిగారు. గనిలో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఫ్యాన్ నుంచి పొగలు రావడాన్ని అధికారులు గుర్తించి కార్మికులను అప్రమత్తం చేసి అందరిని పైకి చేర్చారు. గని మేనేజర్ రమణ, ఏజెంట్ సాంబయ్యతోపాటు 28 మందితో ఉన్న నాలుగు రెస్క్యూ టీంలు ఆక్సిజన్ సిలిండర్లతో రక్షణ చర్యలు చేపట్టాయి. రాత్రి 9.30 గంటలకు గనిలో రెండు సీమ్‌లు మాత్రమే నడుస్తుండగా, 4వ సీమ్‌లో 43వ లెవల్‌లో 6,7 కాల్ మధ్య పాత బొగ్గు కుప్పకు నిప్పంటుకొని విష వాయువులు వెలువడుతున్నాయని గుర్తించారు. ఆ దిశగా రెస్క్యూ టీం సిబ్బంది బొగ్గును ట్రెంచ్ చేస్తున్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

హైదరాబాద్
ఆదివారం 7 జనవరి 2018



కుటుంబ ప్రేక్షకులకు మిడిల్ క్లాస్ అబ్బాయి..
యువతకు పక్కా లోకల్ కుర్రాడు..
అమ్మాయిల హృదయాల్లో
భలే భలే అనిపించే మగాడు...
అందరికి అతనో నేచురల్ స్టార్...
ఆ కథానాయకుడే నాని.

ఎంతో కొంత తిరిగివ్వాలి..

ప్రస్తుతం తెలుగు పరిశ్రమలో నాని జెట్‌స్పీడుతో దూసుకుపోతున్నారు. ఆయన పేరే విజయమంత్రంగా మారింది. బాక్సాఫీస్ వసూళ్లకు నాని సినిమాలు చిరునామాగా మారాయి. ఇటీవలే విడుదలైన 'ఎమ్‌సీఏ' సినిమాతో ఎనిమిదో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు నాని. నటుడిగానే కాకుండా 'అ!' సినిమాతో నిర్మాతగా తన ప్రతిభను చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సందర్భంగా వ్యక్తిగత జీవితం, కుటుంబ విశేషాలు, సినిమాల ముచ్చట్లను 'జిందగీ'తో పంచుకున్నారు. ఆ సంగతులివి...

2017 సంవత్సరానికి ఘనమైన విజయంతో వీడ్కోలు పలుకడం ఎలాంటి అనుభూతినిస్తున్నది?

గత ఏడాది నేను నటించిన నేను లోకల్, నిన్నుకోరి ఎంసీఏ చిత్రాలు బ్లాస్‌బస్టర్స్‌గా నిలువడం ఆనందంగా వుంది. 'ఎంసీఏ' విజయాన్ని ముందుగానే ఊహించాం. కమర్షియల్‌గా సక్సెస్‌పై పూర్తి నమ్మకంతో ఉన్నాం. అయితే సాధారణ ప్రేక్షకుల మాదిరిగా విమర్శకుల్ని మెప్పించలేకపోవచ్చని భావించాం. తొలుత క్రిటిక్స్ దగ్గరి నుంచి డివైడ్ టాక్ వచ్చింది. అది విని కొంత నిరుత్సాహ పడ్డాం. కానీ రెండు రోజుల తర్వాత పరిస్థితులన్నీ మారిపోయాయి. మేం ఊహించినట్లుగానే భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం, నా కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రంగా నిలువడం గొప్ప అనుభూతినిస్తున్నది.



'ఎంసీఏ' చిత్రానికి తొలుత డివైడ్ టాక్ రావడంతో నిరుత్సాహ పడ్డారా?

మొదట్లో కొంచెం బాధగా అనిపించింది. అయితే సినిమాలోని భావోద్వేగాలతో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అయ్యారు. కథలో ఉన్న సున్నితమైన అంశాల్ని ఇష్టపడ్డారు. తొలుత ఎవరైతే సినిమా బాగాలేదన్నారో తర్వాత వారే పాజిటివ్‌గా మాట్లాడడం సంతోషంగా అనిపించింది. మీడియాలో కూడా మంచి చిత్రమంటూ ఆ తర్వాత ఆర్టికల్స్ రావడం ఆనందంగా అనిపించింది. విమర్శకుల ప్రశంసించడంతో పాటు ప్రేక్షకులు నీరాజనం పట్టారు.

మధ్యతరగతితో మీకున్న అనుబంధం ఎలాంటిది?

నా జీవితమంతా మధ్యతరగతిలోనే గడిచింది. ఇప్పుడు కూడా నేను మిడిల్‌క్లాస్ అబ్బాయినే. మిడిల్‌క్లాస్ అనేది నా దృష్టిలో ఫైనాన్షియల్ స్టేటస్ కాదు. ఆలోచన విధానం మాత్రమే. పెద్ద ఇళ్లు, కారు అన్నీ కొనగలిగినా మన మైండ్‌సెట్ మాత్రం మారదు. ఖరీదైన ప్లేట్ కొనే స్థిరత్వం వచ్చినా మనం తినే భోజనం మాత్రం మారదు. మనస్తత్వాలు, ఆలోచనతీరులో జీవితాంతం మార్పురాదు. మా అమ్మ కేంద్ర ప్రభుత్వ సంస్థకు సంబంధించిన ఆరోగ్య పథకంలో ఫార్మసిస్ట్‌గా పనిచేస్తుంది. ఇప్పటికీ ఆఫీస్‌కు ఆర్టీసీ బస్సులోనే వెళుతుంది. ఇంటి ముందు కార్లు డ్రైవర్‌లు సిద్ధంగా ఉంటారు. ప్రతిరోజు కారులోనే ఆఫీస్‌కు వెళుతుందని అనుకుంటాను. కానీ తను మాత్రం బస్సులోనే వెళుతుంది. అదేంటని అడిగితే తనకు అలా వెళ్లడమే ఇష్టమని చెబుతుంది. ఎన్నిసార్లు చెప్పినా వినదు. ఆఫీస్‌లో వయోవృద్ధులకు మందులు ఇస్తూ సాయంత్రం వరకు వారితో కబుర్లు చెబుతూ సంతోషంగా ఉంటుంది. నాని సినిమా చూశామని బాగుందని వారు చెప్పిన మాటలు వింటూ గర్వంగా ఇంటికి తిరిగి వస్తుంది.

మీ అమ్మగారు ఎప్పడైన మిమ్మల్ని ఏదైనా అడిగినా సందర్భాలు ఉన్నాయా?

ఈ రోజు నేనున్న స్థితికి అమ్మ ఏదడిగినా తీసుకువచ్చే శక్తి నాకు ఉంది. 'నాకు ఏది వద్దు. ఇంతకుముందు ఎలా ఉన్నానో ఇప్పుడు కూడా అలాగే ఉంటాను' అని సమాధానం చెబుతుంది. తనను పదవీ విరమణ చేయమని చాలా సార్లు అడిగాను. కానీ ఒప్పుకోలేదు.

వరుసగా ఎనిమిది సక్సెస్‌లను అందుకున్నారు. ఈ విజయాలు మీలో ఏమైనా మార్పులు తీసుకొచ్చాయా?

సక్సెస్‌లను తలకెక్కించుకోకపోవడం గొప్పతనంగా భావించడం లేదు. ఆ సెటప్ నాకు తెలియదు. నన్ను నమ్మి థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల్ని పూర్తిగా సంతృప్తిపరచడానికే తపిస్తాను. జయాపజయాలకు అతీతంగా సాధారణ జీవితం గడపటానికే ప్రయత్నిస్తాను. తొలుత మా కుటుంబసభ్యులకైనా నేను నచ్చుతానా? లేదా? అనే సంశయం ఉండేది. సినిమాల ద్వారా కోట్లాది మంది తెలుగు వారి అభిమానాన్ని సొంతం చేసుకుంటానని ఊహించలేదు. నన్ను ఉన్నతస్థాయిలో నిలబెట్టింది సినిమానే. నేను ఊహించలేనివన్నీ ఇచ్చింది. అలాంటి ఇండస్ట్రీకి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలనే నిర్మాతగా మారాను. భవిష్యత్తులో ఏ పని చేసినా, ఎంత సంపాదించినా చిత్రపరిశ్రమతో పాటు నాపై ఆదరాభిమానాలు చూపించిన ప్రేక్షకులకు ఏదో ఒక మంచి చేయడానికే తపిస్తాను.

'దిల్' రాజు బ్యానర్‌లో రెండు వరుస విజయాల్ని సొంతం చేసుకోవడం ఎలా అనిపిస్తున్నది?

'దిల్' రాజుగారి సంస్థలో ఎప్పుడో సినిమా చేయాల్సింది. 'ఓ మై ఫ్రెండ్' సినిమాలో ఓ క్యారెక్టర్ చేయమని అడిగారు. ఆ పాత్ర అంతగా నచ్చకపోవడంతో 'నేను చేయలేను సార్' అని దిల్ రాజుగారికి చెప్పాను. ఆ తర్వాత రాజు గారు నా దగ్గరికి చాలా కథల్ని పంపించారు. ఏదీ కార్యరూపం దాల్చలేదు. ఆ టైంలో 'ఏంటి సార్ మనిద్దరికి కాంబినేషన్ కుదరడం లేదు' అనుకున్నాం. అలాంటిది ఈ ఏడాది రెండు బ్లాక్ బస్టర్స్ సాధించడం చాలా ఆనందంగా ఉంది.

దేవుడిని నమ్ముతారా?

దేవుడిని నమ్ముతాను. ప్రతి రోజు దండం పెట్టుకున్నతర్వాతే ఇంటి నుంచి బయటకు వస్తాను. అలాగని దేవుడని ఎలాంటి కోరికలు కోరను. నేను అడగ్గానే ఇవ్వడు. ఆడగలేదని ఇవ్వకుండా ఉండదు. మనకిచ్చిన ప్రతిదానికి దేవుడికి కృతజ్ఞతలు చెబుతుంటాను.

ఎలాంటి నేపథ్యం లేకుండా సినిమాల్లో అడుగుపెట్టడం మీకు ఎంతవరకు ఉపయోగపడింది?

సినీ నేపథ్యముంటే సినిమాల్లో అడుగుపెట్టడం సులభమవుతుంది. అదే మనకు సంబంధించిన వారు ఎవరూ ఇక్కడ లేకపోతే కెరీర్ ప్రారంభించడానికి అష్ట కష్టాలు పడాల్సి వస్తుంది. అవన్నీ ప్రేక్షకులు మనల్ని ఇష్టపడడం, నమ్మడం మొదలుపెట్టేంతవరకే. ఎవరి అండా లేకపోయినా ప్రతిభతోనే చిత్రపరిశ్రమలో నిలదొక్కుకున్నామని ప్రేక్షకులు అర్థం చేసుకున్న తర్వాత తొలినాళ్లలో పడిన కష్టాలు మరుగునపడిపోతాయి. అంతా పాజిటివ్‌గా మారుతుంది. వారసత్వం లేకపోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. వారసత్వం వల్లనో, ఇతరుల ద్వారా ఏర్పడిన అంచనాలు కారణంగానో ప్రేక్షకులు తనను ఫలానా పాత్రలో చూడాలనుకుంటున్నారనే లేనిపోని ఊహలను మనసులో పెట్టుకొని సినిమాలు చేయాల్సిన అవసరం ఉండదు. మరొకరి కోసం ఇష్టం లేకపోయినా మారిపోయి సినిమాలు చేయాల్సిన పని లేదు. మన ఆలోచనల్ని, కథల్ని ఎంపికచేసుకునే తీరు ప్రేక్షకులకు నచ్చిందనే ధైర్యం ఎంతో బలాన్నిస్తుంది. ఇకముందు కూడా ఇలాగే ఉండొచ్చన్న భరోసా ఉంటుంది. వారసత్వం ఉన్న వాళ్లకు ఆ ప్రయోజనాలు ఉండవు.

సమాజంతో పాటు మీ చుట్టుపక్కల జరిగే విషయాల్ని గురించి తెలుసుకుంటుంటారా?

సామాజిక మాధ్యమాల వల్ల మన చుట్టుపక్కల ఏం జరుగుతుందో క్షణాల్లో తెలిసిపోతుంది. దినపత్రికలు, న్యూస్‌చానల్స్ చూడకపోయినా ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల ద్వారా ప్రతి విషయం పట్ల అందరిలో అవగాహన కలుగుతున్నది. సోషల్ అవేర్‌నెస్ పరంగా నేను సోషల్‌మీడియానే అనుసరిస్తుంటాను.. సామాజిక బాధ్యతగా భావించి నేను తలపెడుతున్న పనులు చాలా ఉన్నాయి. వాటి గురించి చెప్పడం నాకు నచ్చదు. మంచి పనులు చేస్తున్నప్పుడు చాలామంది ఫొటోలు దిగుతూ అనవసరపు ఆర్భాటాలు చేస్తుంటారు. అలాంటి ప్రచారాలకు నేను దూరంగా ఉంటాను.

మీరు నిర్మిస్తున్న 'అ!' టీజర్ ప్రేక్షకులముందుకొచ్చింది. దానికి ఎలాంటి స్పందన లభిస్తున్నది?

ఈ ఏడాది శుభారంభాన్నిచ్చింది. 'అ!' టీజర్ సృజనాత్మకత మేళవించి ఉందని అందరూ ప్రశంసిస్తున్నారు. గడిచిన పక్షం రోజులు నా జీవితంలో మ్యాజికల్ మూవ్‌మెంట్స్‌గా అనిపిస్తున్నాయి. ఈ మధురక్షణాల్ని ఎప్పుడూ హృదయంలో పదిలపరుచుకుంటాను.

హీరోగా కాకుండా కొడుకుగా, భర్తగా, తండ్రిగా నాని ఎలా ఉంటాడు?

సాధ్యమైనంతవరకు ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉంటాను. నా పక్కన ఎవరైనా ఇతరుల గురించి నెగెటీవ్‌గా మాట్లాడుతుంటే వారికి దూరంగా వెళ్లిపోతాను. అలాంటి ఆలోచనల్ని నా దగ్గరకు రానివ్వను. మనసు బాగాలేదనిపిస్తే ఇంటికి వెళ్లిపోతాను. మా ఇంటిలో సంతోషం, ఆత్మస్థైర్యంతో కూడిన పాజిటివ్ వాతావరణం కనిపిస్తుంది. అలాగే సినిమా కూడా నాలో బోలెడంత పాజిటివ్ ఎనర్జీని నింపింది. షూటింగ్, ప్రచార కార్యక్రమాలు, నిర్మాణపనులు.. ఇలా ఉదయం నుంచి రాత్రి వరకు సినిమాలతో బిజీగా ఉంటాను. ఈ పనులతో టైమ్ దొరుకదు. ఎప్పుడైనా ఖాళీ దొరికితే మా అబ్బాయి అర్జున్‌తో ఆడుకుంటాను. లేదంటే నచ్చిన సినిమాలు చూస్తూ, సంగీతాన్ని వింటూ కాలక్షేపం చేస్తాను.



సినిమాలు కాకుండా ఎక్కువ ఆనందాన్నిచ్చే విషయమేది?

తండ్రిననే భావన నాకు ఎక్కువ సంతృప్తినిచ్చింది.

సహజనటుడు, నేచురల్‌స్టార్ అనే బిరుదులతో మిమ్మల్ని పిలువడం ఎలా అనిపిస్తుంది?

తొలినాళ్లలో సహజ నటుడు అనే పేరు విన్నప్పుడు కొంత ఇబ్బందిగా ఫీలయ్యేవాడిని. ఇప్పుడు బలవంతంగా పెట్టిన పేరులా కాకుండా అందులో ప్రేమ కనిపిస్తున్నది. నా నటన నచ్చి నిజాయితీగా, ఇష్టంతో అభిమానులు ప్రేమపూర్వకంగా ఇచ్చిన బిరుదుగా భావిస్తున్నాను. ఆ పేరు వల్ల ప్రస్తుతం నాకు ప్లస్సయ్యేది లేదు. మైనస్సయ్యేదీ లేదు.

సినిమాల ఎంపికలో ఇంట్లో వాళ్ల సలహాలు ఏమైనా?

నా సినిమాల ఎంపికలో కుటుంబసభ్యులు కలుగజేసుకోరు. వారి ప్రమేయం ఏమీ ఉండదు. మా అమ్మ నా ప్రతి సినిమాను రెండు, మూడు సార్లయినా చూస్తుంటుంది. తొలిసారి సినిమా చూస్తున్నప్పుడు తెరపై నన్నే గమనిస్తుంటుంది. కథ గురించి పట్టించుకోదు. ఆ తర్వాత మళ్లీ సినిమా చూసి కథ బాగుందని చెబుతుంది. సినిమాల్లో చనిపోయే పాత్రలు చేయవద్దని అమ్మ చెబుతుంటుంది. ఈగ, జెండాపై కపిరాజు, జెంటిల్‌మేన్ సినిమాల్లో నా పాత్ర చనిపోతుంది. నవతరం నటుల్లో సినిమాల్లో చాలాసార్లు చనిపోయిన నటుడిని నేనే కావచ్చు. (నవ్వుతూ)

కొడుకు పుట్టిన తర్వాత మీ జీవితంలో వచ్చిన మార్పులేమిటి?

గతంలో షూటింగ్‌లకు ప్యాకప్ చెప్పిన తర్వాతే ఇళ్లు గుర్తొచ్చేది. కథా చర్చలు, షూటింగ్ గ్యాప్ వల్ల గంట ఖాళీ దొరికితే హాయిగా నిద్రపోయేవాడిని. ఇప్పుడు పది నిమిషాలు విరామం దొరికినా ఇంటికి వెళ్తున్నాను. ఆ కొద్ది క్షణాలైన అర్జున్‌తో ఉంటే చాలు అనిపిస్తుంటుంది.



ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు. జిమ్, యోగా చేస్తుంటారా?

ఎవరైనా వచ్చి కొంచెం లావైపోతున్నావని చెబితే ఓ పదిరోజులు జిమ్‌కు వెళతాను. ఆ తర్వాత మళ్లీ ఆరు నెలలు జిమ్ వైపు చూడను. డైట్ పరంగా ఎలాంటి పరిమితులు విధించుకోను. నాకు నచ్చిన ఆహారపదార్థాలన్నీ లాగించేస్తాను.

\- సినిమా డెస్క్

సిరిముగ్గు






జానకి నర్వా
భవానీ నగర్,
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్

మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10, హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news,
indagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
సింగిడి
[హైదరాబాద్]
ఆదివారం 7 జనవరి 2018
Dwaraka



సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయాల్లోకి రావడం ఖాయమైపోయింది. ఇప్పుడు ఆయన గెలుస్తారా? లేదా? అనే విషయంలో చర్చమొదలైంది. అయితే ఆయన కింగ్ కాదు, కింగ్ మేకర్ మాత్రమే అవుతాడట. దానికి కారణాలేంటో తెలుసా?

కింగ్ కాదు, కింగ్‌మేకరే!

కర్నాటకకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు ప్రకాశ్ అమ్మునయ్.. రజనీకాంత్ జాతకచక్రాన్ని పరిశీలించాడట. సింహ లగ్నం, మకరరాశిలో జన్మించిన రజనీని ప్రత్యర్థులు పూర్తిగా ఓడించనూ లేరు, గెలువనూ లేరని చెబుతున్నాడాయన. ఆయన సీఎం అయ్యే అవకాశమే లేదంటున్నాడు. రజనీకాంత్‌కు ఉన్న సర్పదోషమే కారణమట. తనను తాను సీఎం అభ్యర్థిగా ప్రకటించుకొనే కంటే నాయకుడిగా పార్టీని నడిపిస్తూ ఎన్నికల్లో తలపడితే వచ్చే కింగ్‌మేకర్ అయ్యే చాన్స్ ఉందంటున్నాడు ప్రకాశ్. మరి ఈ జ్యోతిషం ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.

మీకు నచ్చిన పాటలు కూడా పంపొచ్చు. ప్రచురిస్తాం.

ఈమెయిల్ :
zindagi.nt@gmail.com
మా అడ్రస్ : నమస్తే తెలంగాణ ప్రధాన కార్యాలయం,
8-2-603/1/7,8,9 కృష్ణాపురం, రోడ్‌నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్ - 500034

నాకిష్టమైన పాటలు..

అపురూపమైనదమ్మ ఆడజన్మ	– పవిత్రబంధం
ఇదేలే తరతరాల చరితం	– పెద్దరికం
మా పెరటి జాంచెట్టు పళ్లన్నీ..	– పెళ్లిసందడి
ఆకాశాన సూర్యుడుండడు..	– సుందరకాండ
ప్రేమించే ప్రేమవా	– నువ్వు నేను ప్రేమ
ఏదో ఒక రాగం ..	– రాజా
వసంతంలా వచ్చిపోవాలిలా	– ముద్దుల ప్రియుడు
కనిపెంచినా మా అమ్మకే	– మనం
విధాత తలపున	– సిరివెన్నెల
ఆలయాన హారతిలో..	– సుస్వాగతం

ఎస్. నాగరాణి, సంగారెడ్డి



అప్పట్లో సినిమా విడుదలైతేనే దాని ముచ్చట్లు ప్రేక్షకులకు తెలిసేవి. కానీ ఇప్పుడు సోషల్ మీడియా పుణ్యమా అని, షూటింగ్ మొదలైప్పటి నుంచి రిలీజ్ అయ్యేవరకు ప్రతీ అంశం ప్రేక్షకులకు అప్‌డేట్ అవుతూనే ఉంది. అందుకే సినిమాలపై విడుదలకు ముందే విపరీతమైన క్రేజ్ పెరిగిపోతున్నది. క్రేజీ కాంబినేషన్స్ సంగతి చెప్పక్కర్లేదు. అలాంటి సినిమాలెన్నో 2018లో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. అలాంటి ఎగ్జైటింగ్ అప్‌కమింగ్ మూవీస్‌కు సంబంధించిన ముచ్చట్లే ఈ వారం సింగిడి స్పెషల్.

అలరించే 2018

సైరా చిరంజీవి



ఖైదీ నెంబర్ 150గా ఇండస్ట్రీలోకి రీ ఎంట్రీ ఇచ్చిన మెగాస్టార్ చిరంజీవి తదుపరి సినిమా భారీ అంచనాలతో నిర్మితమవుతున్నది. ఈ సినిమాను కూడా కొణిదెల ప్రొడక్షన్స్‌లో ఆయన తనయుడు రామ్‌చరణే నిర్మిస్తుండడం విశేషం. నయనతార హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ దిగ్గజం అమితాబ్‌బచ్చన్, జగపతిబాబు సహా పలువురు అగ్రతారలు నటిస్తున్నారు. 150 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

సాహో:

బాహుబలి సినిమాతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్. తదుపరి మూవీ సాహోపై భారీ క్రేజ్ ఏర్పడింది. రన్ రాజా రన్ వంటి సక్సెస్‌ఫుల్ మూవీ తీసిన దర్శకుడు సుజిత్ రెడ్డి.. సాహోను తీర్చిదిద్దుతున్నాడు. మేకింగ్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీస్తున్నాడు. బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీని యూవీ క్రియేషన్స్ 150 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్నది.



సాహోను ప్రభాస్ 19వ చిత్రంగా ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయబోతున్నారు. ఆ సమయం కోసం ప్రభాస్ అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.


బాలయ్య జై సింహా

మరోసారి బాలయ్య సంక్రాంతి బరిలో నిలువబోతున్నాడు. ఆయన నటించిన జై సింహా సినిమా ఈ సంక్రాంతికి రిలీజ్ కాబోతున్నది. కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలకృష్ణ సరసన నయనతార. నటాషా దోషి నటిస్తున్నారు. సీకే ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మించిన ఈ సినిమాకు చిరంతన్ భట్ మ్యూజిక్ అందించాడు. పొంగల్ స్పెషల్‌గా సంక్రాంతికి జై సింహా రిలీజ్ కాబోతున్నది.

పవన్ అజ్ఞాతవాసి

అజ్ఞాత వాసిగా పేక్షకుల ముందుకు వస్తున్నాడు పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్. త్రివిక్రమ్ శ్రీనివాస్ లాంటి మాటల మాంత్రికుడికి పవన్ పర్ఫార్మెన్స్ తోడైతే.. ఇంకేముంటుంది. అందుకే అజ్ఞాతవాసికి విపరీతమైన హైప్ వచ్చేసింది. ఆడియో సూపర్‌హిట్ కాగా, పవన్ పాడిన కొడకా కోటేశ్వర్‌రావు పాట దుమ్మురేపుతున్నది. సంక్రాంతి స్పెషల్‌గా విడుదల కాబోతున్న ఈ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ నిర్మించగా, అనిరుధ్ సంగీతాన్ని అందించాడు. ఈ కొత్త ఏడాదిలో వస్తున్న మోస్ట్ ఎగ్జయింట్ మూవీస్‌లో అజ్ఞాతవాసిదే అగ్రస్థానమని చెప్పొచ్చు. ఈ సినిమాలో పవన్‌తో కీర్తి సురేష్, అను ఇమాన్యుమేల్ జోడికట్టారు. ఇప్పటికే ఈ సినిమా అమెరికాలో 209 ప్రాంతాల్లో విడుదలవబోతున్నది. ఇప్పటి వరకూ ఏ ఇండియన్ సినిమా కూడా ఇలాంటి ఘనత సాధించలేదు. ఇదో ఆల్‌టైమ్ రికార్డు.

భరత్ అను నేను



శ్రీమంతుడు కాంబినేషన్ మళ్లీ రిపీటవుతున్నది. మరోసారి కొరటాల శివ దర్శకత్వంలో భరత్ అనే నేను సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు ప్రిన్స్ మహేష్. రాజకీయ నేపథ్యంతో వస్తున్న ఈ మూవీపై భారీ అంచనాలే ఉన్నాయి. డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవీ శ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీలో మహేశ్ సరసన కైరా అద్వానీ నటిస్తున్నది. ఇందులో మహేశ్ ముఖ్యమంత్రిగా కనిపిస్తాడనే ప్రచారం జరుగుతుండడంతో సినిమాకు బాగా హైప్ వచ్చేసింది. క్రేజీ ప్రాజెక్టుగా మారింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూవీని రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు.

రజనీ 2.0



శంకర్ దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న 2.0 మూవీ ఈ ఏడాదే విడుదల కాబోతున్నది. గతంలో వీళ్లిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రోబో సూపర్‌హిట్ కావడంతో... దానికి సీక్వెల్ మాదిరిగా వస్తున్న 2.0 సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ స్టార్ అక్షయర్‌కుమార్ విలన్‌గా నటిస్తున్నాడు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో నిర్మితమవుతున్న ఈ సినిమాకు విపరీతమైన క్రేజ్ వచ్చేసింది. ఈ మూవీలో రజనీకి జోడిగా అమీ జాక్సన్ నటించింది. ఏఏ ఫిల్మ్, గ్లోబల్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం..ఏప్రిల్‌లో థియేటర్లలోకి రాబోతున్నది.

రంగస్థలం



సుకుమార్ డైరెక్షన్‌లో రామ్‌చరణ్ నటిస్తున్న రంగస్థలం మూవీ 2018లోనే థియేటర్లను పలుకరించబోతున్నది. ఈ మూవీలో సమంత హీరోయిన్‌గా నటించింది. మైత్రీమూవీ మేకర్స్ రూపొందిస్తున్న రంగస్థలం సినిమాకు దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే సినిమాకు సంబంధించిన ప్రతి అంశం ప్రేక్షకుల్లో ఆసక్తిని పుట్టిస్తున్నది. వందకోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా.. మరో మూడు నెలల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.

నా పేరు సూర్య



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ 'నాపేరు సూర్య– ఇల్లు భారతదేశం' అంటూ 2018లో బాక్సాఫీస్‌ను ఢీకొట్టబోతున్నాడు. వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా భారీ అంచనాలే ఉన్నాయి. రామలక్ష్మి క్రియేషన్స్ బ్యానర్‌పై నాగేంద్రబాబు, శ్రీధర్ లగడపాటి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. విశాల్ శేఖర్ సంగీతం అందిస్తున్నాడు. అల్లు అర్జున్‌కు జోడీగా అనుఇమాన్యుయేల్ నటిస్తున్నది. ఇప్పటికే అటు ఇండస్ట్రీలో, ఇటు అభిమానుల్లో మంచి హైప్ సంపాదించిన ఈ మూవీని ఈ ఏడాది సమ్మర్‌లో విడుదలయ్యే అవకాశం ఉంది.

భాగమతి అనుష్క

దేవసేన అనుష్క.. ఈయేడు అభిమానులను భాగమతిగా అలరించబోతున్నది. ప్రారంభం నుంచి ఈ సినిమాపై భారీ అంచనాలే ఉన్నాయి. అసలైన థ్రిల్లర్‌జానర్ ఎలా ఉంటుందో ఇప్పటికే రుచి చూపించింది భాగమతి టీజర్. జి. అశోక్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు తమన్ మ్యూజిక్ అందించాడు. యూవీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన సంయుక్తంగా తెలుగు, తమిళ, మళయాళ భాషల్లో నిర్మిస్తున్న ఈ సినిమాను జనవరి 26న సినిమాను విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



మహానటి



అలనాటి అందాల తార సావిత్రి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న మహానటి సినిమా ఈ ఏడాది విడుదల కాబోతున్నది. ఈ సినిమాలో.. కీర్తిసురేశ్, సమంత తదితరులు నటిస్తున్నారు. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తుండగా మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నాడు. వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న ఈ మూవీ.. మార్చ్ 29న విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

కేవలం ఈ సినిమాలే కాదు.. నాగచైతన్య నటిస్తున్న సవ్యసాచి, త్రివిక్రమ్, ఎన్టీఆర్ కాంబినేషన్ రూపొందుతున్న సినిమాలు కూడా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. వీటికితోడు వరుణ్‌తేజ్ నటిస్తున్న తొలిప్రేమ, హీరో నాని నిర్మిస్తున్న అ!, రాజ్‌తరుణ్ హీరోగా తెరకెక్కిన రంగులరాట్నం సినిమాలు కూడా ఎగ్జైటింగ్ అప్‌కమింగ్ మూవీస్ 2018 లిస్టులో ఉన్నాయి. ఇదే లిస్టులో రామ్‌గోపాల్ వర్మ తీస్తున్న లక్ష్మీస్ ఎన్టీఆర్ కూడా ఉన్నది. ఎన్టీఆర్ జీవితకథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. సినిమాలన్నీ విడుదలకు ముందు సృష్టించిన క్రేజీ ఎగ్జైట్‌మెంట్‌ను, ఆ తర్వాత కూడా చూపుతాయా లేదా అనేది చూడాలి మరి.

సిసింద్రీతో సినిమా ఉంటుందా?

ఎస్ఎస్ రాజమౌళి అంటే డైరెక్టర్ మాత్రమే కాదు. ఆ పేరొక బ్రాండ్. ఇప్పటి వరకూ ఒక్క ఫ్లాప్‌నూ చూడని దర్శకుడాయన. అలాంటి జక్కన్న ఇంకా బాహుబలి హిట్‌నే ఎంజాయ్ చేస్తున్నాడు. తర్వాతి సినిమా ఏంటనే దానిపై రకరకాల పుకార్లు షికార్లు చేస్తున్నాయి.



రాజమౌళి డైరెక్షన్‌లో పనిచేసేందుకు పెద్ద హీరోల నుంచి చిన్న హీరోల వరకు ఆసక్తి చూపిస్తుంటారు. అందుకే బాహుబలి తర్వాత ఆయన ఎవరితో సినిమా చేస్తాడా? అని సినీవర్గాలతో పాటు, ప్రేక్షకులూ ఎదురుచూస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్, రాంచరణ్‌లతో కలిసి ఆయన ఒక మల్టీ స్టారర్ తీస్తున్నారనే వార్తలు ఆ మధ్య వినిపించాయి. కానీ, ఎవరికీ తెలియని విషయమేమిటంటే.. అఖిల్ మూడో చిత్రాన్ని డైరెక్ట్ చేయాలని నాగార్జున ఇంతకుముందే రాజమౌళి దగ్గర మాట తీసుకున్నాడట. ఎట్లాగో మల్టీస్టారర్‌ను 2018 ఎండింగ్‌లో ప్రారంభించాలనుకొంటున్నాడు జక్కన్న. ఈ పది నెలల కాలంలో అఖిల్ సినిమా పూర్తి చేయాలనుకున్నాడట. ఒక మంచి లవ్‌స్టోరీని కమర్షియల్ హంగులతో తీర్చిదిద్ది హిట్ కొట్టడానికి ఈ మాత్రం సమయం సరిపోతుందన్నది రాజమౌళి ఆలోచన. మరో నాలుగైదు రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వెలువడాల్సింది. కానీ ఆ టైమ్ సరిపోదనీ, ఒక సంవత్సరకాలం అఖిల్ సినిమాకే కేటాయించాలని రాజమౌళిని అడిగాడట నాగార్జున. దానికి రాజమౌళి అంగీకరించలేదని తెలుస్తున్నది. అందుకే అఖిల్ మూడో సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్‌లో శిక్షణ పొందిన ఒక యంగ్ డైరెక్టర్‌కే అప్పగించాలని నాగార్జున నిర్ణయించాడట. చూడాలి మరి ఏం జరుగుతుందో!




మార్ఫింగా? నిజమైనవా?

జీరో సైజ్ అనగానే టక్కున గుర్తొచ్చే పేరు బాలీవుడ్ భామ కరీనాకపూర్. అలాంటి కరీనాకపూర్ ఖాన్ ఫిజిక్‌పై డొట్ల బాంబులు పేల్చారట నెటిజన్లు. అసలేం జరిగిందంటే..

జీరో సైజ్ అందాల్ని ప్రేక్షకులకు పరిచయం చేసిన ఘనత కరీనాకపూర్‌కే దక్కుతుంది. సైఫ్ అలీఖాన్‌ను పెళ్లి చేసుకొని ఒక బిడ్డకు తల్లయిన ఆమె.. ఆ మధ్య కాస్త బొద్దుగా తయారైంది. బ్యూటీ ఈజ్ బ్యాక్ అన్నట్టుగా మళ్లీ కొన్ని నెలల్లోనే తన ఫిజిక్‌ను పూర్వంలా తీర్చిదిద్దుకొని అందరికీ షాకిచ్చింది ఈ సుందరి. అయితే ఇటీవల ఆమె పాపులర్ మ్యాగజైన్ వోగ్ కోసం బికినీ షూట్ చేసిందట. ఆ ఫొటో స్నాప్స్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసుకొని కరీనాకు నెటిజన్ల నుంచి చేదు అనుభవం ఎదురైంది. అసలు ఆ ఫోటోలు నిజమైనవి కావని కొందరు, ఫొటోషాప్‌లో మార్ఫింగ్ చేసినవని ఇంకొందరు కామెంట్ చేశారట. అయితే ఈ కామెంట్లకు కరీనా ఎలా స్పందిస్తుందో చూడాలి మరి.

'వెన్ వి లీవ్' ఒక స్త్రీ కథ

క్లాసిక్ మూవీ



మనిషి ఒక వింతజీవి. తనకంటూ తానే నిర్మించుకొన్న మెంటల్ కండిషన్లలోనూ, తాను ఊహించుకొంటున్న తన పరువు, మర్యాదల్లోనూ బతుకుతుంటాడు. ఏదైనా పరిస్థితులు ఈ పరువు మర్యాదలని తగ్గిస్తాయని భావిస్తే తననితాను బలిచేసుకుంటూ, తనవాళ్లనీ బలిచేస్తూ ఉంటాడు.

ఏ పరిస్థితినైనా ముందు మనం అంగీకరిస్తే.. ప్రపంచం అంగీకరిస్తుంది. మనని మనం అంగీకరించకుండా సమాజం దృష్టితో ఆలోచిస్తే చివరికి బాధే మిగులుతుంది.

ఓ స్త్రీ కోరుకునేదేమిటి? చివరికి ఆ స్త్రీకి దొరికిందేమిటి? ఇది ఓ స్త్రీ వ్యథ.

తన పిల్లవాడికి ఆమె ఓ కథ చెబుతున్నది. పిల్లాడు కొన్ని ప్రశ్నలు సంధించాడు. అమ్మా మనం తాతయ్య వాళ్లని ఎందుకు వదిలి వెళ్లాలి?

'' కొన్నిసార్లు వదిలి దూరంగా వెళ్లిపోతే మళ్లీ వాళ్లని కనుగొంటాం. వాళ్ల ప్రేమని కనుగొంటాం'' అన్నదామె. 'కానీ మనం వెళ్లిపోయేటప్పుడు ఏదో ఒకటి వదిలి వెళ్లాలి కదా' ఎప్పుడో తల్లి చెప్పిన మాటే తిరిగి చెప్పాడు పిల్లాడు.

అవును అన్నది తల్లి.

బొమ్మ గీస్తావా?

లేదు.

ఆడుకుంటావా?

లేదు.

ఆకలేస్తున్నదా?

లేదు. నాకు అమ్మమ్మని చూడాలని ఉందన్నాడు.

కానీ అమ్మమ్మ, తాతలను ఎలా చూపించగలదామె? వాళ్లని వదిలి వచ్చేశాక.

స్త్రీ కోరుకునేదేమిటి??

కొంచెం ప్రేమ. తనపట్ల, తన ఇష్టాల పట్ల, ఆలోచనలు, అభిరుచులు, ఆనందాల పట్ల కొంచెం బాధ్యత.

అది దొరుకని చోట స్త్రీ ఉంటుందా?? ఉండలేదు కదా. అందుకే అలాంటి కుటుంబాన్నీ వదిలొచ్చేసిందామె.

స్త్రీ కోరుకొనేదేమిటి??

అర్థం చేసుకొనే తల్లిదండ్రులు.. కుటుంబం. కానీ తనదీ అనుకున్న కుటుంబం తనది కాదని తెలిసింది. తన తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లి.. తమ స్వార్థమే చూసుకొన్నారు. కుటుంబ మర్యాదే ముఖ్యమనుకొన్నారు. తప్పు తననీ తన పరిస్థితినీ అర్థం చేసుకోలేదు. దాంతో ఒంటరైంది. ఆమె ఒక్కతే అయితే ఎలాగైనా సర్దుకోవచ్చేమో! కానీ ఆమెకో పిల్లాడున్నాడు. వాడి పరిస్థితేమిటి?? నిలువ నీడలేని తమ పెద్దకూతురిని అర్థం చేసుకోలేక పోయారు ఆ తల్లి దండ్రులు. ఆమె కొడుక్కి, తాతా, మామా, అమ్మమ్మా, పిన్నీ అనే కుటుంబాన్ని ఇవ్వలేక పోయారు.

స్త్రీ కోరుకొనేదేమిటి??

ఒకింత స్వేచ్ఛ, ఒకింత స్నేహం, ఒకింత ప్రేమ.. ఒకింత గౌరవం.. ఒకింత ఆలంబన.. వెరసి ఒకింత సంతోషం.. ఒకింత తృప్తి, ఒకింత జీవితం.

అవన్నీ ఆమెకు తన రెండు కుటుంబాలూ ఇవ్వలేకపోయాయి. కానీ తను వాటికోసం స్వతంత్రంగా పోరాడింది స్నేహితురాలి సాయంతో.

తనకంటూ ఒక ఉద్యోగం. ఒక చిన్న ఇల్లు, ఒక ప్రేమించే హృదయం సంపాదించుకున్నది. కానీ తన కొడుకుకి ఒక కుటుంబం లేదనే బాధ.. ఉండాలనే తపన. ఆ ఆరాటంలో ఎన్ని అవమానాలనో, ఎన్ని తిరస్కారాలనో ఎదుర్కొని ''నీవు నా తమ్ముడివి, నీవు నా అమ్మవి, నీవు నా నాన్నవి, నీవునా చెల్లివి.. మీరంతా నాకుటుంబ'' అని వాళ్లకి చెప్పడానికి ప్రయత్నించింది. కానీ కనపడని సమాజం ఇచ్చే పరువు మర్యాదల్లో ప్రేమని మరుగున పడేసిన వాళ్లకి అది అర్థమవుతుందా??

ఎన్నో సంఘటనలు జరిగిన మీదట ఆమె తండ్రీ ఆలోచనలో పడ్డాడు. తన తండ్రిని కలిశాడు. కొడుకులతోనూ చర్చించాడు. ఏదో నిర్ణయానికి వచ్చాడు. కానీ ఆమె తమ్ముళ్ల నిర్ణయం వేరుగా ఉంది. అది సినిమా చూస్తేనే తెలుస్తుంది.

'' కానీ వెళ్లిపోయేటప్పుడు ఏదోటి వదిలి వెళ్లాలి కదా!'' అవును ఓ గొప్ప భావోద్వేగం. రెండు కన్నీటి చుక్కలను వదిలి వెళ్తుందీ సినిమా!!

కథ, కథనం, నటీనటుల ఎంపిక, వాళ్ల నటన.. ఒప్పుకోదగ్గవి. ప్రధాన పాత్రలో 'సీబల్' ఆమె కొడుకుగా చిన్నారి నిజాం శెల్లర్ బాగా నటించారు. దర్శకత్వం, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సంగీతం.. అసాధారణ స్థాయిని చేరుకున్నాయి. ఈ విభాగాలను నిర్వహించింది స్త్రీలే కావడం ఇక్కడ ఆసక్తికరమైన విషయం.

చక్రధర్‌రావు బైరంపల్లి,
9848519435

సుడోకు

డైలీ సుడోకు 92 సమాధానం

9	7	8	6	2	3	5	4	1
5	3	1	9	4	7	6	2	8
4	2	6	5	8	1	9	7	3
3	8	9	4	7	5	2	1	6
1	6	5	3	9	2	4	8	7
7	4	2	8	1	6	3	5	9
8	1	3	2	5	9	7	6	4
2	9	4	7	6	8	1	3	5
6	5	7	1	3	4	8	9	2

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -93

	7							
9				4	8			3
5	4		9		1	8	6	
7		9					4	
			2		5			
	5					1		8
	8	5	6		7		3	1
3			1	8				4
							8	

వాట్సప్!



అద్దాలు ధరిస్తే కూడా అందంగా కనిపిస్తాం. అలాంటి సందేహం వచ్చినప్పుడు ఈ చిత్రాన్ని చూసుకుంటా.

అజయ్ దేవగన్
@ajaydevgn



అజయ్ దేవగన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
8,450,198

కామన్‌మ్యాన్ వాయిస్

మొగుడు నచ్చకపోతే వదిలేయండమ్మా. చంపేయడాలెందుకు? విడాకుల ఆప్షన్ ఉందిగా! మా మగ జాతి ఎలాగూ మూర్ఖులమే. మీరు కూడా ఇట్టా తయారైతే ఎట్టా?

– బహుదూరపు బాటసారి

ఈ సృష్టిలో చివరి వరకు తోడుండే బంధం కేవలం భార్యాభర్తల బంధమే. ఎవరికోసమో మీ తోడును దూరం చేసుకోకండి. పెరిగేకొద్దీ పిల్లలు దూరమవుతారు. డబ్బు లేదంటే బంధువులు కూడా మన నుంచి పారిపోతారు. ఏది ఏమైనా చివరి వరకు ప్రాణం పోయే వరకు తోడు నీడగా నిలిచేది ఆలుమగల బంధం మాత్రమే.

–Swetha Gupta

వైరల్ వీడియో



ఇంటర్‌క్యాస్ట్ మ్యారేజ్ మీద చాయ్ బిస్కెట్ వాళ్లు చేసిన వీడియో ఇంట్రెస్టింగ్‌గా ఉన్నది. వీలైతే ఓ లుక్కేయండి.

Inter Caste Marriage | If Subjects were People | Chai Bisket

Total views : 108,079+
Published on Jan 5, 2018



కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ రవీందర్

పంజాగుట్ట ఠాణా దేశానికే ఆదర్శం

అన్ని రాష్ట్రాలకు తెలంగాణ పోలీస్ స్ఫూర్తి ● డీజీపీల సదస్సులో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
దేశంలో టాప్ 2లో నిలిచిన పంజాగుట్ట స్టేషన్ ● రాజ్‌నాథ్‌సింగ్ నుంచి అవార్డు అందుకున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఫ్రెండ్లీ పోలీసింగ్, టెక్నాలజీతో నాణ్యమైన సేవలు అందిస్తూ పోలీస్‌స్టేషన్‌ను ఓ కార్పొరేట్ సంస్థలా నిర్వహిస్తున్న హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఠాణాను ఆదర్శంగా తీసుకొని దేశవ్యాప్తంగా స్టేషన్లను అలాగే తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగిస్తూ సిటిజన్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ దేశంలోనే రెండో స్థానంలో నిలిచి అవార్డును సొంతం చేసుకున్నది. మధ్యప్రదేశ్‌లోని టెక్నపూర్‌లో డీజీపీల సదస్సు శనివారం ప్రారంభమయింది. ఈ సదస్సులో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా డీజీపీ మహేందర్‌రెడ్డి సారథ్యంలో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎస్ రవీందర్ అవార్డును అందుకున్నారు. దేశంలో ప్రజలకు పోలీస్ సేవలు అందుతున్న తీరు, ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై కేంద్ర ప్రభుత్వం సర్వే చేసింది. ఈ సర్వేలో దేశవ్యాప్తంగా సేవలు అందిస్తున్న బెస్ట్ 10 పోలీస్‌స్టేషన్లను ఎంపిక చేశారు. అందులో పంజాగుట్ట ఠాణా రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ పోలీస్‌శాఖను బలోపేతం చేసేందుకు టెక్నాలజీ పరమైన సంస్కరణలు తీసుకొచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని, ఇందులో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఆశయంతో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు రాష్ట్ర పోలీసులకు దేశవ్యాప్తంగా గుర్తింపు, గౌరవాన్ని తెస్తున్నాయి. హైదరాబాద్‌లోని ఠాణాల రూపు రేఖలు మార్చేసి కార్పొరేట్ కార్యాలయాల మాదిరిగా తీర్చిదిద్దారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే వారిని ఆప్యాయంగా పలకరిస్తూ బాధితుల్లో మనో ధైర్యాన్ని నింపుతున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును రిసెప్షన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో రికార్డులోకి ఎక్కిస్తున్నారు. పోలీసుల సేవల్లో పూర్తి పారదర్శకత ఉండేలా అన్ని విభాగాల్లో టెక్నాలజీని వినియోగం చేస్తూ నేరాలను నివారించడం, కేసుల దర్యాప్తులో వేగం పెంచి హైదరాబాద్ పోలీసులు సాంకేతికతకు పెద్దపీట వేశారు. హైదరాబాద్ పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకొని దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. పంజాగుట్ట ఠాణాను పలు రాష్ట్రాల పోలీస్ అధికారులు పరిశీలించారు. బీహార్ డిప్యూటీ సీఎంతో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు పరిశీలించి ఆయా రాష్ట్రాల్లో ఇలాంటి పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని పోలీస్‌స్టేషన్లలో కార్పొరేట్ కార్యాలయాల మాదిరి తోపాటు పోలీసుల ప్రవర్తనలో పూర్తి మార్పు వచ్చి, ఠాణాలకు వచ్చేవారితో మాట్లాడుతున్న పద్ధతి చాలాబాగుందని పలువురు ప్రశంసించారు. ఈ నేపథ్యంలో దేశంలోనే రెండో స్థానంలో నిలిచిన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్, హైదరాబాద్ పోలీసింగ్‌పై ఈ సదస్సులో కేంద్ర హోంమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. తెలంగాణ పోలీసులు ఉపయోగిస్తున్న టెక్నాలజీ, ఠాణాల్లోని సౌకర్యాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని, ఆయా రాష్ట్రాలు పంజాగుట్ట ఠాణాను స్ఫూర్తిగా తీసుకోవాలని అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. దేశానికి మోడల్ పోలీస్‌స్టేషన్‌గా నిలుస్తుందని హోంమంత్రి అన్నారు. బెస్ట్ 10 పోలీస్‌స్టేషన్లలో తమిళనాడుకు చెందిన కోయంబత్తూరు ఠాణా మొదటి స్థానంలో నిలిచింది.

350 గ్రాముల బంగారం స్వాధీనం

సాక్సుల్లో పెట్టుకొని వచ్చిన విమాన ప్రయాణికుడు



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో శనివారం రాత్రి కస్టమ్స్ అధికారులు ఓ ప్రయాణికుడి నుంచి 349.500 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ నుంచి హైదరాబాద్‌కు ఒమన్ ఎయిర్‌లైన్స్ విమానంలో వచ్చాడు. అనుమానించిన కస్టమ్స్ అధికారులు అతనిని తనిఖీ చేయగా, అరికాలు కింద రూ.10,64,227 విలువైన 349.500 గ్రాముల మూడు బంగారం బిస్కెట్లను పెట్టి నల్లని టేపుతో చుట్టాడు. పైనుంచి సాక్స్ వేసుకొని వచ్చాడు. ఇది గుర్తించిన అధికారులు బంగారాన్ని స్వాధీనం చేసుకొని, స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్ గండిపేట మండలం నెక్నాంపూర్ పంచాయతీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్‌లో శనివారం టౌన్‌షిప్ సంక్షేమ సంఘం, చెరువుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే టీ ప్రకాశ్‌గౌడ్ హాజరయ్యారు. నెక్నాంపూర్ పరిధిలోని ఇబ్రహీం చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ, ఎమ్మెల్యే చెప్పారు. చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే రూ.21 కోట్లు విడుదల చేసిందన్నారు.
- మణికొండ, నమస్తే తెలంగాణ





ఎక్కడైనా సమాధానమిస్తాం

సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే ఉచిత విద్యుత్ ● అభివృద్ధిని ఓర్వలేకనే ఆరోపణలు
ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు ● విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణమండపంలో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు. చిత్రంలో టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఎన్‌సీడీసీపీఎల్ సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు, ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: దేశంలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు స్పష్టంచేశారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో ప్రణాళికలు రూపొందించడంతోనే నిరంతర విద్యుత్ సరఫరా సాధ్యమయిందన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు. విద్యుత్ సంస్థలో అక్రమాలు, అవినీతి జరుగుతుందని తీవ్రమైన వ్యాఖ్యలు చేస్తున్న వారికి ఎప్పుడైనా, ఎక్కడైనా సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కల్యాణ మండపంలో విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలండర్‌ను సీఎండీ ప్రభాకర్‌రావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సంస్థ సృష్టిస్తున్న నూతన ఒరవడిని తట్టుకోలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని విద్యుత్ సంస్థ అగ్రభాగాన నిలబెట్టిందన్నారు. గతంలో ప్రధాన పట్టణాల్లోనే రోజుకు 4 గంటలు కరెంట్ కోతలుండేవని, ఇప్పుడు పట్టణాలకే కాకుండా గ్రామాల్లో సైతం నిరంతరాయంగా సరఫరా చేస్తున్నామన్నారు. సంస్థలోని ప్రతి అధికారి విద్యుత్ సరఫరా వ్యవస్థపై సమాధానం చెప్పేందుకు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ పద్ధతి పటిష్టంలో దేశంలోనే ముందంజలో ఉన్నామన్నారు. ట్రాన్స్‌మిషన్ పద్ధతి 99.98శాతం ఉన్నదన్నారు. డిస్ట్రిబ్యూషన్ లాస్ కూడా 15శాతం మాత్రమే ఉన్నదన్నారు. రూ.12,700 కోట్లతో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థను పటిష్టం చేశామని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటును, నిరంతర విద్యుత్ సరఫరా వంటి అంశాలను అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నేత సీఎం కేసీఆర్ అని కొనియాడారు. అకౌంట్స్ ఆఫీసర్లు రెవెన్యూ పెంపునకు కృషి చేయాలని సూచించారు. ప్రణాళికా బద్ధంగా బిల్లులు వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీర్స్, అకౌంటెంట్స్ సమన్వయంతో పనిచేస్తే సంస్థ మెరుగు పడుతుందన్నారు. టీఎస్ఎస్‌పీడీసీఎల్, ఎన్‌సీడీసీపీఎల్ సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు మాట్లాడుతూ సంస్థ ఉద్యోగులు, కార్మికుల సహకారంతోనే 24 గంటల విద్యుత్ సరఫరా సాధ్యమయిందన్నారు. ప్రభుత్వం మన సమస్యలను పరిష్కరిస్తున్నప్పుడు, మన విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సీఎం కేసీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి, సీఎండీ ప్రభాకర్‌రావు కృషితోనే సంస్థ అభివృద్ధి బాటలో పయనిస్తున్నదన్నారు. నిబద్ధతతో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్న సీఎండీ ప్రభాకర్‌రావుకు పద్మశ్రీ అవార్డుతో గౌరవించాలని విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ పీ అంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ, నాయకులు అశోక్, శంకర్, నాసర్ షరీఫ్, శ్యామల్‌రావు, డీ వీరస్వామి, వీ పరమేశ, అనురాధ, చంద్రశేఖర్‌రెడ్డి, అనిల్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆటోమెటిక్ స్టార్టర్లను ఎమ్మెల్యేకు అప్పగిస్తున్న గిర్మాపూర్ రైతులు

ఆటోమెటిక్ స్టార్టర్లు ఎమ్మెల్యేకు అప్పగింత

● మేడ్చల్ జిల్లా గిర్మాపూర్ రైతుల మూకుమ్మడి నిర్ణయం

మేడ్చల్ రూరల్: సీఎం కే చంద్రశేఖర్‌రావు పిలుపు మేరకు రైతులు ఆటోమెటిక్ స్టార్టర్లను తొలిగించి, 24 గంటల విద్యుత్‌ను వినియోగించుకోవడానికి సిద్ధమవుతున్నారు. మేడ్చల్ మండలం గిర్మాపూర్ రైతులు శనివారం గ్రామ రైతు సమన్వయ సమితి కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆటోమెటిక్ స్టార్టర్లను తొలిగించాలని మూకుమ్మడిగా నిర్ణయం తీసుకున్నారు. తొలిగించిన స్టార్టర్లను ఘట్‌కేసర్ మండలం ప్రతాపసింగారంలోని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఇంటికి వెళ్లి అప్పగించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇంతకుముందు తమ కష్టాన్ని ఏ ప్రభుత్వం, ఏ సీఎం గుర్తించలేదన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి కరెంట్ లేక ఎండిపోయి, రాత్రిపూట పొలాల వద్ద పడిగాపులు పడి ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. అన్నదాత కష్టాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ రైతు బాంధవుడని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, టీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రైతులు చీళ్ల సత్యనారాయణ, చంద్రయ్య, నర్సింహారెడ్డి, బలవంత్‌రెడ్డి, భిక్షపతి, బీరప్ప, శరీఫ్, మార్క శేఖర్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు

● 300 స్టాల్స్.. ఆరు రాష్ట్రాల ప్రతినిధుల రాక
● రేపటి నుంచి నగరంలోని సెయింట్ ప్యాట్రిక్ స్కూల్‌లో ఎగ్జిబిషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో సోమవారం నుంచి సౌత్ ఇండియా సైన్స్ ఎగ్జిబిషన్ జరగనున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచేరి రాష్ట్రాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొననున్నారు. 350 మంది విద్యార్థులు 300 స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రదర్శనలకు సంబంధించిన వివరాలు సందర్శకులకు వివరిస్తారు. ప్రతి పదర్శనకు ఒక్కో ఉపాధ్యాయురాలు చొప్పున 300 మంది పరిశీలకులుగా ఉండనున్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఆరు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థుల, ఉపాధ్యాయుల వివరాలను నమోదు చేసుకుంటారు. సోమవారం ఉదయం 11 గంటలకు సెయింట్ ప్యాట్రిక్ స్కూల్‌లో ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌ను డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రారంభించనున్నారు. చివరి రోజు గవర్నర్ నరసింహన్ ముగ్గింపు కార్యక్రమంలో పాల్గొంటారని జిల్లా అధికారులు తెలిపారు.

విపత్తు నిర్వహణపై సింగరేణి రెస్క్యూటీం శిక్షణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విపత్తు నిర్వహణపై విద్యార్థులకు సింగరేణి రెస్క్యూ టీం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నది. జనవరి 3 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణలో భాగంగా శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో అవగాహన కల్పించింది. శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి సంస్థ రామగుండంలోని మైన్స్ రెస్క్యూ సర్వీసెస్ (ఎంఆర్ఎస్) ఆఫీసు నుంచి ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటుచేసింది. కార్యక్రమంలో సింగరేణి పీఆర్వో మహేశ్ విద్యార్థులకు క్రమశిక్షణపై అవగాహన కల్పించారు. శిక్షణా ద్వారా మంచి నడవడికను అలవర్చుకొని ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ కమిషనర్లు జీ పరమేశ్వర్, జాన్ శామ్యూల్, ఎస్ రాజేంద్రం, అనంతలక్ష్మి, సింగరేణి జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ కేవీ రమణ పాల్గొన్నారు.

పట్నంలోనే డిగ్రీ పట్టా!

● భాగ్యనగరానికి విద్యార్థుల వలస
● హైదరాబాద్ పరిసర డిగ్రీ కాలేజీలు కళకళ
● ప్రవేశాలు లేక గ్రామీణ కాలేజీలు వెలవెల
● బాలికలకు అనుకూలంగా లేని పలు ప్రైవేటు కాలేజీలు

రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో డిగ్రీ కాలేజీలు:	1,144
అందుబాటులో ఉన్న మొత్తం సీట్లు:	4,21,947
దోస్త్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులు:	2,00,799
వివిధరకాల డిగ్రీ కాలేజీల్లో మిగిలిన సీట్లు:	2,21,148

నిండిన 50 శాతం సీట్లు.. పట్నం పరిసర ప్రాంతాలవే..

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రాజధాని పరిసర ప్రాంతాల్లో గ్రాడ్యుయేషన్ విద్యను పూర్తిచేసేందుకు విద్యార్థులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఉద్యోగం, ఉపాధిలో త్వరగా స్థిరపడాలన్న ఆకాంక్షతో తమ మండలానికి దగ్గర్లో ఉన్న కాలేజీలను కాదని, విద్యార్థులు ప్రైవేటు హాస్టళ్లలో ఉంటూ హైదరాబాద్ సమీప కళాశాలల్లో ప్రవేశాలు పొందుతున్నారు. డిగ్రీలో నాణ్యమైన విద్యావిధానం కేవలం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఉన్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలకే పరిమితమైందన్న భావనలో వారు ఉన్నట్టు తెలుస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో టెన్త్, ఇంటర్ చదివినప్పటికీ డిగ్రీ విద్యను మాత్రం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేయాలనుకోవడంపై ఆసక్తి కలుగుతున్నది.

నాణ్యతను కోరుతున్న గ్రామీణ విద్యార్థులు

రాష్ట్రంలో నాణ్యమైన విద్య కోసం విద్యార్థులు ఎంత దూరమైనా వెళ్తున్నారు. దీనికి దోస్త్ ప్రవేశాలు నిదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 60 శాతానికి పైగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు నాసిరకంగా కొనసాగుతున్నాయని, మూడేండ్లలో వాటి ఫలితాలు కూడా అంతంతమాత్రంగానే ఉన్నాయని విద్యార్థులు గమనించారు. ప్రవేశం పొందడానికి ముందు ప్రైవేటు కాలేజీల స్థితిగతుల గురించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలుసుకుంటున్నారు. అక్కడ టీచింగ్ ఫ్యాకల్టీ ఎలా ఉన్నది? నాణ్యమైన బోధన అందుతున్నదా? అయా కాలేజీల్లో చదివిన పూర్వవిద్యార్థులు జీవితంలో ఏ విధంగా స్థిరపడ్డారు? వంటి సమగ్ర వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా బాలికలకు అనుకూలంగా ప్రైవేటు డిగ్రీ కాలేజీలు ఉన్నాయా? లేదా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు పొందుతున్నారని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీల్లో నూటికి 90 శాతానికి పైగా సీట్లు నిండాయని దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు.

నాణ్యమైన కాలేజీలకే మనుగడ: రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసి, నాసిరకంగా కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీలను విద్యార్థులు ఆదరించడం లేదన్న విషయం దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియ ద్వారా స్పష్టమైందని, ఇక భవిష్యత్తులో అలాంటి కాలేజీలు మనుగడ కొనసాగించలేవని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి పేర్కొన్నారు. గతంలో మాదిరిగా విద్యార్థులు అన్ని కాలేజీలను ఒకేవిధంగా చూడటం లేదని, మంచి కాలేజీ ఏదో, నాసిరకం కాలేజీ ఏదో తెలుసుకున్న తర్వాతే ప్రవేశాలు పొందడానికి ముందుకొస్తున్నారని చెప్పారు. నాణ్యమైన కాలేజీలకే భవిష్యత్తు ఉంటుందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా రాజీ పడే ప్రసక్తే కనిపించడం లేదని పాపిరెడ్డి స్పష్టంచేశారు.

జిల్లాల్లో పోలీస్ సంస్కరణలు

● సిబ్బంది పనితీరుపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న ఫీడ్‌బ్యాక్ సెంటర్
● రోజూ 300 మంది ఫిర్యాదుదారులకు ఫోన్లు
● అలసత్వం వహించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పోలీస్ వ్యవస్థలో సంస్కరణలు మొదలయ్యాయి. హైదరాబాద్ తరహాలో జిల్లాల్లో కూడా పోలీస్ వ్యవస్థ లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వెస్ట్‌జోన్ పరిధిలోని అన్నిజిల్లాలకు కలిపి కామారెడ్డి ఎస్పీ కార్యాలయంలో సిటిజన్ ఫీడ్‌బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. వెస్ట్‌జోన్‌లోని నిజామాబాద్, కామారెడ్డి, సిద్దిపేట, మెద క్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, వనపర్తి, వికారాబాద్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో నమోదైన కేసులకు సంబంధించిన ఫిర్యాదుదారుల నుంచి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ఈ ప్రక్రియ ను వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర పర్యవేక్షిస్తున్నా రు. కాల్‌సెంటర్‌కు కామారెడ్డి ఎస్పీ ఎన్ శ్వేత నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. నిత్యం 300 మంది ఫిర్యాదుదారులకు ఫోన్లుచేసి వారి స్పందన తెలుసుకుంటున్నారు. కాల్‌సెంటర్‌ను ప్రారంభించిన తొలి నెలలో పాస్‌పోర్టు వెరిఫికేషన్‌కు వచ్చే పోలీసు అధికారులు లంచాలు తీసుకుంటున్నట్టు ఎక్కువగా ఫీడ్‌బ్యాక్ వచ్చేదని, ఇటీవల కొంత తగ్గిందని సిబ్బంది చెప్పారు. తాము ఫోన్లు చేసి లంచాలు ఇవ్వొద్దని, ఏవైనా ఫిర్యాదులుంటే చెప్పాలని కోరుతుండటంతో ప్రజల్లో అవగాహన పెరిగిందని కాల్‌సెంటర్ సిబ్బంది తెలిపారు. ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్ నమోదు విషయాల్లో పరిస్థితి కొంత ఇబ్బందికరంగానే ఉన్నట్టు చెప్పారు. నెలవారీ నివేదికల ఆధారంగా పనితీరు సరిగాలేని అధికారులను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించడం, తర్వాత మెమో ఇవ్వడం.. అయినా మారకపోతే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఐజీ తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ స్థావరంపై పోలీసుల దాడి

● నగదు, ల్యాప్‌టాప్‌లు, ఇన్నోవా స్వాధీనం
● ఏపీకు చెందిన నలుగురి అరెస్ట్, పరారీలో మరో నిందితుడు

దుండిగల్, నమస్తే తెలంగాణ: క్రికెట్ బెట్టింగ్ దందా నిర్వహిస్తున్న స్థావరంపై శుక్రవారం రాత్రి మాదాపూర్, శంషాబాద్‌లకు చెందిన ఎస్ఓటీ పోలీసులు దాడులు జరిపారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన వెంకీ అనే బుకీ పరారీలో ఉన్నాడు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఏపీలేని గుంటూరు జిల్లా రెంటచింతలకు చెందిన గొంతు రవికిరణ్‌రెడ్డి బాచుపల్లి, గుంటూరులలో గత రెండేండ్లుగా కోటిరెడ్డి, అప్పన్న, అజయ్‌రెడ్డి అనే వ్యక్తుల సహకారంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వెంకీబాబు అనే బుకీతో కలిసి బెట్టింగులు నిర్వహిస్తున్నట్టు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్, శంషాబాద్‌లకు చెందిన ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి స్థానిక పోలీసుల సహాయంతో ప్రగతినగర్‌లోని బెట్టింగ్ స్థావరంపై దాడులు నిర్వహించారు. గొంతు రవికిరణ్‌రెడ్డి(33), కాసాని కోటిరెడ్డి(30)లతో పాటు ఆపరేటర్లుగా పనిచేస్తున్న గున్ను అప్పన్న(42), ఎం అజయ్‌రెడ్డి(23)లను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి రూ.15 లక్షల 28 వేల 460 రూపాయల నగదు, 26 నోకియా ఫోన్లు, 3 ల్యాప్‌టాప్‌లు, 17 సెల్‌ఫోన్లు, ఒక సామ్‌సంగ్ ఎల్ఈడీ టీవీ, ఒక ఇన్నోవా (ఏపీ07డీఏ 7777) కారు స్వాధీనం చేసుకున్నారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ, కూకట్‌పల్లి ఏసీపీ



పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న సీఎండీ ప్రభాకర్‌రావు

పవర్ ఇంజినీర్స్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమిష్టి కృషితోనే సెంట్రల్ బోర్డు ఇంటిగ్రేటెడ్ పవర్ (సీబీఐపీ) అవార్డు దక్కిందని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీని శనివారం ఎర్రమంజిల్‌లోని గెస్ట్‌హౌస్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శనంతోనే 24 గంటల విద్యుత్ సాధ్యమయిందన్నారు. కార్యక్రమంలో సీఎండీలు రఘుమారెడ్డి, గోపాల్‌రావు, సుధాకర్‌రావు, పవర్ ఇంజినీర్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీ సదానందం, కిరణ్‌కుమార్, జనప్రియ, వెంకటేశ్, సురేశ్ శ్రీనివాస్, సౌమ్యనాయక్, నారాయణ పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న సీఎండీలు ప్రభాకర్‌రావు, రఘుమారెడ్డి, శ్రీనివాసరావు

విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ డైరీ..

ఖైరతాబాద్: విద్యుత్ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీని ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, టీఎస్‌ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు శనివారం ఖైరతాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శ్యామమనోహర్, సెక్రటరీ జనరల్ రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడు జితేందర్, మామిడి గోపాల్, కే రవీందర్, బాబు, వీరేశం, మాణిక్యం పాల్గొన్నారు.



హైదరాబాద్ నుంచి కర్బలాకు బయలుదేరిన షియా భక్త బృందం

కర్బలాకు కాలినడకన

● ఆరు వేల కిలోమీటర్లు.. ఏడు నెలలపాటు ప్రయాణం

చార్మినార్: హైదరాబాద్ నుంచి సుమారు ఆరు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇరాక్‌లోని కర్బలాకు తమ దైవ దర్శనానికి కాలినడకన బయలుదేరివెళ్లారు. పాతనగరంలోని దారుల్‌షిఫా మైదానం నుంచి శనివారం ఉదయం ఏడుగురు ఓ బృందంగా ఇరాక్‌కు బయలుదేరారు. షియా వర్గీయులు అత్యంత పవిత్రంగా భావించే కర్బలాను సందర్శించడానికి ఇక్కడి నుంచి పాదయాత్రన బయలుదేరారు. ఈ సందర్భంగా బృంద నాయకుడు అలీ అస్గర్ మాట్లాడుతూ సుమారు ఆరు వేల కిలోమీటర్లు పాదయాత్రగా బయలుదేరుతున్నామన్నారు. రోజుకు 35 నుంచి 40 కిలోమీటర్ల నడుస్తూ ఏడు నుంచి ఎనిమిది నెలల్లో కర్బలాకు చేరుకుంటామని తెలిపారు.


శ్రియ

మధ్యతరగతి మనోహరి

డా||మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. మంచు విష్ణు, శ్రియ జంటగా నటిస్తున్నారు. మదన్ రామిగాని దర్శకుడు. ఫిబ్రవరి 9న విడుదల చేయబోతున్నారు. ఈ సినిమాలో శ్రియ ఫస్ట్‌లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. చక్కటి చీరకట్టుతో మధ్యతరగతి గృహిణిగా శ్రియ ఆకట్టుకుంటున్నది. ఈ చిత్రంలో విష్ణు, శ్రియ ఆదర్శ దంపతులుగా కనిపిస్తారని, వారి పాత్రల చిత్రణ సరికొత్త పంథాలో వుంటుందని చిత్ర బృందం చెబుతున్నది. 'నేనేదనుకుంటే అది చెప్పడం నాకు అలవాటు. తర్వాత సంగతి తర్వాత' అంటూ శ్రియ పోస్టర్‌పై పేర్కొన్న క్యాప్షన్ ఆమె పాత్ర స్వభావాన్ని తెలియజేసేలా వుంది. వినూత్న కథ, కథనాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: డైమండ్ రత్నబాబు, కెమెరా: సర్వేష్ మురారి, ఆర్ట్: చిన్నా, సంగీతం: ఎస్.ఎస్.తమన్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: విజయ్‌కుమార్, నిర్మాత: మోహన్‌బాబు మంచు.


బి.ఏ.రాజు

జూన్‌లో బి.ఏ.రాజు కొత్త చిత్రం

తెలుగు సినీ వర్గాల్లో అందరికీ సుపరిచితుడు ప్రముఖ నిర్మాత బి.ఏ.రాజు. స్నేహశీలి, సహృదయుడిగా ఆయనకు మంచి పేరుంది. 'ప్రేమలో పావని కల్యాణ్' సినిమాతో నిర్మాతగా ప్రస్థానం ప్రారంభించిన ఆయన 'చంటిగాడు' 'ప్రేమికులు' 'గుండమ్మగారి మనవడు' 'లవ్‌లీ' 'వైశాఖం' చిత్రాలతో నిర్మాతగా తెలుగు పరిశ్రమలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. పై చిత్రాలన్నీ ఆయన సతీమణి బి.జయ దర్శకత్వంలో రూపొందించబడి ప్రేక్షకాభిమానం పొందాయి. గత ఏడాది విడుదలైన 'వైశాఖం' చిత్రం ఆహ్లాదభరిత ప్రేమకథా చిత్రంగా ప్రేక్షకుల మన్ననలు సొంతం చేసుకుంది. ఈ సినిమా విజయంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఉన్న బి.ఏ.రాజు తాజాగా మరో చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. స్వీయ నిర్మాణ సంస్థ ఆర్.జె. సినిమాస్ పతాకంపై బి.జయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. జూన్‌లో ప్రారంభంకానుంది. నేడు బి.ఏ.రాజు జన్మదినం. ఆయన మాట్లాడుతూ 'నిర్మాతగా పదిహేనేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నాను. జయ దర్శకత్వంలో మరో చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కించబోతున్నాం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కథా చర్చలు జరుగుతున్నాయి. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం. ఈ ఏడాది మా 'సూపర్‌హిట్' మ్యాగజైన్ 24వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం ఆనందంగా వుంది' అని అన్నారు.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	31.0	7.4
నిర్మల్	31.0	7.4
మంచిర్యాల	31.0	7.4
కుమ్రంభీం ఆసిఫాబాద్	31.0	7.4
జగిత్యాల	29.5	10.0
వికారాబాద్	29.5	10.4
పెద్దపల్లి	30.0	11.2
వరంగల్ రూరల్	30.0	11.0
కరీంనగర్	32.8	11.7
ఖమ్మం	29.0	12.0
వరంగల్ అర్బన్	29.5	12.0
జనగామ	30.0	13.0
సూర్యాపేట	28.0	14.0
రాజన్న సిరిసిల్ల	29.0	14.0
జయశంకర్ భూపాలపల్లి	29.0	14.0
మహబూబాబాద్	29.0	14.0
నాగర్‌కర్నూల్	29.0	14.0
భద్రాద్రి కొత్తగూడెం	30.0	14.0
మెదక్	30.2	14.4
సంగారెడ్డి	30.2	14.4
సిద్దిపేట	30.2	14.4
నిజామాబాద్	30.5	14.5
కామారెడ్డి	30.5	14.5
హైదరాబాద్	28.0	15.0
రంగారెడ్డి	28.0	15.0
మేడ్చల్	28.0	15.0
వనపర్తి	30.5	15.0
నల్లగొండ	29.2	15.4
యాదాద్రి భువనగిరి	28.0	16.0
మహబూబ్‌నగర్	31.0	16.1
జోగుళాంబ గద్వాల	31.0	17.0

ఆదిలాబాద్ @ 7 డిగ్రీలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: చలి వణికిస్తున్నది. ఉత్తర భారత దేశం నుంచి వీస్తున్న చలిగాలులతో రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కనిష్ట ఉష్ణోగ్రతల్లో 8 డిగ్రీల మేర తగ్గుదల నమోదైనట్టు వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు. రాత్రివేళల్లో చలిగాలుల తీవ్రత పెరుగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖమ్మంలో కనిష్ట ఉష్ణోగ్రత 12 డిగ్రీలుగా, భద్రాచలంలో 14 డిగ్రీలుగా రికార్డయింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యల్పంగా ఆదిలాబాద్‌లో 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. అదేవిధంగా రామగుండంలో 11 డిగ్రీలు, హన్మకొండలో 12 డిగ్రీలు, హైదరాబాద్, హకీంపేటలో 15 డిగ్రీలు, నిజామాబాద్‌లో 14 డిగ్రీలు, నల్లగొండలో 15 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ కేంద్రం వెల్లడించింది.

తల్లిదండ్రులను గెంటేసిన తనయుడు

ఇంటికి తాళం వేయడంతో అరుగుపైనే వృద్ధ దంపతులు

దమ్మపేట: నవమాసాలు మోసి కనీ పెంచిన తల్లిదండ్రులను బయటకు గెంటేసి ఇంటికి తా ళం వేశాడు ఓ ప్రబుద్ధుడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూ డెం జిల్లా దమ్మపేట మండ లం మల్కారంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అంకత నాగయ్య, గంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరి పెండ్లి చేశారు. పెద్ద కుమారుడు బ్రహ్మయ్య భార్య, పిల్లలతో కలిసి అదే గ్రామంలో వేరుగా ఉంటున్నాడు. చిన్న కుమారుడు వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తూ తన కుటుంబ సభ్యులతో తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. పదిరోజుల క్రితం పెద్ద కుమార్తె వద్దకు వెళ్లిన ఈ వృద్ధ దంపతులు శనివారం ఉదయం వచ్చి ఇంట్లోకి వెళ్తుండగా చిన్న కుమారుడు ఆస్తి విషయమై వారిని బయటకు గెంటేసి భార్యా పిల్లలతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయాడు. దీంతో వారు అరుగుపైనే పడి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. చివరకు వారు దమ్మపేట పోలీసు స్టేషన్‌కు చేరుకుని తమ కుమారుడి ఉదంతాన్ని వివరిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా అదే గ్రామంలో ఉండే పెద్ద కుమారుడు కూడా పట్టించుకోక పోవడంపై స్థానికులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



తాళం వేసిన ఇంటి ముందు వృద్ధ దంపతులు

ముస్లింలు రొయ్యలు తినొద్దంటూ ఫత్వా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముస్లింలు రొయ్యలు తినొద్దంటూ హైదరాబాద్‌కు చెందిన జామేనిజామియా ఇస్లామిక్ యూనివర్సిటీ ఫత్వా జారీ చేసింది. వర్సిటీకి చెందిన చీఫ్‌ముఫ్తీ మౌలానా అజీముద్దీన్ ఈ ఫత్వాను రెండురోజుల క్రితం విడుదలచేశారు. రొయ్యలను ముస్లింలు తినడాన్ని 'మక్రు' (ఇస్లాంలో తినకూడని ఆహారం)గా ఫత్వాలో పేర్కొన్నారు. ముస్లింల ఇండ్లల్లో జరిగే విందుల్లో రొయ్యలను వడ్డించడం ఇటీవలికాలంలో ఎక్కువైంది. దీనిపై కొందరు జామేనిజామియా ఇస్లామిక్ వర్సిటీ పెద్దలను ఆశ్రయించినట్టు సమాచారం.

న్యూడెమోక్రసీ దళ కమాండర్ రాంబాబు అరెస్టు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం) మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఏరియా దళ కమాండర్ సుర్ణపాక రాంబాబును పోలీసులు అరెస్టు చేశారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. బయ్యారం మండలం కోయగూడెంకు చెందిన సూర్ణపాక భద్రయ్య అలియాస్ రాంబాబు, అతని భార్య రాధ అప్పటి దళ కమాండర్ జగన్న దళంలో చేరారు. రెండేండ్ల తర్వాత రాధ జనజీవన స్రవంతిలో కలిసింది. రాంబాబు బయ్యారం ఏరియా కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. కాంట్రాక్టర్లు, వ్యాపారుల వద్ద నుంచి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నాడు. శుక్రవారం రాంబాబు నివాసంలో దళ నాయకులతో సమావేశమవుతున్నారన్న సమాచారంతో బయ్యారం పోలీసులు దాడిచేసి రాంబాబును పట్టుకోగా, మరో ఇద్దరు తప్పించుకున్నట్టు ఎస్పీ తెలిపారు. 5 ఎస్‌ఎల్‌ఆర్ బుల్లెట్లు, విప్లవ సాహిత్యం, డైరీని స్వాధీన పర్చుకున్నట్టు చెప్పారు.

అభ్యంతరాల పరిశీలన తర్వాతే భూసేకరణ

- మల్లన్నసాగర్ వ్యవహారంలో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్ గ్రామంలో చేపడుతున్న భూసేకరణలో రైతుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఉమ్మడి హైకోర్టు తెలిపింది. రైతులు లేదా ప్రభావిత కుటుంబాల అభ్యంతరాలపై విచారణ జరిపిన తర్వాతే పరిహారం చెల్లింపు కోసం విచారణను, తదుపరి భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. భూసేకరణ చట్టంలోని సెక్షన్ 19(1) కింద అధికారులు జారీచేసిన డిక్లరేషన్‌ను రద్దుచేసింది. కొత్త భూసేకరణ చట్టం ప్రకారం రైతుల అభ్యంతరాలను పరిశీలించాలనే నిబంధనను విస్మరించడాన్ని 23 మంది గ్రామస్థులు సవాల్‌చేస్తూ దాఖలుచేసిన పిటిషన్ విచారణ సందర్భంగా ఆదేశించింది.

రిజర్వాయర్ నిర్మాణంలో నిబంధనలు పాటించాలి

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిజామాబాద్ జిల్లాలో కొండం చెరువు, ముంచిప్ప చెరువును కలుపుతూ రిజర్వాయర్ నిర్మాణంలో నిబంధనలను ఉల్లంఘించవద్దని ఉమ్మడి హైకోర్టు పేర్కొంది. రిజర్వాయర్‌తో వల్ల పంటపొలాలు మునిగిపోతాయని ముగుపాల్ మండలం ముంచిప్పకు చెందిన 61 మంది హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సూచించింది.



శనివారం మహబూబ్ నగర్‌లో పాజిటివ్ హోమియోపతి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్‌లో పాజిటివ్ హోమియోపతి క్లినిక్ ప్రారంభం

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో పాజిటివ్ హోమియోపతి క్లినిక్‌ను స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ శనివారం ప్రారంభించారు. వైద్యరంగంలో ఎంతో విశిష్టత, అనుభవం కలిగిన హోమియోపతి కార్పొరేట్ వైద్యం మహబూబ్‌నగర్ ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షణీయమన్నారు. ఈ క్లినిక్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాజిటివ్ హోమియోపతి సీఎండీ డాక్టర్ ఎంఏ రెడ్డి, డాక్టర్ సృజన, స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ రాధ అమర్, సీనియర్ జర్నలిస్టు కే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈసీబీసీ నిబంధనలతో కొత్త కలెక్టరేట్లు

ఇంధన పొదుపు విధానంలో నిర్మాణం

- దేశంలో తొలిసారి రాష్ట్రంలో అమలు
- వ్యాపార సముదాయాలకు అనువు
- వెయ్యి చదరపు మీటర్లపైబడిన నిర్మాణాలకు ఈసీబీసీ రూల్స్ తప్పనిసరి
- ఈ తరహా కట్టడాలకు ప్రోత్సాహకాలు
- ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

భవనాల ఇంధన పొదుపు నియమాల (ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్-ఈసీబీసీ) విధానంలో రాష్ట్రంలో 21 కొత్త జిల్లాల కలెక్టరేట్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. ఈసీబీసీ నిబంధనలు పాటిస్తూ నిర్మించే కలెక్టరేట్లు రెనెవబుల్ అండ్ క్లీన్ ఎనర్జీ ప్రమోషన్‌కు ఉదాహరణగా, ప్రైవేటు, ఇతర రంగాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. ఈసీబీసీ నిబంధనలను, మార్గదర్శకాలను దేశంలో తొలిసారి తెలంగాణ పాటిస్తున్నదన్నారు. మరింత పటిష్ఠంగా అమలుచేసేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీ అసెసర్స్‌కు (టీపీఏ) లైసెన్స్ మంజూరుచేస్తున్నట్టు తెలిపారు. శనివారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో 38 థర్డ్ పార్టీ అసెసర్స్‌కు మంత్రి కేటీఆర్ లైసెన్సులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వెయ్యి చదరపు మీటర్ల పరిధి దాటిన నిర్మాణాలకు జనవరి ఒకటి నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ఈసీబీసీ రూల్స్ తప్పనిసరిగా అమలుచేస్తున్నదని గుర్తుచేశారు. నిబంధనల ప్రకారం నిర్మించిన కట్టడాలకు ప్రోత్సాహకాలు అందించే యోచన ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎనర్జీ ఎఫిషియెన్సీ ఎక్స్‌పర్ట్ టీపీఏలో ఉంటారని, నిర్మాణానికి ముందు, తర్వాత నిబంధనల అమలుపై సమీక్షిస్తారని తెలిపారు. ఈసీబీసీ విధానంలో నిర్మాణాలకు అంతర్జాతీయంగా ప్రామాణికత ఉంటుందని చెప్పారు. నిర్మాణశైలికి అనుగుణంగా సూర్యరశ్మి, కిటికీలు, ఉద్యానవనాలు, సమశీతోష్ణ పరిస్థితులన్నీ ఈ ప్రాజెక్టులో ఉంటాయన్నారు. ఇది కొత్తగా నిర్మించనున్న వాణిజ్య, వ్యాపార సముదాయాలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్తూ దీన్ని ప్రైవేటు సంస్థలు వినియోగించుకోవాలని సూచించారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఇది ఉత్తమ విధానమన్నారు. ఔత్సాహికులను ఇందులో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనల అమలుకు నిపుణులు, అర్బన్ డిజైనర్స్, అర్కిటెక్ట్స్ ప్రభుత్వంతో ఆలోచనలు పంచుకోవాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో దశలవారీగా నిబంధనలు అమలుచేస్తామని, మున్సిపల్ కార్పొరేషన్ల తర్వాత గ్రేడ్1, గ్రేడ్2 మున్సిపాలిటీల్లో నిర్మాణాలు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా నిర్మించేవాటికంటే ఉన్నవాటిని సవరించాల్సిన అవసరం ఉందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నిబంధనలు పాటించాలని, లేకుంటే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనుమతుల కోసం వ్యక్తులచుట్టూ తిరుగాల్సిన అవసరం లేకుండా, అవినీతికి అంతం పలికేలా డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టంద్వారా బిల్డింగ్ అనుమతులు వచ్చేలా చేశామని కేటీఆర్ చెప్పారు. ఆస్కీ, నేచురల్ రిసోర్సెస్ డిఫెన్స్ కౌన్సిల్ (ఎన్నార్డీసీ) ఐఐటీల సహకారంతో జీహెచ్‌ఎంసీ సొంతంగా ఈసీబీసీ నమూనాను తయారు చేసింది. ఈసీబీసీ విధానాలు అనుసరిస్తున్నారా లేదా అనేది థర్డ్ పార్టీ చూసుకుంటుంది. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, స్టేట్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఏ సుధాకర్‌రావు, సెంటర్ ఫర్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ ఎస్‌సీఐ డైరెక్టర్ వీ శ్రీనివాస్‌చారి, అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్ కిరణ్ వీ బిలోలికర్, అధికారులు పాల్గొన్నారు.



శనివారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో 38 థర్డ్ పార్టీ సంస్థలకు లైసెన్సులు అందిస్తున్న ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కే తారకరామారావు. చిత్రంలో జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్

ఇంట్రా విలేజ్ పనుల్లో ఎమ్మెల్యేల సహకారం

- మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి సూచన
- ఖమ్మం, వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో సుడిగాలి పర్యటన

హైదరాబాద్/కరీంనగర్ ప్రతినిధి/మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: మిషన్‌భగీరథ ఇంట్రా విలేజ్ పనుల్లో ఎమ్మెల్యేల సహకారం తీసుకోవాలని మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ వేల కోట్లు కేటాయించి, సకాలంలో పూర్తిచేసేందుకు నిరంతరం సమీక్షిస్తున్నారని, ఈ పథకాన్ని త్వరితగతిన పూర్తిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని చెప్పారు. ఆయన శనివారం ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఆయా జిల్లాల్లో క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూచనమేరకు శనివారం ఉదయం హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, సీఎం కార్యాలయ కార్యదర్శి స్మితాసబర్వాల్, ఈఎన్సీ బీ సురేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఓఎస్డీ సత్యపాల్‌రెడ్డితో కలిసి ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించారు. ముందుగా భద్రాద్రి- కొత్తగూడెం జిల్లా కుమ్మరిగూడెం వద్ద నిర్మిస్తున్న ఇన్‌టేక్‌వెల్ పనులను పరిశీలించారు. సివిల్ పనులు పూర్తిచేయని మెగాఏజెన్సీ ప్రతినిధులతోపాటు ఎలక్ట్రో మెకానికల్ పనులకు ఏర్పాట్లుచేసుకోని ఎన్‌సీసీ కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నెల 25లోగా దుమ్ముగూడెం ఇన్‌టేక్‌వెల్‌లో మోటర్లు, పంపులు బిగించే ప్రక్రియ పూర్తికావాలని ఆదేశించారు. అనంతరం అశ్వాపురం మండలం పాములపల్లి దగ్గర రథంగుట్టపై నిర్మిస్తున్న 40 ఎంఎల్డీ వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి పరిశీలించారు. అక్కడి నుంచి ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం మాదరిపురం దగ్గర నిర్మిస్తున్న 170 ఎంఎల్డీ ట్రీట్‌మెంట్ ప్లాంటు పనులను మంత్రి తుమ్మలతో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం ఎదెళ్లగుట్ట వద్ద ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుతున్న పనులను సమీక్షించారు. గూడురు జిల్లా బొద్దుగొండ వద్ద పనులు ఆలస్యంగా జరుగుతుండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్‌ఎండీ వద్ద నిర్మిస్తున్న రావాటర్ కనెక్షన్ వెల్‌ను మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్‌తో కలిసి పరిశీలించారు. అధికారులు ఇచ్చిన వివరాలపై సంతృప్తి వ్యక్తంచేసిన ప్రశాంత్‌రెడ్డి.. బల్క్‌వాటర్ సరఫరా ప్రారంభమైన తర్వాత యుద్ధప్రాతిపదికన ఇంట్రావిలేజ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పర్యటనలో ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, విద్యాసాగర్, పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డి, రెడ్యానాయక్, పాయం వెంకటేశ్వర్లు, జడ్పీ చైర్‌పర్సన్లు గడివల్లి కవిత, తుల ఉమతోపాటు ఆయా జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





కరీంనగర్ జిల్లా ఎల్ ఎండీ కాలనీలో మిషన్ భగీరథ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న మంత్రులు ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, కే విద్యాసాగర్‌రావు, దాసరి మనోహర్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు.. మణుగూరు రథంగుట్ట వద్ద మోటర్లను పరిశీలిస్తున్న దృశ్యం

మూడునెలల్లో 500 కోట్ల ఉపాధి పనులు

- రూర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్లలో సత్వరమే అమలు
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులతో సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 2017-18 ఆర్థిక సంవత్సరంలో మిగిలిన మూడునెలల్లో కనీసం రూ.500 కోట్ల విలువైన పనులను పూర్తిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో డీఆర్డీవోలతో మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ కింద చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉపాధిహామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీకి 100 రోజుల పనిదినాలు కల్పించే లక్ష్యంతో కార్యక్రమాలను రూపొందించుకోవాలని సూచించారు. రాబోయే మూడునెలల్లో కనీసం రూ.500 కోట్ల విలువైన వేతన పనులు చేయించాలని ఆదేశించారు. ఉపాధిహామీ కింద చేపట్టిన గ్రామపంచాయతీ భవనాలు, వైకుంఠధామాలు, పాఠశాలల మరుగుదొడ్లు, ఫార్మ్‌పాండ్స్ వంటి కార్యక్రమాలన్నింటినీ మార్చి 31 నాటికి పూర్తిచేయాలని తెలిపారు. ఈ ఏడాది చివరినాటికి ప్రతిఇంటికీ మరుగుదొడ్డి ఉండాలన్న లక్ష్యంతో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు సంబంధించి సస్పెండ్ అకౌంట్స్‌లో జమయిన డబ్బును బ్యాంకు లేదా పోస్ట్‌ఆఫీస్ ఖాతాలు తీయించి కూలీల ఖాతాల్లో జమచేయాలని మంత్రి జూపల్లి సూచించారు. ఉపాధిహామీ పథకం కింద పండ్లతోటల పెంపకం లక్ష్యం పూర్తిచేయాలని, ఆ దిశగా ప్రజల్లో చైతన్యం తేవాలని చెప్పారు. ఉపాధి పనుల గురించి ప్రతి గ్రామంలో మైక్‌సెట్ ద్వారా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించడంతోపాటు వచ్చే ఏడాదిలో మొక్కలు నాటడానికి కావలసిన నర్సరీలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలని మంత్రి జూపల్లి దిశానిర్దేశం చేశారు. రూర్బన్ పథకం కింద మంజూరైన అన్ని క్లస్టర్లలో పనులు ప్రారంభించి ... త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో వాటర్‌షెడ్ కార్యక్రమంలో చేపట్టిన పనులను పూర్తిచేసి భూగర్భ జలాలను పెంపొందించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్లు సైదులు, వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ ఇంజినీర్ల డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

బంగారు తెలంగాణ నిర్మాణంలో పంచాయతీరాజ్ ఇంజినీర్లది కీలకపాత్ర అని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ రూపొందించిన 2018 డైరీ, క్యాలెండర్‌ను శనివారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు చేపట్టిందన్నారు. భవిష్యత్‌లోనూ ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ మూడున్నరేండ్లలో పంచాయతీరాజ్ ఇంజినీర్లు రికార్డుస్థాయిలో పనులు చేపట్టారని, ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ నీతూ ప్రసాద్, ఈఎన్సీ ఎం సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ముజీబ్, చీఫ్ ఇంజినీర్లు కే తిరుపతి రెడ్డి, ఆర్ రవిప్రకాశ్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ ఏఏ సమీ, అసోసియేషన్ ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.



శనివారం హైదరాబాద్‌లోని గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ల అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు

రేషన్ బియ్యం రీసైక్లింగ్‌పై సీరియస్

విచారణలో వేగం పెంచిన పౌరసరఫరాల శాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసిన రేషన్ బియ్యం రీసైక్లింగ్ వ్యవహారాన్ని పౌరసరఫరాలశాఖ తీవ్రంగా పరిగణిస్తున్నది. పేదలకు అందాల్సిన బియ్యంతో అక్రమాలకు పాల్పడుతుండటాన్ని సీరియస్‌గా తీసుకున్నది. ఏ ఒక్కరు తప్పించుకోకుండా విచారణ వేగవంతం చేసింది. రేషన్ బియ్యాన్ని కొంతమంది మిల్లర్లు తిరిగి పౌరసరఫరాలశాఖకే విక్రయించిన ఉదంతం శుక్రవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. బియ్యం రీసైక్లింగ్ వ్యవహారంలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న కల్వకుర్తిలోని శ్రీ సద్గురు రాఘవేంద్ర రైస్‌మిల్ యజమాని రమేశ్‌బాబుపై కఠినచర్యలకు రంగం సిద్ధమవుతున్నది. పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు మూడునెలలుగా నిఘా బృందం రమేశ్ వ్యవహారంపై ఆరా తీసింది. చట్టంలోని లొసుగుల ఆధారంగా బినామీ పేర్లతో రేషన్ బియ్యం దందా నిర్వహిస్తున్నట్టు గుర్తించింది. దీనికి స్థానిక అధికారుల అండదండలు ఉనానయని నిఘాబృందం ధ్రువీకరించుకున్నది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్, శ్రీనివాస రైస్ మిల్ రెండూ రమేశ్ బినామీ పేర్లపై నడుస్తున్నట్టు గుర్తించింది. స్టేజ్-1, స్టేజ్-2 కాంట్రాక్టర్లు కూడా బినామీల పేర్లతోనే కల్వకుర్తి చుట్టుపక్కల ఉన్న చిన్న రైస్ మిల్లులను లీజుకు తీసుకొని రేషన బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారని పరిశీలనలో వెల్లడైంది.



ఆల్ ఇండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం

- బ్రాహ్మణ సంక్షేమానికి రూ.వంద కోట్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌దే
- ఔత్సాహిక బ్రాహ్మణులకు శిక్షణ
- ప్రభుత్వ సలహాదారుడు కేవీ రమణాచారి

హిమాయత్‌నగర్: బ్రాహ్మణ సంక్షేమ సంఘానికి ఏటా రూ.100 కోట్లు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ప్రభుత్వ సలహాదారుడు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్ కేవీ రమణాచారి చెప్పారు. ఇదే తరహాలో పొరుగు రాష్ట్రాలు బ్రాహ్మణుల అభ్యున్నతికి కృషిచేయాలనికోరారు. శనివారం హైదరాబాద్‌లో ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రమణాచారి మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజంలో మేధావులున్నా ఐక్యత లేక ఆయారంగాల్లో రాణించడంలేదని చెప్పారు. ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్రంలో అర్చక పూజలకు ఔత్సాహిక బ్రాహ్మణులకు ఆర్థికసాయంతో శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని చెప్పారు. ఉగాది సమయంలో అర్చకులకు డబుల్‌బెడ్రూం ఇండ్లు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఫెడరేషన్ తరపున సీఎంకు 'బ్రాహ్మణ మిత్ర' అవార్డు అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎస్ వేణుగోపాలాచారి, ఏపీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వీ ఆనందసూర్య, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఎమ్మెల్యే ఎన్వీఎస్ ప్రభాకర్, మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, బ్రాహ్మణ ఫెడరేషన్ జాతీయప్రధాన కార్యదర్శి ప్రదీప్ జియోతి, సలహాదారుడు కోట శంకర్‌శర్మ, కోశాధికారి చంద్రశేఖర్‌శర్మ, తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వీ జగన్‌మోహన్‌శర్మ, ప్రధాన కార్యదర్శి బీ హన్మంతాచారి, కోశాధికారి వీ రామగిరిశర్మ, ఉపాధ్యక్షుడు వీ శ్రీనివాస్‌రావు, గ్రేటర్ అధ్యక్షుడు తులసీ శ్రీనివాస్, గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షుడు కరణం నారాయణ పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువతకు శిక్షణా తరగతులు

బ్రాహ్మణ యువకులకు అర్చన, ఆరాధనక్రమం, పంచాంగం చూసే విధానం వంటి కనీస వైదిక పరిజ్ఞానంపై త్వరలో శిక్షణా తరగతులను నిర్వహించేందుకు రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ప్రణాళికలు రూపొందిస్తున్నది. పరిషత్తు సారథ్యంలో మూడునెలలపాటు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందించనున్నది. నూతన సంవత్సర కానుకగా అతిత్వరలో శిక్షణను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.

నమస్తే తెలంగాణ కళ్యాణమస్తు





...మీ జీవిత భాగస్వామి ఎంపికలో ఆత్మీయ బంధువు

భాగ్యలక్ష్మి రెడ్డి మ్యాట్రిమోని

రెడ్డి వధూవరులకు ప్రత్యేకముగా చూడబడును



H.O : తార్నాక హబ్సిగూడ కాంప్లెక్స్,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.
Whatsapp: 9866044439
bhagyalakshmireddymatrimoni@gmail.com

వధువు కావలెను

★రెడ్డి డాక్టర్ : 28Y, 5'8", MBBS, MD, Doctor, 25 Crores Property వరునికి తగిన Doctor వధువు కావలెను. 9246960888

★రెడ్డి : 26Y, 5'10", M.Tech, MS, SWE, USA, 120K PA, 10Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★రెడ్డి : 31Y, 5'10", B.Tech, (IIT), MS (USA), Ph.D (Germany) Scientist, 3.5L PM USA, 10Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి : 29Y, 6'2", B.Tech, IT, MS, SWE, USA, 120K PA Well Settled, వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★రెడ్డి : 31Y, 5'11", B.Tech, SWE, Europe, 4L PM వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★రెడ్డి : 29Y, 6ft, B.Tech, SWE, Abudhabi, 40L PA, 20Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★రెడ్డి: 29Y, 5'9", MBA, Bank Employ, 4L PA, 5Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★రెడ్డి: 31Y, 5'8",M.Pharmacy, Scientist, 75,000/- PM 5Crores Property వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★రెడ్డి: 30Y, 5'10", PGDM, MBA, SWE, 70,000/- PM, 11Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★రెడ్డి రెండవ పెళ్ళి : 35Y, 6ft, M.Sc, B.E, 150K PA, 8Crores Property వరునికి తగిన వధువు కావలెను. 9248064777

వరుడు కావలెను

★రెడ్డి డాక్టర్ : 28Y, 5'4", MBBS, DGO, Doctor, 1Crore Property వధువుకు తగిన Doctor వరుడు కావలెను. 9248064777

★రెడ్డి : 24Y, 5'4", B.Tech SWE, USA, 2Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★రెడ్డి: 30Y, 5'5", B.Tech, SWE, USA, 80K PA Well Settled వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★రెడ్డి: 29Y, 5'4", MS,SWE, USA, 120K PA వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెడ్డి: 26Y, 5'6", B.Tech, (MS), SWE, USA, 6L PM అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★రెడ్డి: 25Y, 5'4", MS, SWE, Australia, 50K PA, 1Crore Property వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★రెడ్డి: 22Y, 5'3", BE Computers, MBA, 8Crores Property వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★రెడ్డి: 25Y, 5'2", BE (Bitspilani) M.Sc, (Biology) Scientist, 6L PA 2Crorers Property వధువుకు తగిన వరుడు కావలెను. 9030315599

★రెడ్డి : 27Y, 5'3", B.Tech, MBA, SWE, 50,000/- PM వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

★రెడ్డి రెండవ పెళ్ళి: 33Y, 5'3", B.Tech (IT), MBA, SWE, 11L PA వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

తెలంగాణ రెడ్డిలకు మాత్రమే

కేవలం తెలంగాణలో రెడ్డి వివాహ సంబంధాలు కుదుర్చగల ఏకైక వివాహ వేదిక. కేసరి మోహన్ రెడ్డి మ్యారేజ్ బ్యూరో, బర్కత్‌పుర, హైదరాబాద్. ☎: 040-27555006, 9246573006, 7981053739
E-mail:keesarimb@gmail.com, www.keesarimarriages.com
Timing: 10 am to 5.00 pm. Tuesday Holiday.
మా బ్రాంచ్: B.N.రెడ్డి క్రాస్ రోడ్స్, సాగర్‌రోడ్, చైతన్యనగర్, ఫేస్-2, రోడ్ నం.4, హైదరాబాద్.
Native Place:తిరుగండ్లపల్లి (గ్రా), మర్రిగూడ (మం), నల్గొండ (జి)

వధువు కావలెను

★రెడ్డి: 29/ 5'5"/ BS/ MBA/ USA/ Citizen/ 90K/Full Time/ 30Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 27/5'8"/ BE/ MS/ USA/ Green Card/ 95K / 25Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 27/ 5'8"/ BE/ MS/ Canada/ PR/ 80K/10Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 29/ 5'9"/ BE/ MS/ USA/ H1/ 80K / 200Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 29/5'6''/MBBS/Own Hospital/ 2L P/M/ 10Cr/ వరుడికి తెలంగాణ డాక్టర్ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 28/ 5'10" / MBBS/ MD/ DM/ ఎండ్రోక్రైనాలజీ/ 50Cr/ వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 28 / 6'0" / MBBS/ MS/ Ortho/ 50Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 29 / 5'8" / BE/ M.Tech/ 13L PA/ Only One/ 500Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 32/ 5'10" / BE/ IIT/ 36L P/A/ 20Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 34/ 5'10" / BE/ Govt Job 12L P/A/ 5Cr వరుడికి తెలంగాణ వధువు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

వరుడు కావలెను

★రెడ్డి: (Now in Hyd) 26 / 5'5" / BE/ MS/ USA/ 60K/ Full Time/H1/2Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 24 / 5'5" / BE/ MS/ USA/ 100K/ F1/ 20Cr/ వధువుకి తెలంగాణ Business/ Rich Family వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 23 / 5'2" / BE/ 3L P/A/ 50Cr వధువుకి తెలంగాణ Rich Family/ Business వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 24 / 5'4" / BE/ MS/ USA/ 5L P/A/ Hyd/ 15Cr వధువుకి తెలంగాణ Business/ Job వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి : 27 / 5'5" / BE/ State Govt Employee/ 10L P/A/ 1Cr వధువుకి తెలంగాణ Govt Job వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006


★రెడ్డి: 26 / 5'4" / BCJ/MCJ/ జర్నలిజం/50L వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 24/ 5'2" / BE/ 4L P/A/ 50L వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 27 / 5'3" / MBBS/ MS/ Gen.Sur/ 5Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి: 25 / 5'5" / MBBS/ MS/ Gynaecology/ 10Cr వధువుకి తెలంగాణ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006

★రెడ్డి రెండోపెళ్ళి: 39 / 5'2" / B.Com/ 12L P/A/ 1Cr వధువుకి తెలంగాణ /USA (or) India/ SWE/ వరుడు కావలెను. సంప్ర|| కీసరి మోహన్ రెడ్డి. Ph No. 9246573006



కళ్యాణ వేదికలు

★T.Bhoom Reddy Marriage Bureau for Local, Abroad Matches. Cont: H-13/1, Near Ahobilamutt, D.D. Colony, Hyd. Ph: 040-27425273, 8790123939, 9347225273

★శ్రీశ్రీశ్రీ కొమురవెల్లి మ్యారేజ్ బ్యూరో: ప్రత్యేకముగా మాల, మాదిగలకు లేట్, 2వ & ఇతర కులముల సంబంధాలు చూడబడును. సంప్ర||రాంనగర్'X' రోడ్స్, Hyd. 9701552985. Mail ID:avula.ramulu@yahoo.com

★రజక మ్యారేజ్ బ్యూరో: Drs., Engrs., A.E., Bank, J.T.O., Teachers, USA, Kamala Pandu, New Bowenpally, Sec-bad-11. kp.rajaka@gmail.com. Ph: 9676673789, 9949871493.

★అన్ని కులాల వారికి 1వ, 2వ సంబంధములు వయస్సుతో నిమిత్తం లేకుండా త్వరగా కుదుర్చబడును. వధువులకు రిజిస్ట్రేషన్ ఫ్రీ. Ph: 7093158343

★SC: మ్యారేజ్ బ్యూరో హిందూ మాల/హిందూ మాదిగ సంబంధాలు చూపబడును. Cable 'X' Roads, HCL Main Gate, Ambedkar Bhavan, Hyd-51. Ph: 9989397757, 9640836488, 7032117247

★SC మాల మాదిగ వివాహ సంబంధాలకై ఫోటో వివరాలను 7981782162 నెంబర్‌కు వాట్సాప్ గాని markway910 marriages@gmail.comకు మెయిల్‌గాని పంపించండి. సంప్ర: Markway Marriages, RTC 'X' Road, Hyd. రిజిస్ట్రేషన్ ఫ్రీ.

★బ్రాహ్మణ వధూ-వరుల వివాహ పరిచయ వేదిక తేది:ఫిబ్రవరి 11 ఆదివారం 2018న జ్యోతి గార్డెన్స్, ECIL, Hydలో జరుగును. టైం: 1 PM to 6 PM. Ph: 9704656103, 9533608887

★కేవలం కులపట్టింపులేని వారికి మాత్రమే 2వ సంబంధాలు చూడబడును. విడో, విడోయర్స్, తోడు, ఇల్లరికం ఐనా OK. 40-60 సం|| వారు సంప్ర: 7702650243

★BLESSINGS MARRIAGE BUREAU: All Castes 1st, 2nd, Late Matches. Cont: Rani, Ph: 9700352764, 8096305209



వధువు కావలెను

★వైశ్య 28 ఎరుపు, 5.5, M.Sc.,M.Ed., T.T.C ప్రైవేట్ లెక్చరర్ 35 వేలు, సొంత ఇల్లు, 3 ఎకరాల భూమి అబ్బాయికి వైశ్య అమ్మాయి కావలెను. వీరయ్య, MIG-9, HB మునుగోడు రోడ్, నల్లగొండ డైరెక్ట్, సెల్:9618418981.

★రెడ్డి, డైవర్సీ, CNB, 56, 5'10", ఇంటర్, కారు, ఇల్లు, ప్లాటు, పొలం, 1.5L PM. *ఒంటరి, 60, 5'10", ఓపెన్ మైండ్ వారు కావలెను. ఇల్లరికం OK. Ph: 9063471025, 7386103012

★SC (MADIGA), B.Tech, M.Tech, (MBA), Age: 25, Fair Complex, seeks suitable Match from same Caste and Good Family. Call: 9052025113



వరుడు కావలెను

★గౌడ్స్, un మ్యారేజ్, 28Y, 5'5", మార్బుల్స్ & టైల్స్, Own బిజినెస్, 12 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. Ph:8106499144

★కుల పట్టింపు లేదు (2వ పెళ్ళి) 36, 5'4", Degree/ Pvt. Job, Fair సాంప్రదాయ మధ్య తరగతి వధువుకు Well Settled, BC Caste వరుడు కావలెను. (నో బ్రోకర్స్) Direct: 9030324436

★GOUDS: Age: 27, Height: 5'4", Qly: M.Sc.B.Ed., Presently: Private Job. Salary:12,000/-. Ph: 9652659684, Direct, No Brokers

గమనిక: "కళ్యాణమస్తు" ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటన దారులకు సంబంధించిన హామీలకు పత్రిక బాధ్యత వహించదు. ప్రకటనల అన్ని విషయాలలో వధూ వరులు, పెండ్లి పెద్దలే నిర్ణయాలు తీసుకోవాలి. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

4 లైన్ల ప్రకటనకు 400/-
ప్రతి అదనపు లైనుకు 100/-
కళ్యాణమస్తు
8-2-603/1/7, 8, 9, Krishnapuram, Road. No.10 ,Banjara Hills, Hyderabad - 500034.
8096677819

www.avinashreddy.com

రెడ్డి వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి: 690, RoadNo.3, BanjaraHills, Hyd.
Tuesday Holiday, Timings: 10 AM to 5 PM, avinash11818@gmail.com
93933 11818

వధువు కావలెను

★Reddy BE,MS, USA, 27, 5'8", 145K, H1, Rich Family. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy H1, BE, MS, USA, 27, 5' 11", SWE, Handsome. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE (IIT), 31, 6' , Sr. SWE, 20 L P/A, Hyd. Cont: Road - 3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE BITS, MS USA, 28, 6', SWE, H1, 5 Crores. Cont:Road-3, BanjaraHills, Hyd.93933 11818. www.avinashreddy.com

★Reddy Business, BE, MBA, M Tech, 26, 5'9", 30 Crores. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy MBA (USA) 25, 5'10", 75 Crores, Hyd, Handsome. Cont: Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

వరుడు కావలెను

★Reddy BE, 24, 5'7", 10L P/A, SWE, Hyd. Cont:Road - 3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.

★Reddy MS, 22, 5' 6", 20 Crores, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE,MBA, 25, 5' 4", SWE, 90 K, USA. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE,MS, 26, 5' 7", H1 USA, 25 Crores, Fair & Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.

★Reddy 27 , 5' 7", 2 Lakhs P/M, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy 22 , 5' 4", BE, 5 Crores, Hyderabad. Cont: Road - 3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE, 23, 5' 7", SWE, 8.5 L P/A, Hyd. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy (Now Hyd) BE,MS, 25, 5'4", USA, 3 Crores. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE, 21, 5' 3", 3.5 Crores, Hyderabad, Fair&Slim.Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE,MS, 25, 5' 5", SWE, 8 Crores, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.

★Reddy BE,MS, 5'4", 2 Crores, USA, Fair. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.

★Reddy CA, 24, 5' 6", Hyd, Rich Family, Fair & Slim. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.

★Reddy Divorce, Bengaluru, MBBS, MD, 31, 5' 5",10 Crores. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
తెలంగాణ రెడ్డి
వివాహ సంబంధాలకు సంప్రదించండి
D.V. Koti Reddy 690, Road No-3, Banjara Hills, HYDERABAD
98480 11818

★Reddy Bengaluru, MS, 30, 5'11", Business, Handsome, Cont:Road- 3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE, 29, 6', 100 K, SWE, 10 Crores. Cont: Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE,MS, USA, 29, 5' 6", 90 K, H1, Handsome. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE,MS, (USA), 27, 5'10" Now Hyd, Rich. Cont: Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy 27, 5'11", BE, MS USA, SWE, H1, 25 Crores. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE(IIT), MTech (IIT), 29, 5' 6", SWE, 20 L P/A. Cont: Road-3, BanjaraHills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy BE,MS, 27, Software, 10 Crores, USA. Cont: Road-3, BanjaraHills, Hyd.93933 11818. www.avinashreddy.com

★Reddy BE, M Tech (Arch), 20 Crores, 6' 26, Handsome. Cont:Road-3, Banjara Hills, Hyd. 93933 11818. www.avinashreddy.com

★Reddy MS, 25, 5' 3", 4 Crores, Hyd. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE NIT, 5'5", 26, Hyd, Rich Family. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE, MS, 24, 5'6", Rich Family, Fair. Cont:Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

★Reddy BE, M.Tech, 24, 5' 6", HR, Fair & Slim. Cont: Road-3, Banjara Hills, Hyd. 98480 11818. www.avinashreddy.com

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో (గంగపుత్ర స్పెషల్)

గంగపుత్ర సంబంధములకు సంప్రదించండి
H.O : తార్నాక హబ్సిగూడ కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.

వధువు కావలెను

★గంగపుత్ర : 29Y, 5'7", B.Tech, MBA, Central Govt Employee, 52,000 PM వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★గంగపుత్ర : 30Y, 5'10", B.Tech, MBA, Govt Employee, 35,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★గంగపుత్ర : 30Y, 5'8", B.Tech, MBA, Bank Manager, 50,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★గంగపుత్ర : 29Y, 5'8", B.Tech, MS (UK), SWE, 9.5L PA వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★గంగపుత్ర : 29Y, 5'8", B.Tech, SWE, 10L PA వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★గంగపుత్ర : 30Y, 5'6", B.Tech, SWE, 9L PA వరునికి తగిన వధువు కావలెను. 9030315599

★గంగపుత్ర : 32Y, 5'11", B.Tech, MBA, 7L PA వరునికి తగిన వధువు కావలెను. 9248064777

★గంగపుత్ర : 27Y, 5'5", B.Tech, SWE, 50,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9246960888

★గంగపుత్ర : 30Y, 5'5", B.Tech, M.Tech, SWE, 70,000 PM వరునికి తగిన వధువు కావలెను. 7207930999

★గంగపుత్ర : 27Y, 6ft, MBA, M.Pharmacy, SWE, 50,000 PM వరునికి తగిన వధువు కావలెను. 9030315599

వరుడు కావలెను

★గంగపుత్ర : 27Y, 5'5", B.Com, B.Ed, Government Job, 30,000/ PM వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

★గంగపుత్ర : 25Y, 5'4", MS, (USA) SWE, USA, 100K PA వధువుకి తగిన వరుడు కావలెను.7207930999

★గంగపుత్ర : 25Y, 5'6", MS, B.Tech, SWE, USA, 4L PM వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888

★గంగపుత్ర : 25Y, 5'2", Degree, Govt Job, 26,000/ PM వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777

★గంగపుత్ర : 22Y, 5'5", B.Tech, Govt Job, 50,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

★గంగపుత్ర : 28Y, 5'3", M.Pharmacy, Jr, Officer, 3.5 PA, వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999

★గంగపుత్ర : 24Y, 5'4", B.Tech, SWE, 4.5Laks PA వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777

★గంగపుత్ర : 22Y, 5'2", B.Tech, MBA, SWE, 20,000 PM, వధువుకి తగిన వరుడు కావలెను. 9246960888

★గంగపుత్ర : 25Y, 5'4", M.Tech, Asst Professor 20,000 PM, వధువుకి తగిన వరుడు కావలెను. 7207930999

★గంగపుత్ర : 26Y, 5'3", Degree, MBA, Computer Operator 10,000 PM వధువుకి తగిన వరుడు కావలెను. 9030315599

శ్రీ సౌభాగ్య మ్యారేజ్ బ్యూరో

అన్ని కులముల పెండ్లి సంబంధములకు సంప్రదించండి.



H.O : తార్నాక హబ్సిగూడ కాంప్లెక్స్,
srisowbhagya.hyd@gmail.com,
Konala Bhagyalakshmi Reddy, M.A.
Vice-President:
Telangana Marriage Links.
Cell: 9246960888,9030315599.

వధువు కావలెను

★భట్రాజు : 30Y, 5'6", B.Tech, SWE, 16 Laks PA వరునికి వధువు కావలెను. 9248064777

★కాపు : 28Y, 5'9", M.Tech (NIT), SWE, 9 Laks PA వరునికి వధువు కావలెను. 9246960888

★మున్నూరుకాపు : 25Y, 5'5", B.Sc, Govt Job, 33,000 PM వరునికి వధువు కావలెను. 9030315599

★పద్మశాలి : 27Y, 5'6", BE, B.Tech, SWE, 8 Laks PA, వరునికి వధువు కావలెను. 7207930999

★గౌడ్స్ : 29Y, 5'6", B.Tech, SWE, 6.5 Laks PA వరునికి వధువు కావలెను. 9248064777

★ముదిరాజ్ : 31Y, 6ft, MBA, Manager, 1.5 Laks PM వరునికి వధువు కావలెను. 9246960888

★నాయీబ్రాహ్మణ : 28Y, 5'5", Assistant Manager, 7.2 Laks PA వరునికి వధువు కావలెను. 9030315599

★హిందూ మాల : 29Y, 5'8", B.Tech, SWE, 10 Laks PA వరునికి వధువు కావలెను. 7207930999

★హిందూ మాదిగ: 29Y, 5'5", B.Tech, MBA, Govt Job, 60,000/- PM వరునికి వధువు కావలెను. 9248064777

★పద్మశాలి రెండవపెళ్ళి: 31Y, 5'8", MCA, SWE, 7.5 Laks PA, వరునికి వధువు కావలెను. 9246960888

వరుడు కావలెను

★కమ్మ: 24Y, 5'5", B.Tech, HR, 20,000 PM వధువుకి వరుడు కావలెను. 9246960888

★మున్నూరుకాపు : 24Y, 5'6", M.Tech, SWE, 7 Lakhs PA వధువుకి తగిన వరుడు కావలెను. 9248064777

★పద్మశాలి : 28Y, 5'1" B.Tech, SWE, 15 Laks PA వధువుకు వరుడు కావలెను. 9030315599

★యాదవ : 26Y, 5'6" MCA, Lecturer, 15,000 PM వధువుకు వరుడు కావలెను. 7207930999

★గౌడ్స్ : 26Y, 5'5" B.Tech, SWE, 25,000 PM వధువుకు వరుడు కావలెను. 9246960888

★ముదిరాజ్ : 26Y, 5'2" B.Tech, SWE, 20,000 PM వధువుకు వరుడు కావలెను. 9248064777

★నాయీబ్రాహ్మణ : 29Y, M.Com, Consultant, 30,000 PM వధువుకు వరుడు కావలెను. 9030315599

★హిందూమాల : 29Y, 5'2", MBA, Pvt Job, 20,000 PM వధువుకు తగిన వరుడు కావలెను. 7207930999

★హిందూ మాదిగ : 29Y, 5'8", M.Pharmacy, Advisor, 30,000 PM వధువుకు తగిన వరుడు కావలెను. 9246960888

★పద్మశాలి రెండవ పెళ్ళి : 25Y, 5'4", MBA, వధువుకు తగిన వరుడు కావలెను. 9248064777

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై|| లి||

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, abroad Matches Fast Settlement: (For Reddy's Only) (Telangana) Cont:K.C. Reddy, Address: 106, A.K. Enclave, Phase-II, 8-2-350, Road No.3, Banjara Hills (Near A.P.Furniture Mall), Hyd.
Ph: 9849321309 / 9347807015
Email: kcreddy43@gmail.com

వధువు కావలెను

★Reddy/ B.Tech (IIT) M.Tech (IIT) 35L/yr/ Bang/ 30/5'7"/ 15Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ (IIT) M.Tech (IIT) / Ph.D (USA) 300K/ 31/6'/ 10Cr *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ (VIT) MS /H1/ USA/ 150K/ 70Cr (Prop) 12L/M (Rental) Income/ 30/ 5'7" *Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ B.Tech/ (MGIT) MS /H1/ USA/ 28/5'8"/ 100K/ 30Cr (Prop) *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/ (Sports Man)/ B.Tech/ Govt Officer/ 70Cr (Prop) Hyd - 28/5'9"/ *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/Wgl/B.Tech/ MS/ H1 (USA)/ 60Cr/ 28/5'11"/ The Only Son/ Fr-Doc *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/MBBS/MD/DM/(endocrinology) 29/5'10"/50Cr - Both Parents doctors *Cont: K.C.Reddy-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(Divercee) USA Citizen/ 38/5'8"/ 180K/ 30Cr (Prop) *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/R.R.Dist/ Business/ B.Tech/ M.Tech/ 200Cr/ 28/6'/ V.Smart. *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/MBBS/MD/DM (MNGR) 30/ 5'7"/ 50Cr/ Motati *Cont: K.C.Reddy- Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(NLG) B.Tech/ MS/ Aus/30/5'8"/ 6L/M Rental income/ 25Cr(Prop) Hyd/ 75K *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(Wgl) MBBS/ Res-Doc-USA/ 31/6'/ *Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/R.R.Dist/ B.Tech/ MS (Australia) V.Smart (Aus-Citizen) 29/5'9"/ 30Cr (Prop) *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(Divercee) Hyd/ B.Tech/ Business - Contractor/ 38/5'9"/60Cr Big house in B.hills *Cont: K.C. Reddy. Ph:9849321309/ 9347807015.

★Reddy/(US-Green Card) Medak/ B.Tech/ 95K/ 30Cr (Prop) 28/5'9"/ *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/R.R.Dist/ Business/ 34/ 5'5"/ 60Cr (Prop) Hyd - Good factory *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/R.R.Dist/Business/ Builder/ 29/5'10"/ 40Cr (Prop) Hyd. *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(WGL) B.Tech/ MBA (USA) 26/5'9"/ 75 Cr- Fr-Big Contractor- in Hyd *Cont: K.C.Reddy- Mar- Bureau-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/(NZB) BS / USA/ 25/ 6/150Cr- Fr big- Business Man- Hyd *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/Business/ 31/5'9"/ 200Cr *B.Tech MBA *30/5'8"/200Cr* 30/5'10"/ 200Cr *Cont: K.C.Reddy- Mar- Bureau-Banjarahills-Hyd. Ph:9849321309/ 9347807015.

వరుడు కావలెను

★Reddy/ B.Tech (Amritha College) MS/ USA/ Most beautiful/ 26/5'3"/ 150Cr (Prop)*Cont: K.C.Reddy-Mar-Bureau-Banjarahills- Hyd. Ph:9849321309/ 9347807015.

★Reddy/BE (BITS) MBA (WHARTON) USA/ 30/5'5"/ 200K *B.Tech (IIT) MS (USA) CMU/ 25/ 5'7 1/2"/30Cr *Cont K.C. Reddy -Hyd. Ph: 9849321309/ 9347807015.

★Reddy/ MBBS/ 22/5'5"/ 2Cr *27/5'7"/ 4Cr* *Cont K.C. Reddy - Mar- Bureau -Road No 3- Banjarahills-Hyderabad. Ph:9849321309/9347807015.

★Reddy/ B.Tech/ MBA/ OWN Big business/ Hyd/ 27/5'3"/ 20Cr - Prop *Cont K.C. Reddy - Mar- Bureau -Banjarahills-Hyd. Ph:9849321309/9347807015.

★Reddy/ B.Tech/ MBA/ 28/5'3"/30 Cr *27/5'5"/40 Cr *27/5'6"/25 Cr *26/5'2"/20 Cr * 27/5'5"/20 Cr *Cont K.C. Reddy - Banjarahills-Hyd. Ph: 9849321309/9347807015.

★Reddy/B.Tech/MBA/30/5'6"200Cr *29/5'2 1/2"/100Cr *27/ 5'6"/ 100Cr *30/5'4"/ 70Cr * 27/5'5"/40Cr * 27/5'3"/30Cr *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309/9347807015

★Reddy/MBBS/MD/MS*24/5'2"/50Cr/ Sur/27/5'3"*Radio Theraphy/ 25/5'4" *Med/26/5'6"10Cr *28/5'7"/25Cr *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/Rich *25/5'3"/40Cr &27/5'5"/25Cr *27/5'5"/20Cr*27/ 5'7"/ 50Cr*27/5'3"20Cr*25/5'6"/30Cr*27/5' 3"/30Cr *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★Reddy/B.Tech/SWE/26/5'4"/6Cr*25 5'5"10Cr *25/5'5"/10Cr *24/5'4"/10Cr* 27/5'6"/25Cr*27/5'3"/20Cr*25/5'1"/20Cr *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309

★Reddy/B.Tech/MS/H1/USA25/ 5'3"/40Cr *27 5'5"25Cr *26/5'2"/20Cr *25/5'6"/4Cr* 29/ 5'4"/ 7Cr *28/5'5" /20Cr* Cont K.C.Reddy-Hyd.Ph:9849321309

★Reddy/B.Tech (IIT)/ BITS/ MS/ USA*25/5'7"/30Cr *26/ 5'2"/5Cr/ 110K *26/5'5" *Cont K.C.Reddy-Hyd.Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/MS/H1/USA/ 25/5'4"/3Cr*26/5'6"/5Cr*27/5'4"/ 30Cr *25/5'7"/8Cr*26/5'5/2Cr*Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/MBBS/Res-Doc/ USA*28/5'5"*25/5'4"/100Cr*28/5' 5"/10Cr *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/MBBS/Res-Doc/USA*25/ 5'7"/50Cr*29/5'6" *33/5'7"/10Cr*BDS/ DDS/29/5'3"/100Cr *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/IIT/BITS/India Job*29/5'6"/12L/Y*25/5'9"*28/ 5'3" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/USA-CITIZEN *Doctors/25/5'5"/ 100Cr *25/5'7"/50Cr *28/5'5"/10Cr*30/5'2"/ 10Cr*Engineer/22/5'6"*32/5'5"*Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★Reddy/Catholic.H1/USA*B.Tech/ MS/25/5'7"/30Cr*27/5'6"*34/5'4"* IND/ 23/5'5"/15Cr*27/5'4" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/B.Tech/Working/Hyd*B.Tech (CBIT)M.Tech IIT/26/5'4"/14 L/Y/2Cr*25 /5'5"/10Cr*27/5'5"*26/5'7"*28/5'5"/12/yr" *Cont K.C.Reddy-Hyd. Ph:9849321309

★Reddy/Divercee*India*B.Tech/27/ 5'6"/25Cr*32/5'2"/25Cr*32/5'2"/1Cr*30/ 5'2 1/2"/10Cr*28/5'5"/5Cr *Cont K.C. Reddy-Hyd. Ph:9849321309/9347807015

★Reddy/Divercee USA *B.Tech/27/ 5'2"/ 4Cr *30/5'6"/4Cr*40/5'5" *34/5'3"/ 10Cr*31/5'5" *36/5'2" *Cont K.C. Reddy -Hyd. Ph:9849321309/9347807015

బంగారం ధరలు	
ఢిల్లీ (రూ.లలో)	
24 క్యారెట్లు	30,450
22 క్యారెట్లు	30,300
వెండి (కిలో)	40,000

చికెన్ ధరలు	(రూ.లలో)
ఫారం ధర	86.00
రిటైల్ లైవ్	108.00
డ్రెస్డ్	157.00
స్కిన్‌లెస్	178.00

నెక్ (వంద గుడ్లకు)	(రూ.లలో)
హైదరాబాద్	398-00
రంగారెడ్డి	398-00
మెదక్	398-00
కరీంనగర్	400-00
వరంగల్	400-00
రిటైల్ ప్రైస్	4-60





సంస్కరణలతో సత్ఫలితాలు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7 శాతానికిపైగా వృద్ధిరేటు.. ఈఏసీ-పీఎం చైర్మన్ వివేక్ దేవ్‌రాయ్ ధీమా

న్యూఢిల్లీ, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 6.5 శాతంగా ఉంటుందన్న ముందస్తు అంచనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి (ఈఏసీ-పీఎం) చైర్మన్ వివేక్ దేవ్‌రాయ్ అన్నారు. 2018-19లో ఆర్థిక వృద్ధిరేటు వేగవంతమై 7 శాతానికి పైగా నమోదవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ప్రథమార్ధంలో నమోదైన జీడీపీ వృద్ధిరేటు కంటే ద్వితీయార్ధంలో నమోదయ్యే వృద్ధిరేటు మెరుగ్గా ఉంటుందని ఆయన తెలిపారు. 'కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నట్లు జీడీపీ ముందస్తు అంచనాలు రుజువు చేస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం వృద్ధిరేటు నమోదవుతుందన్న ఈ అంచనాలను చూస్తుంటే.. మూడవ, నాలుగవ త్రైమాసికాల్లో నమోదయ్యే వృద్ధిరేటు ప్రథమార్ధంలో నమోదైన వృద్ధిరేటు కంటే మెరుగ్గా ఉంటుందని, మూడో త్రైమాసికంలో వృద్ధిరేటు 6.5 శాతం కంటే ఎక్కువగానూ, చివరి త్రైమాసికంలో వృద్ధిరేటు దాదాపు 7 శాతం మేరకు నమోదవుతుందని స్పష్టమవుతోంది' అని ఆయన శనివారం ఒక ప్రకటనలో వివరించారు. వృద్ధిరేటు గణాంకాలు పరోక్ష పన్ను వసూళ్లపై ఆధారపడి ఉంటాయని, ఇప్పటికే పీఎంఐ (పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్)తో పాటు ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి, వాహన అమ్మకాలు సహా పలు సూచీలు మెరుగుపడినట్లు స్పష్టమవుతోందని ఆయన పేర్కొన్నారు. త్వరలో ప్రైవేటు పెట్టుబడులతో పాటు ఎగుమతులూ ఊపందుకుంటాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

జైట్లీదీ అదేమాట

మరోవైపు ప్రపంచంలో పెద్ద ఎత్తున నిర్మాణాత్మక సంస్కరణలు చేపడుతున్న ఏకైక దేశం భారతేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ నొక్కిచెప్పారు. శనివారం ఇక్కడ జరిగిన యూకో బ్యాంక్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాము చేపట్టిన సంస్కరణల ఫలితాలు ఇప్పుడిప్పుడే వస్తున్నాయన్నారు. ఇదిలావుంటే ప్రభుత్వ రంగ బ్యాంకులకు చేస్తున్న మూలధన సాయం.. రుణాల వృద్ధికి దోహదపడగలదని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ అన్నారు.



పొరపాట్లు సరిదిద్దుతున్నారు

■ నీలేకనీపై బాలకృష్ణన్ ప్రశంసలు



బెంగళూరు, జనవరి 6: గత ఇన్ఫోసిస్ పాలక మండలి చేసిన తప్పులను సంస్థ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ నందన్ నీలేకనీ సరిదిద్దుతున్నారంటూ ఆ సంస్థ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్ కొనియాడారు. మాజీ సీఈవో విశాల్ సిక్కా వేతనంతో పోల్చితే ప్రస్తుత సీఈవో సలీల్ పరేఖ్ జీతాన్ని సహేతుకంగా నిర్ణయించారన్నారు. 'గత ఇన్ఫోసిస్ బోర్డు చేసిన తప్పిదాలను నీలేకనీ నేతృత్వంలోని బోర్డు సరిచేస్తున్నట్లు నాకు అనిపిస్తున్నది. కొత్త సీఈవో పరేఖ్‌కు ప్రకటించిన వేతన శైలే ఇందుకు నిదర్శనం' అని శనివారం ఇక్కడ పీటీఐతో బాల అన్నారు. క్రింది స్థాయి ఉద్యోగుల జీతాలతో పోల్చితే ఉన్నతోద్యోగుల వేతనాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయంటూ సంస్థ వ్యవస్థాపకులు.. గత బోర్డు సభ్యుల తీరుపై విరుచుకుపడిన నేపథ్యంలోనే నీలేకనీ సారథ్యంలో ఇన్ఫోసిస్‌కు కొత్త బోర్డు వచ్చిన విషయం తెలిసిందే.

ప్రధాన రేవుల్లో పెరిగిన సరుకు రవాణా

■ ఏప్రిల్-డిసెంబర్ మధ్య 499 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్

న్యూఢిల్లీ, జనవరి 6: దేశంలోని 12 ప్రధాన రేవులు గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 3.64 శాతం వృద్ధితో 499.41 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ తొమ్మిది నెలల కాలంలో ఎనిమిది మేజర్ పోర్టులు (హల్దియా సహా కోల్‌కతా, పారదీప్, విశాఖపట్నం, చెన్నై, కొచ్చిన్, న్యూ మంగళూర్, జేఎన్‌పీటీ, కాండ్లా) సరుకు రవాణాలో సానుకూల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. '2016 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో 481.87 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసిన 12 మేజర్ పోర్టులు 2017 ఏప్రిల్-డిసెంబర్ మధ్య కాలంలో 499.41 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేసి 3.64 శాతం వృద్ధిని సాధించాయని, వీటిలో కొచ్చిన్ పోర్టు అత్యధికంగా 17.27 శాతం వృద్ధితో అగ్రగామిగా నిలువగా, ఆ తర్వాతి స్థానాల్లో పారదీప్ (14.59 శాతం), కోల్‌కతా (12.45 శాతం), న్యూ మంగళూర్ (6.60 శాతం), జేఎన్‌పీటీ (5.94 శాతం) పోర్టులు ఉన్నాయని నౌకాయాన శాఖ వెల్లడించింది. పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ రవాణా 24.10 శాతం, కంటెయినర్ల రవాణా 10.79 శాతం పెరగడం కొచ్చిన్ పోర్టులో సరుకు రవాణా వృద్ధికి ప్రధాన కారణమని ఆ శాఖ పేర్కొంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు కోల్‌కతా పోర్టు 81.12 మిలియన్ టన్నుల సరుకులను రవాణా చేయగా, పారదీప్ పోర్టు నుంచి 74.40 మిలియన్ టన్నులు, జేఎన్‌పీటి నుంచి 48.89 మిలియన్ టన్నులు, ముంబై పోర్టు నుంచి 47.53 మిలియన్ టన్నులు, విశాఖపట్నం పోర్టు నుంచి 46.56 మిలియన్ టన్నుల సరుకు రవాణా జరిగిందని, దేశంలోని 12 మేజర్ పోర్టుల నుంచి జరిగిన మొత్తం సరుకు రవాణాలో ఈ ఐదు పోర్టుల వాటా దాదాపు 60 శాతం మేరకు ఉందని నౌకాయాన శాఖ వివరించింది.



'హెచ్-1బీ' విధానం బాగాలేదు

■ ట్రంప్ తీరుపై అమెరికా పరిశ్రమల ధ్వజం

వాషింగ్టన్, జనవరి 6: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వీసా విధానంపై అక్కడి వ్యాపార, పారిశ్రామిక రంగం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నది. హెచ్-1బీ వీసాల పొడిగింపును అడ్డుకోవడం సరైన నిర్ణయం కాదని, ఇది చాలా చెడ్డ విధానం అంటూ అమెరికా చాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం విమర్శించింది. నిపుణుల కొరతను ఎదుర్కొంటున్న రంగాల్లో విదేశీ ఉద్యోగుల చేత పనిచేయించుకోవడానికి ఆయా సంస్థలకు అనుమతినిస్తూ అమెరికా జారీచేసే వీసానే ఈ హెచ్-1బీ వీసా. అగ్రరాజ్యంలో పనిచేసే భారత ఐటీ రంగ ఉద్యోగులకు ఇదే ఆధారం. అయితే దేశంలో నిరుద్యోగ నిర్మూలనలో భాగంగా ట్రంప్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలతో ఇప్పటికే భారమైన హెచ్-1బీ వీసాను.. మరింత దూరం చేసేలా చర్యలు జరుగుతుండగా, ఇది అమెరికా వ్యాపారావకాశాలను దెబ్బతీస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థ కూడా కుంటుపడుతుందని, మెరిట్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ వ్యవస్థకూ విఘాతం కలిగిస్తుందని యూఎస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధికార ప్రతినిధి ఒకరు అభ్యంతరం తెలిపారు. హెచ్-1బీ వీసా విధానం కఠినతరంతో గ్రీన్‌కార్డులు ఆశిస్తున్నవారికీ నిరాశే మిగులనుండగా, 15 లక్షల మంది భారతీయులను ఇది ప్రభావితం చేయనున్నది. కనీసం 5 లక్షలు నుంచి 7.50 లక్షల ఉద్యోగులు భారత్‌కు తిరిగి వచ్చే అవకాశాలున్నాయి.

హైదరాబాద్‌లో కేఎల్‌ఎం మూడో షాపింగ్ మాల్

■ ప్రారంభించిన హీరోయిన్ అనూ ఇమ్మాన్యూల్

మలక్‌పేట్ (నమస్తే తెలంగాణ): ప్రముఖ దుస్తుల విక్రయ సంస్థ కేఎల్‌ఎం..హైదరాబాద్‌లో మూడో షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసింది. ఈ మాల్‌ను ప్రముఖ హీరోయిన్ అనూ ఇమ్మాన్యూల్, హీరో విజయ్ దేవరకొండలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నాణ్యమైన వస్త్రాలకు కేఎల్‌ఎం చక్కటి వేదికని, నవజాత శిశువు నుంచి మొదలుకొని వయో వృద్ధుల వరకు అన్ని రకాల వస్త్రాలు, దుస్తులు ఒకే చోట లభించే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఫ్యామిలీ షోరూం వన్ స్టాప్ షాప్ లాంటిదన్నారు. ఈ షోరూంలో రెండు లక్షలకు పైగా పలు రకాల దుస్తులు లభించనున్నాయి. షేర్వానీ, పాటియాల, కుర్తా, డిజైన్ చేసిన సూట్స్ వంటి అన్ని రకాల దుస్తులు ఒకేచోట వినియోగదారులకు అందించాలనుకోవడం అభినందనీయమన్నారు. ప్రారంభ ధర రూ.250 మాత్రమేనని షోరూం నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సంస్థకు రెండు షాపింగ్ మాల్స్ ఉన్నాయి.



హైదరాబాద్‌లో కేఎల్‌ఎం ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న హీరోయిన్ అనూ ఇమ్మాన్యూల్



24 వేల యమహా బైకులు వెనక్కి

న్యూఢిల్లీ, జనవరి 6: ద్విచక్ర వాహన సంస్థ యమహా.. 23,897 వాహనాలను వెనక్కి పిలిపిస్తున్నట్లు ప్రకటించింది వీటిలో 21,640 యూనిట్ల ఎఫ్‌జెడ్ 25 , మరో 2,257 యూనిట్లు ఫేజర్ 25 ఉన్నట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. జనవరి 2017 నుంచి తయారైన ఈ మోడళ్లలో హెడ్ కవర్ బోల్ట్‌కు సంబంధించి సమస్యలు తలెత్తడంతో రీకాల్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

సిమెంట్‌కు ప్రత్యేక రెగ్యులేటరీ!

హైదరాబాద్, జనవరి 6: నిర్మాణ రంగానికి మరిన్ని సంస్కరణలు ప్రకటించాల్సిన అవసరం ఉందని, అలాగే సిమెంట్ ఇండస్ట్రీకోసం ప్రత్యేక రెగ్యులేటరీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కేంద్రానికి బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) కోరుతున్నది. అలాగే నిర్మాణ రంగంపై విధిస్తున్న 18 శాతం వస్తు, సేవల పన్ను(జీఎస్టీ)ని తగ్గించాలని బీఏఐ చీఫ్ ప్యాట్రన్ బీ శీనయ్య డిమాండ్ చేస్తున్నారు. రెగ్యులేటరీ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న ధరలను నియంత్రించవచ్చని, సిమెంట్ తయారీసంస్థలు కుమ్మక్కు కాకుండా చేయవచ్చునని ఆయన సూచించారు. దీంతో చదరపు అడుగుకు అయ్యే ఖర్చు రూ.50 మేర తగ్గే అవకాశం ఉంటుందని ఆయన అంచనావేస్తున్నారు.

ఇండస్‌ఇండ్‌తో జతకట్టిన పేటీఎం పేమెంట్ బ్యాంక్

న్యూఢిల్లీ, జనవరి 6: రోజుకు లక్ష రూపాయల కంటే అధికంగా డిపాజిట్ చేసేవారికి ప్రత్యేక సదుపాయాలు కల్పించే ఉద్దేశంలో భాగంగా పేటీఎం పేమెంట్ బ్యాంక్ ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ ఇండస్‌ఇండ్ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకున్నది. అలాగే బ్యాంకులో డిపాజిట్లను తక్షణమే, ఏ సమయంలోనైనా ఎలాంటి అదనపు చెల్లింపులు జరుపకుండా విత్‌డ్రా చేసుకోవచ్చునని, వార్షిక వడ్డీని 6.85 శాతం వరకు చెల్లించనున్నట్లు బ్యాంక్ ఎండీ రేను సత్తి తెలిపారు. సీనియర్ సిటిజన్లకు అధిక వడ్డీని చెల్లించనున్నది.

Dwaraka


ఆదిలాబాద్‌లో..


యాదాద్రిలో..


నిజామాబాద్‌లో..

1. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ముగ్గులు వేస్తున్న అతివలు
2. భువనగిరిలో నమస్తేతెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ముగ్గు వేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
3. నిజామాబాద్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ ఆకుల సుజాత

సప్తవర్ణ శోభితం

'నమస్తే తెలంగాణ' ముగ్గుల పోటీలకు విశేష స్పందన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని 'నమస్తే తెలంగాణ' ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో, యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరిలో, సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో నిర్వహించిన పోటీలకు మహిళలు, యువతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భువనగిరిలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. పోటీలకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా తదితరులు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.


నిజామాబాద్ జిల్లా మాణిక్‌బండార్‌లో 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ కవిత. (ఇన్‌సెట్) టీఎన్జీవోలు బహూకరించిన తలపాగాతో..

పనులు చేస్తాం.. ప్రతిజ్ఞలు కాదు..

నిజామాబాద్ ఎంపీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని, రైతుల అభ్యున్నతికి ఏమేం చేయాలో అన్నీ చేస్తున్నారని ఎంపీ కవిత అన్నారు. నిజామాబాద్ జిల్లాలో శనివారం ఎంపీ కవిత విస్తృతంగా పర్యటించారు. డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌సార్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లాకేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన టీఎన్జీవోస్ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరై డెయిరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మాక్లూర్ మండలం మాణిక్‌బండార్‌లో రాత్రి నిర్వహించిన 'మన ఊరు-మన ఎంపీ' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.. కొందరు గడ్డాలు పెంచి ప్రతిజ్ఞలు చేస్తారని పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఉద్దేశించి ఆమె ఎద్దేవా చేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిజ్ఞలు చేయదని, ప్రజలకు అవసరమైన పనులు చేసుకుంటూ వెళ్తుందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల కరెంటు, ఎకరాకు పెట్టుబడి ఆర్థిక సహాయం నిమిత్తం రూ. 8వేలు ఇస్తున్న సీఎంను ఎక్కడైనా చూశారా? అని అన్నారు. కేవలం సీఎం కేసీఆర్‌తోనే అది సాధ్యమైందన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ వీజీగౌడ్, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, బేవరేజస్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దఫేదార్ రాజు, మేయర్ ఆకుల సుజాత, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి దాదన్నగారి విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోలపై సీఎంకు ఎనలేని ప్రేమ

టీఎన్జీవోలపై సీఎం కేసీఆర్‌కు ఎనలేని ప్రేమ ఉందని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ కవిత అన్నారు. ప్రభుత్వం, ఉద్యోగులు వేర్వేరు కాదన్నారు. దీపం, వెలుతురుకు ఉన్న మాదిరిగా.. ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య సంబంధం ఉంటుందన్నారు.


వికారాబాద్ జిల్లా పరిగిలో మాట్లాడుతున్న మంత్రి మహేందర్‌రెడ్డి

61 కోట్లతో మౌలిక వసతులు

పరిగి, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని 97 ఆర్టీసీ డిపోల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.61 కోట్లు విడుదల చేసినట్టు రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా పరిగిలో రూ.57.16 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి సభలో మాట్లాడారు. ఆర్టీసీని లాభాల్లోకి తీసుకువచ్చేందుకు 100 కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రం, జిల్లా కేంద్రం, రాజధానికి బస్సులు నడుపనున్నట్టు తెలిపారు. అనంతరం పరిగిలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. పలువురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న వంగపల్లి శ్రీనివాస్ మాదిగ, కంచె ఐలయ్య తదితరులు

న్యాయమైన వాటా కోసమే పోరాటం

నాగార్జునసాగర్ : విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో న్యాయమైన వాటా కోసమే పాతికేండ్లుగా తమ పోరాటం కొనసాగుతుందని టీఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని రెండు తెలుగు రాష్ర్టాల కార్యకర్తల రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. సమాజంలో మొదటి సైంటిస్టులు మాదిగలేనని, స్వచ్ఛ భారత్‌కు పునాది వేసింది కూడామాదిగలేనని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో ప్రతి ఒక్కరూ రాజకీయ స్ఫూర్తి పెంచుకోవాలని కోరారు. అనంతరం ప్రొఫెసర్ కంచె ఐలయ్య మాట్లాడుతూ మాదిగ మహిళ దేశ ప్రధాని అయిన రోజు కుల అసమానతలు తొలగిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ట్రయల్ రన్ సక్సెస్

పరిశీలించిన ప్రపంచ బ్యాంకు బృందం


నీటిసరఫరా తీరును పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కంచరగూడ, అంకుషాపూర్, జండా గూడల్లో మిషన్ భగీరథ ట్రయల్ రన్ విజయవంతమవటంతో ప్రపంచ బ్యాంకు కన్సల్టెన్సీ బృందం సభ్యులు శనివారం ఆయా గ్రామాల్లో పర్యటించి నీటి సరఫరాను పరిశీలించారు. జండాగూడలో ఇంటింటికీ వెళ్లి నీటి సరఫరా తీరుపై ఆరాతీశారు. ఒక్కో నల్లా ద్వారా నిమిషం 20 సెకన్ల వ్యవధిలో 10లీటర్ల నీరు వస్తుండటాన్ని లెక్కించారు. ఈ బృందంలో ఆర్‌ఎన్‌కే ప్రసాద్, రోనక్ అస్వాని, వరల్డ్ బ్యాంక్ ఈఈ రాకేశ్, ఇతర అధికారులు ఉన్నారు.

మేడారానికి 'నయా టెక్నాలజీ'!

క్రౌడ్ డిటెక్షన్, కౌంటింగ్, పార్కింగ్ కెమెరాల ఏర్పాటు

- జాతర సమాచారం కోసం ప్రత్యేక యాప్
- సూచనలు చేసేందుకు దారిలో వీఎంఎస్ బోర్డులు
- ఇప్పటికే డ్రోన్ కెమెరాలతో పహారా


అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో డ్రోన్ కెమెరా

వి.రాజేశ్వర్‌రావు, జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ : మేడారం సమ్మక్కసారలమ్మ మహాజాతర నిర్వహణకు తొలిసారి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఈ మేరకు మహాజాతర జరిగే మేడారం పరిసరాల్లో అందుబాటులో ఉన్న క్రౌడ్ డిటెక్షన్, కౌంటింగ్, పార్కింగ్ కెమెరాలు, సీసీ కెమెరాలను అమర్చే పనిలో తలమునకలైంది. ఈ కెమెరాలను అనుసంధానం చేయటానికి మేడారంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేస్తున్నది. ట్రాఫిక్ నియంత్రణకు ప్రైవేటు వాహనాలు నడిచే రూట్‌లో భక్తులకు సూచనలు చేయటానికి వేర్యబుల్ మెసేజింగ్ సైనేజీ (వీఎంఎస్) బోర్డుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈనెల 31నుంచి ఫిబ్రవరి 3వరకు సమ్మక్కసారలమ్మ మహాజాతర జరుగనున్న విషయం తెలిసిందే. తెలంగాణ కుంభమేళాగా పిలిచే ఈ జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.80.55కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొద్ది నెలలుగా 20 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి. వీటిని ఈనెల 15లోగా పూర్తిచేయాలని ప్రభుత్వం అధికారులకు డెడ్‌లైన్ విధించింది. అమ్మవార్ల దర్శనం కోసం వివిధ రాష్ర్టాల నుంచి వచ్చే భక్తజనం మేడారం చేరుకోవడానికి ప్రధానంగా ఉన్నది ఒకే రహదారి. భక్తులతో మేడారం బయలుదేరే ప్రతీ వాహనం హైదరాబాద్-భూపాలపట్నం 163 నంబర్ జాతీయ రహదారి మీదుగా తొలుత గోవిందరావుపేట మండలం పస్రా గ్రామం వద్దకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి పోలీసులు ప్రైవేటు వాహనాలను దారిమళ్లించి మేడారం చేరుకునే నార్లాపూర్ రూట్‌లో పంపుతారు. ఇక ఆర్టీసీ బస్సులను నేరుగా తాడ్వాయి మండల కేంద్రం మీదుగా పంపిస్తారు. పస్రా నుంచి నార్లాపూర్ రూట్‌లో మేడారం వెళ్లిన ప్రైవేటు వాహనాలు మళ్లీ తిరిగి వెనక్కి రాకుండా.. నార్లాపూర్ నుంచి బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్ గ్రామాల నుంచి సిరొంచ-ఆత్మకూరు 363వ జాతీయ రహదారిలో ఉన్న భూపాలపల్లికి పంపుతారు. ఆర్టీసీ బస్సులను మాత్రం మేడారం వెళ్లిన మార్గంలోనే తిరిగి తాడ్వాయి మీదు గా హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారిలో పంపిస్తారు. 2016లో జరిగిన మేడారం జాతర సమయంలో పోలీసులు ప్రైవేటు వాహనాలను వన్‌వే పద్ధతిన అనుమతించటం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. ఈసారి కూడా వన్‌వే పద్ధతిని అమలు చేయనున్నారు.

పార్కింగ్ సెంటర్ల వద్ద కెమెరాలు.. ప్రత్యేక మొబైల్ యాప్

మహాజాతరలో ట్రాఫిక్ నియంత్రణ, తోపులాట, తొక్కిసలాట వంటివి చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేయటం పోలీసులకు పెను సవాలే. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలన్నీ కూడా 163వ జాతీయ రహదారిలో పస్రా వరకు కలిసే రావాల్సి ఉన్నందున ఈ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. పస్రా నుంచి 25కి.మీ. దూరంలోని నార్లాపూర్ వరకు రహదారి పొడవునా ఇరువైపులా ప్రతి జాతర సమయంలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తారు. ఈ పార్కింగ్ స్థలాలు వాహనాలతో నిండిన సమయంలో భక్తులు ఇబ్బందులు పడుతుండటమే కాకుండా వాహనాల రాకపోకలకూ అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో పోలీసులు ఈసారి పస్రా-నార్లాపూర్ రూట్‌లో ఉన్న ప్రతి పార్కింగ్ కేంద్రం వద్ద వాహనాలు లోపలికి, బయటకు వెళ్లే ద్వారాల వద్ద పార్కింగ్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ కెమెరాల ఏర్పాటుతో ఆయా పార్కింగ్ స్థలాల్లోకి ప్రవేశించిన వాహనాలు ఎన్ని, వీటిలో బయటకు వెళ్లినవి ఎన్ని? అనేది తెలుసుకోవచ్చని భావిస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో ఏది ఖాళీగా ఉంది, ఏ పార్కింగ్ స్థలంలో వాహనం పెట్టుకోవడానికి అవకాశం ఉంది?, సదరు పార్కింగ్ స్థలం నుంచి మేడారం అమ్మవార్ల గద్దెల ప్రాంగణం ఎంత దూరం? అనే సమాచారాన్ని పొందుపర్చేందుకు ప్రత్యేకంగా యాప్ తయారు చేస్తున్నారు. పార్కింగ్ స్థలాల వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో అప్‌లోడ్ చేయటం ద్వారా ప్రైవేటు వాహనాల ద్వారా మేడారం వచ్చే భక్తులకు అందుబాటులోకి తేవాలనే పట్టుదలతో ఎస్పీ భాస్కరన్ ఉన్నారు. పస్రా-నార్లాపూర్ రూట్‌లో 25 కి.మీటర్ల పొడవున వీఎంఎస్ బోర్డులను కూడా ఏర్పాటు చేసి ప్రైవేటు వాహనాల్లో మేడారం వచ్చే భక్తులకు సూచనలు చేయనున్నట్టు ఆయన 'నమస్తే తెలంగాణ'కు చెప్పారు.




మేడారం జాతరలో ఏర్పాటు చేసే వీఎంఎస్ బోర్డులు.. జాతర జరుగనున్న ప్రదేశంలో నిర్మిస్తున్న కంట్రోల్ రూం

డిటెన్షన్ కెమెరాలు



జాతర తొలిరోజున సారలమ్మ, రెండో రోజున సమ్మక్క అమ్మవారు గద్దెకు చేరిన సమయంలో, మూడో రోజున సమ్మక్క,సారలమ్మను భక్తజనం దర్శించుకుని మొక్కులు తీర్చుకునే సమయంలో మేడారంలో అమ్మవార్ల గద్దెల వద్ద, క్యూలైన్లలో తోపులాట, తొక్కిసలాట వంటివి చోటు చేసుకుంటున్నాయి. వీటి నివారణకు మొదటిసారి పోలీసులు ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. క్యూలైన్లలో, అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలోకి ప్రవేశించే, బయటకు వెళ్లే భక్తులను లెక్కించి, రద్దీని గుర్తించే క్రౌడ్ డిటెక్షన్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవార్ల గద్దెల ప్రాంగణం, దర్శనం కోసం రెండు వైపులా ఉన్న క్యూలైన్లు, ఆర్టీసీ కాంప్లెక్స్‌తోపాటు మేడారంలోని వై జంక్షన్, జంపన్నవాగు వద్ద ఉన్న స్నానఘట్టాల వద్ద 10 డిటెన్షన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. మహాజాతర జరిగే పరిసరాల్లో 150 సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. ఈ కెమెరాల సహాయంతో ఎప్పటికప్పుడు పరిస్థితిని వీక్షిస్తూ బందోబస్తు విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. అవసరమైతే అదనపు సిబ్బందిని వినియోగించేందుకు మేడారంలోని పోలీసు క్యాంపు వద్ద కంట్రోల్ రూం నిర్మిస్తున్నారు. భద్రత కోసం మేడారం పరిసరాల్లో ఇప్పటికే డ్రోన్‌కెమెరాలను ఉపయోగిస్తున్నారు.

మాట నిలుపుకొన్న మహానేత

వరంగల్ ప్రధాన ప్రతినిధి-నమస్తే తెలంగాణ:

24 గంటల ఉచిత విద్యుత్‌పై సీఎం కేసీఆర్‌కు వరంగల్ జెడ్పీ ధన్యవాదాలు


వరంగల్ జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కడియం

కరెంట్ కోసం ధర్నాలు రాస్తారోకోలు, సబ్‌స్టేషన్ల ముట్టడి అధికారుల నిర్బంధం వంటి దృశ్యాలను ఏకరువు పెట్టే సన్నివేశాలతో ఒకప్పుడు జరిగిన జెడ్పీ మీటింగ్‌లకు పూర్తి విరుద్ధంగా శనివారం నాటి సమావేశం ప్రశాంతంగా, ప్రజాప్రతినిధుల కరతాళధ్వనుల మధ్య సాగింది. అందుకు కారణం సీఎం కేసీఆర్ తీసుకున్న విప్లవాత్మకమైన నిర్ణయం. స్పష్టమైన తేడాకు, మార్పుకు వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్యసమావేశం వేదికైంది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటు సరఫరా నిర్ణయాన్ని స్వాగతిస్తూ సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతూ వరంగల్ జెడ్పీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. జెడ్పీ చైర్‌పర్సన్ పద్మ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. రైతాంగాన్ని ఆదుకునేందుకు అతిముఖ్యమైన విద్యుత్‌ను అందిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మహానేత కేసీఆర్ అని ఆయన కీర్తించారు. తెలంగాణ ఏర్పడితే కరెంట్ ఉండదని, రాష్ట్రంలో చిమ్మచీకట్లు కమ్ముకుంటాయని ఎగతాళి చేసినవాళ్లే చీకట్లోకి వెళ్లారన్నారు. మండలి విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని ఇతర రాష్ర్టాలు పరిశీలిస్తున్నాయని, ఇప్పటికే పలు పథకాలను అమలు చేస్తున్నాయని మహబూబాబాద్ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ వివరించారు. ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తున్నదని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ పేర్కొన్నారు. పాలకుర్తి, పరకాల, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి దయాకర్‌రావు, చల్లా ధర్మారెడ్డి, బానోతు శంకర్‌నాయక్ ప్రసంగించిన ఈ సమావేశంలో వరంగల్ అర్బన్ కలెక్టర్ ఆమ్రపాలి కాట, వరంగల్ పూర్వ జిల్లా ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాగు పెట్టుబడితో రైతుకు భరోసా

వ్యవసాయ శాఖ మంత్రి పోచారం


నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పోచారం, పక్కన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధ్యక్షతన రైతు సంక్షేమ పథకాలపై ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో కలిసి మంత్రి పోచారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. రైతులు భవిష్యత్తులో ఆత్మగౌరవంగా బతికేలా సీఎం కేసీఆర్ సీజన్‌లో ఎకరాకు రూ.4వేల చొప్పున చెల్లించనున్నారని, ఈ పథకాన్ని వచ్చే పంటకు అందజేయనున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 71,75,096 వ్యవసాయ ఖాతాలు ఉన్నాయని తెలిపారు. సమైక్య పాలనలో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. అందుకే రైతులకు ఎకరానికి రూ.4 వేల చొప్పున రెండు పంటలకు కలిపి ఏడాదికి రూ.8 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించి ఎకరాకు రూ.50 వేలు మిగిలేలా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు సమన్వయ సమితి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో రైతు వేదికలను నిర్మించి పంటలపై అవగాహన కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి మట్లాడుతూ తెలంగాణ ఏర్పడితే అప్పుల ఊబిలో కూరుకుపోతుందని సమైక్య పాలకులు హేళన చేశారని, అదే రైతుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుంటే ఆశ్చర్యపోతున్నారని తెలిపారు. ప్రభుత్వ ధనం దుర్వినియోగం కాకుండా రైతులకు ఏమి చేస్తే బాగుంటుందోనని సీఎం కేసీఆర్ నిరంతరం తపన పడుతున్నారన్నారు. 24గంటల కరెంటు వద్దని, కేవలం 12గంటలు సరిపోతుందని కొందరు రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.


హైదరాబాద్‌లోని సనత్‌నగర్ డివిజన్ కోఠీ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్బర్‌ను అభినందిస్తున్న మంత్రి తలసాని.. వనపర్తిలో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

గులాబీ పార్టీలో భారీగా చేరికలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: గులాబీ పార్టీలోకి వలసలు జోరందుకున్నాయి. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీఆర్‌ఎస్‌లో చేరుతున్నారు. శనివారం కూడా భారీగా చేరారు. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ డివిజన్ అల్లావుద్దీన్ కోఠీ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన మహ్మద్ అక్బర్‌తోపాటు దాదాపు 60 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. వనపర్తిలో రేవల్లి మండలానికి చెందిన 36 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిర్మల్ జిల్లా పెంబిలో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సమక్షంలో, నాగర్‌కర్నూల్ జిల్లా చిట్లంకుంటలో కాంగ్రెస్, టీడీపీలకు చెందిన 200 మంది అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో, ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల బీజేపీ నేత శ్రీహరి 50మందితో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.

వరంగల్ బస్టాండ్‌లో భారీ చోరీ!

దృష్టి మరల్చి నగలు, నగదు అపహరణ


వివరాలు తెలుసుకుంటున్న సీఐ రవికుమార్

వరంగల్ చౌరస్తా : 'మేడం..! అక్కడ పదిరూపాయల నోట్లు పడిపోయాయి. మీయేనా..?' అంటూ ఓ కాంట్రాక్టర్ భార్యను పక్కదారి పట్టించాడు. ఆమె కారు దిగి డబ్బులు తీసుకునే లోపు కారులో ఉన్న బంగారు నగలు, నగదున్న బ్యాగ్‌ను ఎత్తుకొని పరారయ్యాడు. ఈ సంఘటన వరంగల్ బస్టాండ్‌లో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. గొర్రెకుంట అపర్ణ కాలనీ చెందిన ముషిక రవీందర్ కాంట్రాక్టర్. ఖమ్మంలో కాంట్రాక్టు పనులు చేస్తుంటాడు. అక్కడ పని చేస్తున్న కార్మికులకు నిత్యావసర వస్తువులు బస్సు ద్వారా పంపిస్తుంటాడు. ఇదే క్రమంలో శనివారం తన కారులో భార్య రాధతో కలిసి బ్యాంకుకు వెళ్లాడు. బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన మూడున్నర తులాల నెక్లెస్, వజ్రపు ఉంగరం, సుమారు లక్ష రూపాయల నగదును ఓ బ్యాగ్‌లో వేసుకుని అదే కారులో వరంగల్ బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఖాళీ ప్రదేశంలో కారును పార్క్ చేసి, అందులో రాధను ఉంచి బస్టాండ్ లోపలికి వెళ్లాడు. ఇంతలో కారు వద్దకు చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తి పది రూపాయల నోట్లను కారు ముందు విసిరేసి ఈ చోరీకి పాల్పడ్డాడు. భార్య అరవడంతో రవీందర్ పరుగుపరుగున వచ్చి విషయం తెలుసుకున్నాడు. వెంటనే 100 ద్వారా పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంతే జార్‌గంజ్ సీఐ రవికుమార్ అక్కడికి చేరుకొని ఆధారాలు సేకరించారు.



నడవలేని స్థితిలో జయసూర్య

కొలంబో: అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రత్యర్థులకు వణుకు పుట్టించిన శ్రీలంక మాజీ క్రికెటర్ సనత్ జయసూర్య ఇప్పుడు చేతికర్ర సాయం లేనిదే నడవలేకపోతున్నాడు. 48 ఏండ్ల ఈ దిగ్గజ బ్యాట్స్‌మన్ మోకాలి గాయం (నొప్పులు)తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో అతను చిక్సిత కోసం మెల్‌బోర్న్ వెళ్తున్నాడు. చికిత్స, కోలుకోవడానికి నెల రోజుల సమయం పడుతుందని తెలుస్తున్నది. అప్పటి వరకు జయసూర్య వైద్యుల పర్యవేక్షణలోనే ఉంటాడని అతని సన్నిహితులు తెలిపారు. 1996 శ్రీలంక ప్రపంచకప్ గెలువడంలో కీలక పాత్ర పోషించిన జయసూర్య.. రిటైర్మెంట్ తర్వాత సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా రెండుసార్లు పని చేశాడు.


హార్దిక్ (93)

'పేస్'కు దీటుగా

ఓవైపు నిప్పులు కురిపించిన సఫారీ 'పేస్' బలం.. మరోవైపు తోక ముడిచిన టీమ్‌ఇండియా బ్యాటింగ్ బలగం.. ఈ రెండింటి మధ్య నేనున్నాంటూ.. ఒంటరిగా పోరాటం చేశాడు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా. భవిష్యత్ భారత్‌కు తాను ఎంత అవసరమో నిక్కచ్చిగా చూపెడుతూ.. దక్షిణాఫ్రికా గడ్డపై అసలు సిసలు యోధుడిలా చెలరేగిపోయాడు. 76 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో క్రీజులోకి వచ్చిన ఈ యువ కెరటం.. బ్యాటింగ్ సత్తా ఏంటో చూపెడుతూ.. ప్రొటీస్ పేస్‌కు అడ్డుగా నిలుస్తూ భారత్‌కు గౌరవప్రదమైన స్కోరును అందించాడు.

- హార్దిక్ పాండ్యా ఒంటరి పోరాటం
- భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 209 ఆలౌట్
- రెండో ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 65/2


ఫిలాండర్ (3/33)


రబడ (3/34)


స్టెయిన్ (2/51)


మోర్కెల్ (2/57)

కేప్‌టౌన్:

ఊహించినట్లుగానే దక్షిణాఫ్రికా గడ్డపై భారత దిగ్గజాలు బొక్క బోర్లాపడ్డారు. బౌన్సీ పిచ్‌లపై దూసుకొచ్చే బంతులను ఎదుర్కోలేక పెవిలియన్‌కు క్యూ కట్టారు. కానీ ఆల్‌రౌండర్ పాత్రకు అతికినట్లుగా ఆడుతున్న హార్దిక్ పాండ్యా (95 బంతుల్లో 93; 14 ఫోర్లు, 1 సిక్స్) నిలకడైన బ్యాటింగ్‌తో టీమ్‌ఇండియా ఒడ్డున పడేశాడు. భువనేశ్వర్ (25) తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 73.4 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. దీంతో సఫారీ జట్టుకు 77 పరుగుల ఆధిక్యం దక్కింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా రెండో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 2 వికెట్లకు 65 పరుగులు చేసింది. రబడ (2 బ్యాటింగ్), ఆమ్లా (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓవరాల్‌గా ఆతిథ్య జట్టు 142 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

పేస్‌కు వణికారు..

అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 28/3తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్‌ను దక్షిణాఫ్రికా పేసర్లు ఆదిలోనే దెబ్బతీశారు. క్రీజులో అసహనంగా కదిలిన రోహిత్ (11) ఆట మొదలైన కొద్దిసేపటికే తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఫిలాండర్ వేసిన ఆఫ్‌సైడ్ బంతులను ఆడటంలో తీవ్రంగా ఇబ్బందులు పడ్డాడు. రెండో ఎండ్‌లో స్టెయిన్ కూడా కట్టుదిట్టంగా బంతులు వేయడంతో పరుగులు రాబట్టడంతో రోహిత్ విఫలమ్యాడు. ఈ దశలో వచ్చిన అశ్విన్ (12)తో కలిసి పుజార (26) ఇన్నింగ్స్‌ను సుస్థిరం చేసే ప్రయత్నం చేశాడు. కానీ వరుస ఓవర్లలో ఈ ఇద్దరూ ఔట్‌కావడంతో భారత్ 81 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. సహచరులందరూ ఒక్కొక్కరుగా వెనుదిరిగినా.. పాండ్యా మాత్రం నిలకడగా బ్యాటింగ్ చేస్తూ ప్రొటీస్ బౌలర్లను ఆడుకున్నాడు. బలమైన డిఫెన్స్‌కు తోడు సూపర్ షాట్లతో అలరిస్తూ మెల్లమెల్లగా స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. మరో ఎండ్‌లో సాహా డకౌట్ అయినప్పటికీ, భువనేశ్వర్ (25) అండతో చెలరేగి ఆడాడు. వంద లోపే కుప్పకూలుతుందనుకున్న టీమ్‌ఇండియా ఇన్నింగ్స్‌కు ప్రాణం పోశాడు. ఈ క్రమంలో 46 బంతుల్లోనే అర్ధశతకం సాధించిన పాండ్య... ఆ తర్వాత మరింత దూకుడుగా ఆడాడు. మోర్కెల్ వేసిన బౌన్సర్లకు అప్పర్ కట్స్‌తో సమాధానమిస్తూ సెంచరీ దిశగా దూసుకుపోయాడు. అయితే అప్పటి వరకు అండగా నిలిచిన భువీ ఔట్‌కావడంతో ఎనిమిదో వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. పాండ్య 90ల్లోకి చేరడంతో సఫారీ బౌలర్లు లెగ్ స్టంప్‌ను లక్ష్యంగా చేసుకుని బౌన్సర్లతో విసుగెత్తించారు. 93 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రబడ ఆఫ్ స్టంప్ అవతలికి విసిరిన షార్ట్ పిచ్ బంతిని గల్లీ దిశగా ఆడే క్రమంలో పాండ్య వికెట్ కీపర్‌కు చిక్కాడు. దీంతో అద్భుతమైన ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ తర్వాత బుమ్రా (4) వెనుదిరగడంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌కు ముగింపు పడింది. ఫిలాండర్ (3/33), రబడ (3/34) రాణించగా... మోర్కెల్, స్టెయిన్‌కు చెరో 2 వికెట్లు దక్కాయి.

స్కోరు బోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 286 ఆలౌట్

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) ఎల్గర్ (బి) ఫిలాండర్ 1, ధవన్ (సి అండ్ బి) స్టెయిన్ 16, పుజార (సి) డుప్లెసిస్ (బి) ఫిలాండర్ 26, కోహ్లీ (సి) డికాక్ (బి) మోర్కెల్ 5, రోహిత్ ఎల్బీ (బి) రబడ 11, అశ్విన్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 12, పాండ్యా (సి) డికాక్ (బి) రబడ 93, సాహా ఎల్బీ (బి) స్టెయిన్ 0, భువనేశ్వర్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 25, షమీ నాటౌట్ 4, బుమ్రా (సి) ఎల్గర్ (బి) రబడ 2, **ఎక్స్‌ట్రాలు:** 14, **మొత్తం:** 73.4 ఓవర్లలో 209 ఆలౌట్.

వికెట్లపతనం: 1-16, 2-18, 3-27, 4-57, 5-76, 6-81, 7-92, 8-191, 9-199, 10-209.

బౌలింగ్: ఫిలాండర్ 14.3-8-33-3, స్టెయిన్ 17.3-6-51-2, మోర్కెల్ 19-6-57-2, రబడ 16.4-4-34-3, మహారాజ 6-0-20-0.

దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్క్‌రామ్ (సి) భువనేశ్వర్ (బి) పాండ్యా 34, ఎల్గర్ (సి) సాహా (బి) పాండ్యా 25, రబడ బ్యాటింగ్ 2, ఆమ్లా బ్యాటింగ్ 4, **మొత్తం:** 20 ఓవర్లలో 65/2.

వికెట్లపతనం: 1-52, 2-59.

బౌలింగ్: భువనేశ్వర్ 6-3-16-0, బుమ్రా 4-0-14-0, షమీ 5-1-15-0, పాండ్యా 4-0-17-2, అశ్విన్ 1-0-3-0.

స్టెయిన్ ఔట్

రెండో రోజు ఆటలో గాయపడ్డ పేసర్ డెల్ స్టెయిన్.. భారత్‌తో సిరీస్ మొత్తానికే దూరమయ్యాడు. తన 18వ ఓవర్‌లో మూడు బంతులు వేశాక స్టెయిన్ ఎడమ మడమలోని కణజాలం చిరిగిపోవడంతో నొప్పితో విలవిలలాడిపోయాడు. చికిత్స కోసం బయటకు వెళ్లిన అతను మళ్లీ గ్రౌండ్‌లోకి అడుగుపెట్టలేదు. నాలుగు నుంచి ఆరు వారాల విశ్రాంతి అవసరమని డాక్టర్లు తేల్చడంతో సిరీస్ మొత్తానికే దూరం కానున్నాడు. భుజం గాయంతో దాదాపు ఏడాది ఆటకు దూరంగా ఉన్న స్టెయిన్ ఈ మ్యాచ్‌తో పునరాగమనం చేశాడు.

స్విస్‌దే 'హోప్‌మన్' కప్



పెర్త్: కీలకమైన మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్ రోజర్ ఫెదరర్-బెనిచ్ జోడీ అదురగొట్టడంతో.. స్విట్జర్లాండ్ ముచ్చటగా మూడోసారి 'హోప్‌మన్' కప్‌ను సొంతం చేసుకుంది. శనివారం జరిగిన మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో స్విస్ జట్టు 2-1తో జర్మనీపై గెలిచింది. సింగిల్స్‌లో ఫెదరర్ 6-7 (4/7), 6-0, 6-2తో జ్వరేవ్‌పై నెగ్గాడు. మహిళల సింగిల్స్‌లో కెర్బర్ (జర్మనీ) 6-4, 6-1తో బెనిచ్‌ను ఓడించడంతో స్కోరు 1-1తో సమమైంది. ఫాస్ట్ ఫోర్ మిక్స్‌డ్‌లో ఫెదరర్-బెనిచ్ జంట 4-3 (4), 4-3 కెర్బర్-జ్వరేవ్‌పై గెలిచి టైటిల్‌ను అందుకున్నారు. 2001 తర్వాత స్విస్ ట్రోఫీని దక్కించుకోవడం ఇది రెండోసారి.


ఖవాజ (171)

ఖవాజ సెంచరీ

- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 479/4

సిడ్నీ: యాషెస్ సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా ఆధిపత్యం దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఉస్మాన్ ఖవాజ (381 బంతుల్లో 171, 18 ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీతో ఆకట్టుకోవడంతో 193/2 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆసీస్.. 479/4 స్కోరు చేసింది. స్టీవ్‌స్మిత్ (83), షాన్ మార్ష్ (98 నాటౌట్), మిచెల్ మార్ష్ (63 నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించారు. ఖవాజ ..స్మిత్‌తో కలిసి మూడో వికెట్‌కు 188 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. షాన్‌మార్ష్ జతగా నాలుగో వికెట్‌కు ఖవాజ 101 పరుగులు జోడించాడు. టెస్ట్‌ల్లో అత్యుత్తమ స్కోరు చేరువైన ఖవాజ అరంగేట్రం స్పిన్నర్ క్రేన్ బౌలింగ్‌లో స్టంప్ ఔటయ్యాడు. ఆఖర్లో మార్ష్ సోదరులు ఐదో వికెట్‌కు 104 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. చేతిలో ఆరు వికెట్లు ఉన్న ఆసీస్ ప్రస్తుతం 133 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.



సైమన్‌కు 'టాటా ఓపెన్'

పుణె: అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఫ్రెంచ్ ఆటగాడు గైల్స్ సైమన్.. 'టాటా ఓపెన్ మహారాష్ట్ర' ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సైమన్ 7-6 (4), 6-2తో కెవిన్ అండర్సన్ (దక్షిణాఫ్రికా)పై గెలిచాడు. దాదాపు గంటన్నరకు పైగా సాగిన ఈ మ్యాచ్‌లో భారీ సర్వీస్‌లు కొట్టే అండర్సన్.. సైమన్ ధాటిని తట్టుకోలేకపోయాడు. వ్యూహాత్మక షాట్లతో చెలరేగిన సైమన్.. కీలక సమయంలో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి పట్టు బిగించాడు. హోరాహోరీగా సాగిన తొలిసెట్‌లో అండర్సన్ గట్టిపోటీ ఇచ్చినా.. అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. రెండోసెట్‌లో రెండు సర్వీస్‌ను చేజార్చుకుని మ్యాచ్‌ను కోల్పోయాడు. 2015 తర్వాత సైమన్ గెలిచిన తొలి టైటిల్ ఇదే కావడం విశేషం.

బాబోయ్.. ఈ ఆవులు మాకొద్దు!

రోహ్‌తక్: ఎవరైనా అవార్డులు ఇస్తే మళ్లీ దానిని వెనక్కి ఇస్తారా..? సాధారణంగా అయితే ఎవరూ ఇవ్వరు. కానీ హర్యానా మహిళా బాక్సర్లు మాత్రం 'మీరు ఇచ్చిన ఈ అవార్డులు మాకొద్దు' అని వాపస్ ఇచ్చేస్తున్నారు. ఇంతకీ ఏం అవార్డులు అనుకుంటున్నారా.. 'దేశీ ఆవులు'. మొన్న గువాహటిలో జరిగిన యూత్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నీతూ, సాక్షి, జ్యోతి, శశి స్వర్ణాలు గెలువగా, అనుపమ, నేహా కాంస్యాలు దక్కించుకున్నారు. అయితే ఈ అద్భుత ప్రదర్శనకు మెచ్చిన రాష్ట్ర ప్రభుత్వం వీళ్లకు పురస్కారం కింద మేలు జాతి దేశీ ఆవులను బహూకరించింది. తీసుకున్న ఆవులను కట్టేయడానికి ఇంట్లో స్థలం చాలకపోవడంతో పాటు రోజూ ఓ కుటుంబ సభ్యుడ్ని గాయపరుస్తున్నాయి. దీనికి తోడు పాలు కూడా ఇవ్వడం లేదు. ఈ పరిణామాలకు కంగుతిన్న బాక్సర్లు మీ ఆవులు మాకొద్దు అంటూ వాటిని వెనక్కి ఇచ్చేశారు. 'పాలు పితకడానికి వెళ్లిన మా అమ్మను తన్నడంతో కిందపడి చేయి విరిగింది. ఇంటి పక్కన ఉన్న వాళ్లని పిలిచినా అతనిపైనా దాడి చేసింది. చేసేదేమీలేక ఆవును వెనక్కి ఇచ్చాం. మరోటి ఇస్తామని చెప్పి తీసుకెళ్లారు' అని బాక్సర్ జ్యోతి సోదరుడు ధరంబీర్ గులియా వెల్లడించాడు.

నిహారిక ఓటమి



రోహ్‌తక్: జాతీయ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ బాక్సర్ నిహారిక గోనెల్లకు చుక్కెదురైంది. శనివారం జరిగిన హెవీ వెయిట్ (82 కేజీ) విభాగంలో సీమా పూనియా (ఆర్‌ఎస్‌పీబీ) 5-0తో నిహారికపై గెలిచింది. మూడు రౌండ్లలోనూ తెలంగాణ అమ్మాయి పంచ్ పవర్ చూపించలేకపోయింది. 45-48 కేజీ కేటగిరిలో మానస (తెలంగాణ) 2-3తో పూజ రాన్‌పాల్ (సిక్కిం) చేతిలో ఓడింది.

'బ్రిటిష్' ఫైనల్లో నీల్ జోషి

బర్మింగ్‌హామ్: బ్రిటిష్ జూనియర్ ఓపెన్ స్క్వాష్ టోర్నీలో భారత ఆటగాడు నీల్ జోషి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శనివారం జరిగిన బాలుర అండర్-15 సెమీఫైనల్లో నీల్ 13-11, 11-9, 5-11, 3-11, 11-8తో రెండో సీడ్ మహ్మద్ అమీర్‌పై విజయం సాధించాడు. ఐదు సెట్ల పాటు జరిగిన పోరులో నీల్ అద్భుతంగా పోరాడాడు. ఆదివారం జరిగే ఫైనల్లో టాప్‌సీడ్ సామ్యుల్ టాడ్(ఇంగ్లండ్)తో తలపడుతాడు. బాలుర అండర్-17 విభాగంలో తుషార్ సెమీస్‌కు చేరాడు.



విలియమ్సన్ సెంచరీ

కివీస్‌దే తొలి వన్డే

వెల్లింగ్టన్: వన్డేల్లో పాకిస్థాన్ వరుస విజయాల(9) పరంపరకు న్యూజిలాండ్ బ్రేక్ వేసింది. శనివారం పాక్‌తో జరిగిన తొలి వన్డేలో కివీస్ 61 పరుగుల(డక్‌వర్త్ లూయిస్) తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. కెప్టెన్ విలియమ్సన్(117 బంతుల్లో 115, 8ఫోర్లు, సిక్స్) సెంచరీతో కివీస్ నిర్ణీత 50 ఓవర్లలో 315/7 స్కోరు చేసింది. ఓపెనర్లు కొలిన్ మున్రో(58), మార్టిన్ గప్టిల్(48) శుభారంభాన్ని అందించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 83 పరుగులు జోడించారు. మున్రో ఔట్ తర్వాత క్రీజులోకొచ్చిన విలియమ్సన్..గప్టిల్‌తో కలిసి ఇన్నింగ్స్ స్వరూపానే మార్చేశాడు. పాక్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ కివీస్ కెప్టెన్ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. మిడిలార్డర్ విఫలమైనా చివర్లో నికోలస్(50) అర్ధసెంచరీతో రాణించడంతో కివీస్ 300 మార్క్ అందుకుంది. హసన్ అలీ(3/61)కు మూడు వికెట్లు దక్కాయి. వర్షం అంతరాయం కారణంగా 30.1 ఓవర్లకు 228 లక్ష్యంగా నిర్దేశించారు. సౌథీ(3/22), బౌల్ట్(2/35) ధాటికి పాక్ 30.1 ఓవర్లలో 166/6 స్కోరుకు పరిమితమైంది. ఫక్హర్ జమాన్(82) మినహా ఎవరూ రాణించలేకపోయారు. సెంచరీతో ఆకట్టుకున్న విలియమ్సన్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.


హలెప్

హలెప్‌కు 'షెన్‌జెన్' టైటిల్

షెన్‌జెన్: ప్రపంచ నంబర్‌వన్ సిమోనా హలెప్.. ఈ ఏడాది తొలి టైటిల్‌ను ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగిన షెన్‌జెన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో హలెప్ (రొమేనియా) 6-1, 2-6, 6-0తో కెటరీనా సైనకోవా (చెక్)పై గెలిచింది. వర్షం అంతరాయం కలిగించడంతో ఆరు గంటలు ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌లో.. హలెప్ అరగంటలోనే తొలిసెట్‌ను సొంతం చేసుకుంది. రెండోసెట్ చేజారినా.. నిర్ణాయక మూడో సెట్‌లో తన హవా కొనసాగించింది. సర్వీస్‌ను కోల్పోయిన సైనకోవా.. డబుల్ ఫాల్ట్ చేయడంతో హలెప్ 3-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఐదో గేమ్‌లో ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి తన రెండు సర్వీస్‌లను కాపాడుకుంది.

'బ్రిస్బేన్' విజేత స్వితోలినా..


స్వితోలినా

తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీపై కన్నేసిన ఉక్రెయిన్ టాప్ ప్లేయర్ ఎలినా స్వితోలినా.. బ్రిస్బేన్ ఇంటర్నేషన్ మహిళల టైటిల్‌ను చేజిక్కించుకుంది. శనివారం జరిగిన ఫైనల్లో స్వితోలినా 6-2, 6-1తో క్వాలిఫయర్ అలిక్‌సంద్రా సస్నోవిచ్ (బెలారస్)పై గెలిచింది. స్వితోలినా కెరీర్‌లో ఇది పదో టైటిల్.



ఇమ్రాన్.. మూడో పెండ్లి?

లాహోర్: పాకిస్థాన్ మాజీ క్రికెటర్, తెహ్రీక్ ఇన్సాఫ్ పార్టీ (పీటీఐ) అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ రహస్యంగా మూడో పెండ్లి చేసుకున్నట్టు తెలుస్తున్నది. మొన్న జనవరి 1న లాహోర్‌లో తన ఆధ్యాత్మిక గురువును నిఖా చేసుకున్నట్లు సమాచారం. పీటీఐ కోర్ కమిటీ సభ్యుడు ముఫ్తీ సయీద్ ఈ నిఖాను జరిపించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇమ్రాన్ వివాహ వేడుకకు పీటీఐ రాజకీయ కార్యదర్శి అవాన్ చౌదరి హాజరైనట్టు కథనాలు వెలువడినా.. ఆయన వాటిని ఖండించాడు. ఇక ఈ వార్తలను పీటీఐ పార్టీ అధికారి ప్రతినిధి నయీముల్ హక్ తోసిపుచ్చాడు. ఒకవేళ ఇమ్రాన్ పెండ్లి చేసుకోవాలని భావిస్తే.. 2018 ఎన్నికల తర్వాత ఇది ఉంటుందన్నాడు. ఇమ్రాన్ నిఖా చేసుకున్న ఆధ్యాత్మిక గురువుకు ఇప్పటికే పెండ్లి అయిందని, ఇటీవలే తన భర్తకు విడాకుల నోటీసు కూడా పంపింది. ఈ విషయాన్ని ఆమె భర్త ధ్రువీకరించినా.. ఇమ్రాన్‌తో పెండ్లి వార్తలను కొట్టిపారేశాడు. పాకిస్థాన్ క్రికెట్‌లో తనదైన ముద్ర వేసిన ఈ మాజీ పేసర్ గతంలో రెండు సార్లు పెండ్లి చేసుకుని, వారికి విడాకులు ఇచ్చాడు. 1995, మే16న జెమీమా ఖాన్‌ను నిఖా చేసుకోగా తొమ్మిదేండ్ల తర్వాత ఆమెకు విడాకులిచ్చాడు. ఇక గతేడాది టీవీ యాంకర్ రెహమ్‌ఖాన్ ను పెండ్లి చేసుకుని పది నెలల తర్వాత ఆమెతో విడిపోయాడు.



సింధు జోరు..చెన్నై గెలుపు

చెన్నై: భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అద్భుత ఆటతీరు ప్రదర్శించడంతో చెన్నై స్మాషర్స్ 2-1తో అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌పై విజయభేరి మోగించింది. సింధు మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో విజయాలు సాధించి కీలకపాత్ర పోషించింది. శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో మొదట పురుషుల డబుల్స్‌లో నందగోపాల్, రెజినాల్డ్ (అహ్మదాబాద్) జోడి 15-13, 15-12తో క్రిస్ అడ్‌కాక్, లీయాంగ్ పై గెలువగా...మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు (చెన్నై) 15-11, 10-15, 15-12తో తై తెజుపై, పురుషుల సింగిల్స్‌లో సౌరభ్ వర్మ (అహ్మదాబాద్) 12-15, 15-14, 15-12తో లెవర్డెజ్‌పై, టనాంగ్సాక్ (చెన్నై) 15-10, 12-15, 15-14తో ప్రణయ్‌పై గెలిచాడు. ఇక నిర్ణయాత్మక మిక్స్‌డ్ డబుల్స్‌లో సింధు, సుమిత్ జోడి 15-14, 15-13తో కమిల్లా, రెజినాల్డ్‌పై విజయం సాధించారు.

అజ్ఞాతవాసి సినిమాకు రండి


శనివారం సచివాలయంలోని చాంబర్‌లో మంత్రి తలసానితో దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, నిర్మాత రాధాకృష్ణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రముఖ సినీదర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, అజ్ఞాతవాసి సినిమా నిర్మాత రాధాకృష్ణ శనివారం సచివాలయంలోని సినిమాటోగ్రఫీశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. ఈ నెల 10న విడుదల కానున్న అజ్ఞాతవాసి చిత్రాన్ని చూడాలని వారు మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. త్రివిక్రమ్ శ్రీనివాస్ అనుభవం గల దర్శకుడని.. అజ్ఞాతవాసి చిత్రం ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ రామ్మోహన్‌రావు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మేడారం జాతరకు నాలుగు వేల బస్సులు

50 కేంద్రాల నుంచి బస్సుల సదుపాయం



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు జరిగే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నాలుగు వేల బస్సులను నడుపాలని ఆర్టీసీ నిర్ణయించింది. రాష్ట్రంలోని 50 కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపాలని నిర్ణయించారు. ఈ సారి జాతర సమయంలో 10 లక్షల నుంచి 12 లక్షల మంది ఆర్టీసీ సేవలు ఉపయోగించుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. వరంగల్, హన్మకొండ, కాజీపేటతో పాటు కరీంనగర్, మంచిర్యాల, గోదావరిఖని, పెద్దపల్లి తదితర 50 కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. మేడారంలో ఆర్టీసీ తాత్కాలిక టెర్మినల్, వసతుల కల్పనపై పదో తేదీన ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావు హైదరాబాద్ లేదా వరంగల్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ముందస్తు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆర్టీసీ ఈడీలు సత్యనారాయణ, రవీందర్ మరికొందరు శనివారం మేడారం వెళ్లారు. పర్యటనలో పూర్వ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల రీజినల్ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్, యాప్ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి శనివారం సచివాలయంలో ఆవిష్కరించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ ఈ నెల 13 నుంచి 15 వరకు పరేడ్ మైదానంలో అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ నిర్వహిస్తుండటంతో యాప్‌ను రూపొందించినట్టు తెలిపారు. ఫెస్టివల్‌లో 15 దేశాలకు చెందిన 1000కిపైగా స్వీట్లు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ టూరిజం, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.


శనివారం సచివాలయంలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ఆవిష్కరిస్తున్న కేవీ రమణాచారి, బుర్రా వెంకటేశం, మామిడి హరికృష్ణ తదితరులు

వ్యవసాయశాఖ కార్యదర్శికి ఎన్ఎస్ఏఐ ఆహ్వానం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథికి నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఏఐ) నుంచి ఆహ్వానం అందింది. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరుగనున్న ఇండియన్ సీడ్ కాంగ్రెస్-2018 ప్రారంభోత్సవంలో ఆయన కీలకోపన్యాసం చేయనున్నారు. దేశంలో విత్తనరంగ అభివృద్ధికి అవసరమైన చర్యలపై చర్చించేందుకు ఎన్ఎస్ఏఐ 2010 నుంచి ఏటా ఇండియన్ సీడ్ కాంగ్రెస్‌ను నిర్వహిస్తున్నది. సదస్సుకు కేంద్ర వ్యవసాయశాఖమంత్రి రాధామోహన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారు.

విప్‌ల సదస్సుకు వెళ్లనున్న ఆరుగురి బృందం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనున్న పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు, శాసనమండళ్ల ప్రభుత్వ విప్‌ల సదస్సుకు రాష్ట్రం నుంచి ఆరుగురు సభ్యుల బృందం వెళ్లనున్నది. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న సదస్సుకు మండలి చీఫ్‌విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, శాసనసభ విప్‌లు గొంగిడి సునీత, గంప గోవర్ధన్, అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు ఆదివారం ఉదయం బయలుదేరనున్నారు.



ఇంటిగ్రేటెడ్ పోలీసు భవనాల నమూనా.. కామారెడ్డి జిల్లాలో పోలీసు భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్ గుప్తా, ఎండీ మల్లారెడ్డి

15 జిల్లాల్లో ఇంటిగ్రేటెడ్ పోలీసు భవనాలు

- **ప్రతి జిల్లాలో 25 ఎకరాల్లో రూ. 25 కోట్లతో భవన నిర్మాణం**
- **రూ. 375 కోట్లతో పనులు: పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ వెల్లడి**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముఖ్యమంత్రి బంగారు తెలంగాణ కలను సాకారం చేయడంలో భాగంగా రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రగతిపథంలో ముందుకెళ్తున్నది. సీఎం కేసీఆర్ ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా నూతన జిల్లాల్లో పోలీసుశాఖ భవనాల నిర్మాణాన్ని చేపడుతున్నది. భవనాల డిజైన్ల కోసం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, డీజీపీ, ఎండీ, సీఈలు పలు రాష్ట్రాలు, విదేశాల్లో భవనాలను పరిశీలించి డిజైన్లు రూపొందించారు. వీటికి సీఎం కేసీఆర్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో అత్యాధునిక పద్ధతుల్లో 15 జిల్లాల్లో రూ.375 కోట్లతో 'ఇంటిగ్రేటెడ్ పోలీసు భవనాల' నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో భవనానికి రూ.25 కోట్ల ఖర్చు చేస్తున్నామని, 25 ఎకరాల విస్తీర్ణంలో భవనాన్ని నిర్మిస్తున్నామని కోలేటి దామోదర్ గుప్తా శనివారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కొత్త జిల్లాలైన నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, నాగర్‌కర్నూల్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఎస్పీ భవనాలు, సిద్దిపేట, రామగుండంలో పోలీసు కమిషనరేట్ భవనాలకు శ్రీకారం చుట్టారు. 15 పోలీసు అధికారుల భవనాలతో పాటు, అధికారుల రెసిడెన్సీ, ఏఆర్ హెడ్ క్వార్టర్స్, రెండు బ్యారక్స్, ఇతర భవనాలు నిర్మిస్తున్నారని దామోదర్‌గుప్తా తెలిపారు. ఇప్పటివరకు 11 జిల్లాల్లో పనులకు శంకుస్థాపనలు జరిగాయి. మిగతా నాలుగు జిల్లాల్లో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా జిల్లా పోలీసు భవనాన్ని 45,000 చ.అ. విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. నిర్మాణరంగంలో ప్రతిభను చాటుకోవడంతో పాటు అక్రమాలకు తావులేకుండా తెలంగాణ పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్.. పూర్తి పారదర్శకంగా ఆడిట్ విధానాన్ని రూపొందించుకున్నది.

టీసాట్.. సూపర్ హిట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోసం టీసాట్ నెట్‌వర్క్ చానళ్లు 'టీఆర్టీ ఉద్యోగ గైడ్' పేరుతో చేస్తున్న ప్రసారాలకు విస్తృత ఆదరణ లభిస్తున్నదని, ఇవి సూపర్ హిట్ అయ్యాయని టీసాట్ సీఈవో ఆర్ శైలేశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాము చేస్తున్న ప్రసారాలకు కేవలం 15 రోజుల్లో 10,36,702 వ్యూస్ లభించగా.. 7,551 సబ్‌స్క్రైబ్స్ లభించాయని చెప్పారు. వాచ్‌టైం 5,77,664 నిమిషాలు ఉండగా, షేర్లు 16,338 ఉండటం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. సుమారు 30 మంది అనుభవజ్ఞులైన ఉపన్యాసకులతో రోజుకు 10 గంటలచొప్పున 150 గంటల ప్రసారాలను అందించిన ఘనత టీసాట్-సాఫ్ట్‌నెట్‌కు దక్కిందని ఆయన వెల్లడించారు.

మరో రెండు చానళ్లు

టీసాట్ నెట్‌వర్క్ ద్వారా ప్రసారమవుతున్న నాలుగు చానళ్లకు అదనంగా మరో రెండు చేరాయి. ఇందులో ఇప్పటికే ఏపీకి రెండింటిని కేటాయించారు. అదనంగా వచ్చిన రెండు చానళ్లతో కలిసి తెలంగాణ ప్రజలకు నాలుగు అందుబాటులోకి వచ్చాయి. ప్రేక్షకులు సింబల్ రేటును 11.63ఎంఎస్పీఎస్/11630కేఎస్/ఎస్, ఎఫ్ఈసీని 3/4గా ట్యూన్ చేసుకోవాలి.

నేవీలో ఎస్ఎస్‌సీ ఆఫీసర్లు

ఇండియన్ నేవీ జనరల్ సర్వీస్/హైడ్రో క్యాడర్‌లో ఖాళీగా ఉన్న షార్ట్ సర్వీస్ కమిషన్ ఆఫీసర్ (ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచ్), ఎన్ఏఐసీలో పర్మినెంట్ కమిషన్ ఆఫీసర్ కోర్సు కోసం అర్హత గల అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను ఇండియన్ నేవల్ అకాడమీ విడుదల చేసింది.

- బీఈ/బీటెక్ చేసిన అభ్యర్థులకు నేవీలో ఉద్యోగాలు
- శిక్షణ తర్వాత సబ్ లెఫ్టినెంట్ హోదా
- చాలెంజింగ్ కెరీర్.. ఉద్యోగ భద్రత
- చివరితేదీ: జనవరి 25



వివరాలు:

భారత నౌకాదళంలో ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ బ్రాంచ్‌లో షార్ట్ సర్వీస్/పర్మినెంట్ కమిషన్ ఆఫీసర్ కోర్సు ద్వారా ఈ పోస్టులను భర్తీచేస్తారు. కేరళ (ఎజిమల)లోని ఇండియన్ నేవల్ అకాడమీలో 2019, జనవరి నుంచి ఈ కోర్సు ప్రారంభమవుతుంది.

- ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ (జనరల్ సర్వీస్ హైడ్రోగ్రఫీ క్యాడర్)- 40
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ప్రథమ శ్రేణిలో ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- ఎగ్జిక్యూటివ్ బ్రాంచీ (ఎన్ఏఐసీ)- 8
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ & ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్/టెలి కమ్యూనికేషన్ లేదా ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్, మైక్రో ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంట్రోల్, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్/ప్రొడక్షన్, ఏరోస్పేస్, మెటలర్జీ, మెటలర్జికల్, కెమికల్, మెటీరియల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, కంప్యూటర్ అప్లికేషన్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **టెక్నికల్ బ్రాంచీ (జనరల్ సర్వీస్)- 27**
- **అర్హత:** మెకానికల్, మెరైన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రొడక్షన్, ఏరోనాటికల్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, కంట్రోల్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, మెటలర్జీ, మెకట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- **టెక్నికల్ బ్రాంచీ (ఎలక్ట్రికల్)- 33**
- **అర్హత:** ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, పవర్/ కంట్రోల్ సిస్టమ్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఏవియానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ & కంట్రోల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- నేవల్ ఆర్నమెంట్ ఇన్‌స్పెక్టరేట్ క్యాడర్ (ఎన్ఏఐసీ) పోస్టులను మాత్రమే పర్మినెంట్ కమిషన్ కింద, మిగతావి ఎస్ఎస్‌సీ ద్వారా భర్తీ చేస్తారు.
- **వయస్సు:** 1994 జనవరి 2 నుంచి 1999 జూలై 1 మధ్య జన్మించి ఉండాలి.

శారీరక ప్రమాణాలు

- ఎగ్జిక్యూటివ్/టెక్నికల్ (జనరల్ సర్వీస్/హైడ్రో క్యాడర్, ఎన్ఏఐసీ) అభ్యర్థులు -157 సెం.మీ. ఎత్తు ఉండాలి.
- కంటిచూపు: ఎగ్జిక్యూటివ్ పోస్టులకు 6/12, 6/12, 6/60, 6/60, జనరల్ సర్వీస్ పోస్టులకు 6/24, 6/24
- ఎత్తుకు తగ్గ బరువు ఉండాలి.
- **ఎంపిక విధానం:** అభ్యర్థులను నేవల్ క్యాంపస్ సెలక్షన్ టీమ్ ఎంపిక చేస్తుంది. పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) షార్ట్‌లిస్ట్ చేస్తుంది. తర్వాత వారికి ఇంటర్వ్యూ కాల్‌లెటర్ పంపిస్తారు.
- ఎస్ఎస్‌బీ షార్ట్‌లిస్ట్ అయిన అభ్యర్థులకు రెండు దశల్లో ఎంపిక ప్రక్రియను చేపడుతుంది. వీరికి బెంగళూరు, భోపాల్, కోయంబత్తూరు, విశాఖపట్నంలో 2018, మే - జూలై నెలల మధ్య ఇంటర్వ్యూలను నిర్వహిస్తారు.
- ఇంటర్వ్యూల్లో మొదటి దశలో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్‌సెప్షన్, డిస్కషన్ టెస్ట్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రెండో దశలో సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్టింగ్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.
- మెడికల్ ఫిట్ అయిన అభ్యర్థుల జాబితాను ఖాళీల సంఖ్యను బట్టి ఎస్ఎస్‌బీ ప్రకటిస్తుంది.
- **శిక్షణ:** 2019, జనవరి నుంచి..
- ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పే స్కేల్:** రూ. 56,100-1,10,700 + ఎంఎస్‌పీ రూ. 15,500/-
- సబ్ లెఫ్టినెంట్‌గా ఎంపికైన వారికి బేసిక్ పే, డీఏ, గ్రేడ్ పే, మిలిటరీ సర్వీస్ పే, హెచ్ఆర్ఏ, రేషన్, ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌లతో కలిపి జీతం చెల్లిస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో ఈ-అప్లికేషన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 25
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఈసీఐఎల్‌లో సైంటిఫిక్ అసిస్టెంట్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఈసీఐఎల్) టెక్నికల్ ఆఫీసర్, సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- టెక్నికల్ ఆఫీసర్- 5 పోస్టులు
- **అర్హత:** ఎమ్మెస్సీ (ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్), ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- పే స్కేల్: రూ. 21,000/- (కన్సాలిడేటెడ్ పే)
- సైంటిఫిక్ అసిస్టెంట్-4 పోస్టులు
- **అర్హత:** ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిప్లొమా పథమశ్రేణిలో ఉత్తీర్ణత.
- పే స్కేల్: రూ. 16,978/- (కన్సాలిడేటెడ్ పే)
- జూనియర్ ఆర్టిషియన్- 2
- **అర్హత:** ఎలక్ట్రానిక్ మెకానిక్ ట్రేడ్‌లో ఐటీఐ.
- పే స్కేల్: రూ. 15,418/- (కన్సాలిడేటెడ్ పే)
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 15
- **వెబ్‌సైట్:** www.ecil.co.in

బీహెచ్ఈఎల్‌లో సూపర్‌వైజర్లు

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) సివిల్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎగ్జిక్యూటివ్ (ఇంజినీర్), సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- మొత్తం పోస్టులు: 25
- ఎగ్జిక్యూటివ్ (సివిల్ ఇంజినీర్)- 12
- **అర్హత:** సివిల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్ లేదా ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ/డ్యూయల్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- సూపర్‌వైజర్-13
- **అర్హత:** సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా/తత్సమాన పరీక్షలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 37 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17
- **వెబ్‌సైట్:** http://careers.bhel.in

ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూలో ఎల్‌డీసీలు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



కేంద్ర కుటుంబ ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలో ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ పనిచేస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 12
- స్టెనోగ్రాఫర్- 5 పోస్టులు (జనరల్-1, ఓబీసీ-2, ఎస్సీ-1, ఎస్టీ-1)
- **అర్హత:** పదోతరగతి/మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణత. టైప్‌రైటింగ్/షార్ట్ హ్యాండ్‌లో నిమిషానికి 40/80 పదాలు టైపింగ్ చేయగలగాలి.
- **వయస్సు:** 18 -30 ఏండ్ల మధ్య ఉండాలి.
- లోయర్ డివిజన్ క్లర్క్-7 పోస్టులు (జనరల్-3, ఓబీసీ-3, ఎస్సీ-1)
- **అర్హత:** పదోతరగతి/మెట్రిక్యులేషన్‌లో ఉత్తీర్ణత. నిమిషానికి 30 పదాల వేగంతో టైపింగ్ చేయాలి.
- **వయస్సు:** 18-25 ఏండ్ల మధ్య ఉండాలి
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 200/-
- **ఎంపిక:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** 2018 ఫిబ్రవరి 5
- **వెబ్‌సైట్:** www.nihfw.org

ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీలో

బెంగళూరులోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:




ఇది రక్షణశాఖ పరిధిలో పనిచేస్తున్నది.

- **పోస్టు పేరు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్
- మొత్తం ఖాళీల సంఖ్య: 24
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో ప్రథమశ్రేణిలో బీఈ/బీటెక్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణతతోపాటు గేట్-2016/2017 స్కోర్ ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 25,000/-
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** గేట్ స్కోర్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా. ఈ -మెయిల్ (pacada@jetmail.ada.gov.in / subhash@jetmail.ada.gov.in) ద్వారా పంపించవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** జనవరి 10
- **వెబ్‌సైట్:** www.ada.gov.in

ఎస్‌వీబీపీలో ప్రొఫెసర్లు

మీరట్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ (ఎస్‌వీబీపీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- **పోస్టు పేరు:** ప్రొఫెసర్
- మొత్తం ఖాళీల సంఖ్య: 23
- ప్రొఫెసర్- 5
- అసోసియేట్ ప్రొఫెసర్- 6
- అసిస్టెంట్ ప్రొఫెసర్- 12
- **అర్హత:** పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. సంబంధిత సబ్జెక్టులో పీహెచ్‌డీ లేదా నెట్/స్లెట్ అర్హత సాధించాలి. రిసెర్చ్/టీచింగ్ విభాగంలో అనుభవం ఉండాలి
- **ఎంపిక:** రాత పరీక్ష/పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో.
- **చివరితేది:** జనవరి 31
- **వెబ్‌సైట్:**www.svbpmeerut.ac.in